ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 07.03.2026 | సంపుటి :12 సంచిక : 227 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




# ఎస్సీ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాట

## భవిష్యత్తులో మాదిగల హక్కులకు చట్టబద్ధత కల్పిస్తాం



- మిత్రధర్మానికి కట్టుబడి వారి వెంట నిలబడ్డాను
- గత ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలను ఇచ్చింది
- మాదిగలు కూడా ఐఏఎస్, ఐపీఎస్, ఎమ్మెల్యేలు, ఎంపీలు కావాలి
- విద్యకు మా ప్రభుత్వం పెద్దపీట వేసింది
- ప్రజలకు ఇవ్వగలిగే ఆస్తి చదువొక్కటే
- అందరం కలిసి కట్టుగా పనిచేయాలి
- ప్రజల మద్దతుతో పాలన సాగిస్తున్నాం
- మీ అందరి సహకారంతోనే గెలిచాం
- మాటలు, మూటలతో విజయం సాధించాం
- మా వద్ద ఎలాంటి అక్రమ సంపాదనా లేదు
- మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**చిత్తశుద్ధితో ప్రజాసమస్యలు పరిష్కరిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ శిల్పకళావేదికలో మాదిగ ఎంప్లాయిస్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పుడున్నది మీరంతా కోరుకున్న ప్రభుత్వమని తెలిపారు. ఇది మీరంతా కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ఎన్నికల్లో మీరంతా తమకు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. మార్పు కోసమే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని వివరించారు. తమది పేదల పక్షపాత ప్రభుత్వమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. గత పాలకులు ఎన్నో అక్రమాలు చేశారని సీఎం రేవంత్ విమర్శించారు. గత ఎన్నికల్లో తాము మాటలు, మూటలతో గెలవలేదని కుండబద్దలు కొట్టారు. కేవలం ప్రజల మద్దతుతోనే తాము అధికారంలోకి వచ్చామని చెప్పారు. తమ వద్ద ఎలాంటి అక్రమ సంపాదన లేదన్నారు. వర్గీకరణ కోసం మాదిగ జాతి మిగతా 2లో..

"మాదిగలు కూడా ఐఏఎస్, ఐపీఎస్, ఎంపీ, ఎమ్మెల్యేలు అవ్వాలి. మీ ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యత నాది. మీ సమస్యలు పరిష్కరించేటప్పుడు అడ్డుకునే వారిని మీరే నిలువరించాలి. మీ న్యాయమైన హక్కును సాధించడానికి మీతోపాటు నడిచా. కులాల వర్గీకరణకు సభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాం. నాకు మహాభారతంలో కర్ణుడు, బార్బరికుడు పాత్రలు ఇష్టం. కర్ణుడిలా నేనూ మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డాను. నేను కూడా బార్బరికుడిలా బలహీనులైన మాదిగల కోసం కొట్లాడా. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణ. మీ ఆత్మగౌరవాన్ని కాపాడే బాధ్యత నాది."

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

## మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

- నదికి ఇరువైపులా నైట్ టూరిజం ఏర్పాటు చేస్తాం
- ఫామ్‌హౌస్‌లో ఉన్నవారికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయి?
- రంగారెడ్డి జిల్లాలోని కొత్వాల్‌గూడ ఎకో పార్కును ప్రారంభించిన సీఎం రేవంత్

**రంగారెడ్డి(జనంసాక్షి):** మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీ చుట్టూ వ్యాపారాలు, నైట్ టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లాలోని మిగతా 2లో..






ఇరాన్ దాడుల్లో ధ్వంసమైన జోర్డాన్, యూఏఈలోని రాడార్ కేంద్రాలు

# శత్రుదాడులకు భయపడం

## అత్యాధునిక ఆయుధాలతో దాడులు చేస్తాం జాగ్రత్త:ఇరాన్

- అమెరికా,ఇజ్రాయెల్ లక్ష్యంగా విరుచుకుపడుతున్న ఐఆర్‌జీసీ
- జోర్డాన్, యూఏఈలోని రాడార్ కేంద్రాలు ధ్వంసం
- మా టార్గెట్ ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలే.. దాడుల్లో ఎవరూ చనిపోలేదు: ఇరాన్ మంత్రి
- ఇజ్రాయిల్ డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి
- ఇరాన్ డ్రోన్ క్యారియర్ షిప్ ధ్వంసం.. మంటల్లో యుద్ధనౌక
- ఇరాన్ ప్రతీకార దాడుల వేళ.. దుబాయ్ వాసులకు అలర్ట్
- శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు 12 విమానాలు రద్దు

**టెహ్రాన్(జనంసాక్షి):**తమ నౌకలు లక్ష్యంగా జరుగుతోన్న దాడులపై ఇరాన్ రగిలిపోతోంది. అమెరికా త్వరలోనే ఘోరంగా చింతించాల్సి వస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జోర్డాన్, యూఏఈలోని రాడార్ కేంద్రాలను ఇరాన్ ధ్వంసం చేసింది. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణలో ఈ విషయం వెల్లడైంది. ఇక, ఇప్పటికే ఖతార్‌లోను అత్యంత శక్తిమంతమైన రాడార్ కేంద్రాన్ని ధ్వంసం చేసింది.ఇక పశ్చిమాసియాలో బాంబుల మోత మోగుతోంది. ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఇరాన్ నేవీ లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ డ్రోన్ వాహక నౌకపై దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఆ దృశ్యాలను షేర్ చేసింది. "ఇరాన్ నేవీ మొత్తాన్ని నిర్వీర్యం చేయాలనే లక్ష్యంతో మిగతా 2లో..

## ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందే

- ఆ దేశంతో ఇక ఎటువంటి ఒప్పందం ఉండదు
- ఆ తర్వాత ఆమోదయోగ్యమైన నాయకుడి ఎన్నిక ఉంటుంది
- ఆ తర్వాత క్యూబా సంగతి చూస్తాం: ట్రంప్
- యుద్ధం నుంచి వెనక్కి తగ్గబోం
- అసలు యుద్ధం ఇప్పుడే మొదలైంది: అమెరికా రక్షణ మంత్రి

2లో..

## ఇరానియన్లు ప్రాణత్యాగాలకూ సిద్ధమయ్యారు

- కానీ అమెరికన్లు అందుకు రెడీగా లేరు
- యుద్ధం త్వరగా ముగుస్తుందని అమెరికా భావించింది
- కానీ వారి అంచనాలకు భిన్నంగా ఇరాన్ వ్యూహాలు
- మాజీ రా చీఫ్ విక్రమ్ సూద్ కీలక వ్యాఖ్యలు
- చివరి బుల్లెట్, చివరి సైనికుడి దాకా పోరాడుతాం
- ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖాతిబ్‌జాదే

## దృష్టి మరల్చేందుకే ప్రజాపాలన ఉత్సవాలు

- రెండేళ్లుగా అదే చేస్తున్నారు
- మళ్లీ మోసం చేసే యత్నం
- గతంలో ఇచ్చిన దరఖాస్తులకే దిక్కులేదు
- 99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీశ్



**హైదరాబాద్(జనంసాక్షి):** గతంలో రెండుసార్లు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి తీసుకున్న లక్షలాది దరఖాస్తులు పరిష్కారం కాక ఇంకా చెత్తబుట్టల్లోనే మగ్గుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దరఖాస్తులకు దిక్కు లేదు కానీ, మళ్లీ మిగతా 2లో..

## ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచండి

### రిఫైనరీలను కోరిన కేంద్ర ప్రభుత్వం


**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. దీంతో వంటగ్యాస్ లభ్యతను నిర్ధరించేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచాలని రిఫైనరీలను ఆదేశించింది. దేశీయ సరఫరాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. ఈ ఎల్‌పీజీ ప్రభుత్వరంగ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు మాత్రమే విక్రయించాలని తన ఆదేశాల్లో మిగతా 2లో..

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి



- మార్చి చివరి నాటికి ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ పూర్తి చేయాలి
- సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలి
- పిల్లలకు మధ్యాహ్న భోజనంలో చికెన్ స్థానంలో చేపలు
- మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి

**ఖమ్మం(జనంసాక్షి):**శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశమందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారె ఆది నారాయణ, మాలోతు రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. 99 రోజుల కార్యాక్రమంలో చేపట్టే కార్యాచరణను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఖమ్మం జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి, పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 99 రోజుల కార్యాచరణను ప్రణాళిక ప్రకారం అమలు చేయాలన్నారు. ఆర్థిక స్థితిగ తులు సహకరించక పోయినా పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు ప్రజల గడపకు చేరేలా అధికారు లు కృషి చేయాలని అన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలని అన్నారు. రైతులు పండించే పంటకు బోనస్ అందించి వారిలో విశ్వాసం కల్పించడమే కాకుండా పేదలకు నాణ్యమైన సన్న బియ్యం రేషన్ ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్నదని అన్నారు. గతంలో మధ్యవర్తులు లబ్దిదారుల పేరిట మీద ఇండ్లు మంజూరు చేయించుకొని డబ్బులు వసూలు చేసుకున్నారని, మిగతా 2లో..



## సివిల్స్‌తో సత్తా చాటిన తెలంగాణ బిడ్డలు

- అభినందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సివిల్స్ టాపర్ అనూజ్ అగ్నిహోత్రి
- ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన రాజస్థాన్‌కు చెందిన అభ్యర్థి
- ఫలితాలు విడుదల విడుదల చేసిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సివిల్స్ పరీక్ష ఫలితాలను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షల్లో అనూజ్ అగ్నిహోత్రి ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. రాజేశ్వరి సువే రెండో స్థానంలో నిలిచారు. ఆకాన్ష్ ధుల్ మూడో ర్యాంక్ పొందారు. రాఘవ్ ఝున్‌ఝున్ వాలా నాలుగో ర్యాంక్ సాధించారు. ఈ పరీక్షల్లో తెలుగు రాష్ట్రాల్లోని అభ్యర్థులు సత్తా చాటారు. సృజన (55వ ర్యాంక్), డీఎస్‌కే ప్రచేత్ (193వ ర్యాంక్), ఎస్. వర్షిత్‌రెడ్డి (259వ ర్యాంక్), ఎం.పవన్‌కుమార్‌రెడ్డి (297వ ర్యాంక్), వి. విక్రమసింహారెడ్డి (541వ ర్యాంక్), గుమ్మల శ్వేత (573వ ర్యాంక్), పోతుపురెడ్డి భార్గవ్ (537వ ర్యాంక్), పుడారి రాహుల్ (748వ ర్యాంక్), కత్తిమాని అనిరుధ్ (786వ ర్యాంక్), కోరపాతుల శ్రీకర్‌రాజు మిగతా 2లో..

# కూలిపోయిన సుఖోయ్ యుద్ధవిమానం

### ఘటనలో ఇద్దరు పైలట్లు మృతి • మృతుల్లో ఆపరేషన్ సిందూర్ పైలట్



**గహౌతి(జనంసాక్షి):**వాయుసేనకు చెందిన సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధవిమానం గల్లంతైన సంగతి తెలిసిందే. తాజాగా అది కూలిపోయిందని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) ప్రకటించింది. అస్సాంలోని కర్బి ఆంగ్లాంగ్ జిల్లాలో ఈ ఘటన జరిగినట్లు తెలిపింది. గురువారం సాయంత్రం జోర్హాట్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ఈ యుద్ధ విమానం గల్లంతైంది. రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయని అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలో గాలింపు చర్యలు చేపట్టారు. జోర్హాట్ వైమానిక స్థావరానికి 60 కి.మీల దూరంలో ఉన్న కర్బి ఆంగ్లాంగ్ కొండ ప్రాంతంలో ఇది కూలిపోయినట్లు తాజాగా గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. వారిని స్క్వాడ్రన్ మిగతా 2లో..

### ఇదేం దారుణం..

## ఓ నెల రోజులు రష్యా నుంచి చమురు కొనొచ్చట!

### భారత్‌కు ట్రంప్ వెసులుబాటు

భారత్ తీర సమీపంలో 1.5 కోట్ల బ్యారెళ్ల రష్యా చమురు కొనగోలుకు సిద్ధం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఇరాన్‌తో ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం నేపథ్యంలో.. చమురు రవాణాపై తీవ్ర ప్రభావం పడిన సంగతి తెలిసిందే. ఈ సంక్షోభం వేళ భారత్‌కు ఊరట లభించింది. యుద్ధం వేళ రష్యా చమురును దిగుమతి చేసుకునేందుకు భారత్‌కు అమెరికా మినహాయింపు ఇవ్వడంతో.. రష్యా నుంచి 1.5 కోట్ల బ్యారెళ్ల చమురున్న డజనుకు పైగా ట్యాంకర్ నౌకలు బయల్దేరినట్లు బ్లూమ్‌బెర్గ్ కథనం వెల్లడించింది. అరేబియా సముద్రం మీదుగా మరికొన్ని రోజుల్లో అవి భారత్‌కు చేరుకోనున్నట్లు తెలుస్తోంది.బ్లూమ్‌బెర్గ్ విడుదల చేసిన షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో డజనుకు పైగా ముడి చమురు ట్యాంకర్లు భారత్ తీరానికి సమీపంలో ఉన్నాయి. మరో వారం రోజుల్లో అవి ఓడరేవులకు చేరుకునే అవకాశం ఉంది. మిగతా 9లో..



## మూడు వారాల్లో క్యాతన్‌పల్లి ఎన్నిక నిర్వహించండి


### రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్(జనంసాక్షి):** క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక మూడు వారాల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ వివాదంపై శుక్రవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ హైకోర్టు పై విధంగా ఆదేశించింది. మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం మంచిర్యాల జిల్లాలోని క్యాతనపల్లిలో పలు రాజకీయ పరిణామాలు చోటు మిగతా 2లో..

### 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా

## నిషేధం

### కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం



**బెంగుళూరు(జనంసాక్షి):**కర్ణాటక ప్రభుత్వం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడాన్ని నిషేధించ నున్నట్లు ప్రకటించింది. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య 17వ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. మొబైల్ వాడకం వల్ల పిల్లల్లో తలెత్తుతున్న ప్రతికూల భావాలను నివారించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో 16ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంపై అక్కడి ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. భారత్‌లో ఈ దిశగా నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రంగా కర్ణాటక నిలిచింది. ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు ఇలాంటి చర్యలనే పరిశీలిస్తున్నట్లు గతంలో తెలిపాయి. పిల్లల్లో సోషల్ మీడియా వినియోగాన్ని నియంత్రించాలనే అంశంపై కర్ణాటక ప్రభుత్వం గత కొంతకాలంగా చర్చలు జరుపుతోంది. సీఎం ఇటీవల ప్రభుత్వ విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో జరిపిన చర్చల్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్‌కు సంబంధించి వారి నుంచి అభిప్రాయాలు కోరారు. ఈ క్రమంలోనే తాజాగా ఈ ప్రకటన చేశారు.

# శత్రుదాడులకు భయపడం

## ఇరానియన్లు ప్రాణత్యాగాలకూ సిద్ధమయ్యారు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇరాన్, అమెరికా – ఇజ్రాయెల్ సైనిక సంఘర్షణపై భారతదేశ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) మాజీ చీఫ్ విక్రమ్ సూద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధంలో అవసరమైతే చనిపోయేందుకు ఇరానియన్లు సిద్ధంగా ఉన్నారని, కానీ అమెరికన్లు ప్రాణత్యాగాలకు సిద్ధంగా లేరన్నారు. శుక్రవారం ఏఎన్ఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ కామెంట్స్ చేశారు. చనిపోయేందుకు సిద్ధపడే ఇరానియన్లు అమెరికాతో పోరాడుతున్నారని విక్రమ్ సూద్ పేర్కొన్నారు. ఈ యుద్ధం నిర్దిష్టంగా ఎంతకాలం పాటు కొనసాగుతుందో ఇప్పుడే చెప్పడం కష్టమన్నారు.కానీ అమెరికా ఊహించిన దాని కంటే ఎక్కువ కాలంపాటు ఈ యుద్ధం కొనసాగే అవకాశం ఉందని చెప్పారు. ఈ యుద్ధం త్వరగా ముగియాలని, ఇరాన్‌పై భీకర దాడులు చేసి వెళ్లిపోవాలని అమెరికా భావించిందని ఆయన తెలిపారు. కానీ అమెరికా అంచనాలకు పూర్తిగా భిన్నమైన ఆటను ఇరానియన్లు ఆడుతున్నారన్నారు. మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా మిత్రదేశాలపైనా ఇరాన్ దాడులు చేస్తున్న విషయాన్ని విక్రమ్ సూద్ గుర్తుచేశారు. మిడిల్ ఈస్ట్‌లోని అమెరికా సైనిక స్థావరాలను పెద్దముప్పుగా ఇరాన్ పరిగణిస్తోందన్నారు.

**చివరి బుల్లెట్, చివరి సైనికుడి దాకా పోరాడుతాం : ఇరాన్**

భారత్‌లోని దిల్లీలో జరుగుతున్న రైసినా డైలాగ్ 11వ సదస్సుకు ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖాతిబ్‌జాదే హాజరయ్యారు. శుక్రవారం ఉదయం ఆయన భారత వార్తాసంస్థలతో మాట్లాడుతూ కీలక కామెంట్స్ చేశారు. దేశ రక్షణ కోసం వీరత్వంతో పోరాడటం తప్ప తమకు ఇప్పుడు మరో మార్గం లేదని తేల్చి చెప్పారు. చివరి బుల్లెట్, చివరి సైనికుడి దాకా అమెరికా, ఇజ్రాయెల్‌ల దండయాత్రపై పోరాడుతామని ఖాతిబ్‌జాదే స్పష్టం చేశారు.ప్రస్తుతం అమెరికన్లు, ఇజ్రాయెలీలు ఇరాన్‌పై దాడి, దండయాత్ర చేస్తున్నారని, తమ దేశానికి వీలైనంత భారీ నష్టాన్ని కలిగించేందుకు యత్నిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ దాడి, దండయాత్రను బలంగా ప్రతిఘటించడానికే తాము ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్పెట్ బాంబింగ్ ద్వారా ఇరాన్ ప్రజలను అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆయన తెలిపారు. ప్రతిఘటించడం తప్ప ఇరాన్‌కు ఇంకో మార్గం లేదన్నారు.

## కూలిపోయిన సుఖోయ్ యుద్ధవిమానం

లీడర్ అనుజ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దురాగ్‌కర్‌గా అధికారులు గుర్తించారు. వీరి మృతికి ఐఏఎఫ్ సంతాపం వ్యక్తం చేసింది.

**సుఖోయ్ క్రాష్.. మృతుల్లో ఆపరేషన్ సిందూర్ పైలట్**

వాయుసేనకు చెందిన సుఖోయ్ యుద్ధ విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. అస్సాంలోని కర్బి ఆంగ్లాంగ్ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆ పైలట్లలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేశ్ దురాగ్‌కర్ (28).. గతేడాది పాక్‌పై భారత బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. పది రోజుల క్రితమే తన కుటుంబంతో సంతోషంగా గడిపి, విధుల్లో చేరారు.పూర్వేశ్ తండ్రి రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ "గతేడాది భారత బలగాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో మా కుమారుడు కూడా పాల్గొన్నాడు. సిందూర్‌ను ఆపిన 15 రోజుల తర్వాత ఆ విషయం మాకు తెలిసింది. ఆ ఆపరేషన్ జరిగినన్ని రోజులూ పూర్వేశ్ మాతో టచ్‌లో లేడు. భారత వాయుసేనలో పనిచేస్తున్నందుకు, యుద్ధ విమానాలు నడుపుతున్నందుకు ఎంతో గర్వంగా ఫీల్ అయ్యేవాడు. మాతో ఆ అనుభవాలను పంచుకునేవాడు. బుధవారమే మేం అతడితో మాట్లాడాం. దేశ సేవలో తన ప్రాణాలు అర్పించాడు. అందరికీ నా బిడ్డ ఒక స్ఫూర్తిగా నిలుస్తాడు. సుదీర్ఘంగా దేశానికి సేవలందించాలని ఆశించాడు. కానీ ఆ కల తీరలేదు" అని రవీంద్ర తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పూర్వేశ్ స్వస్థలం. పది రోజుల క్రితమే కుటుంబ సభ్యులు నిర్వహించిన గెట్‌టుగెదర్‌లో సంతోషంగా గడిపారు. గురువారం రాత్రి సుఖోయ్ ఆచూకీ లేకుండా పోయింది. ట్రైనింగ్ మిషన్‌లో భాగంగా జోర్హాట్ ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన వెంటనే మిస్ అయింది. 60 కి.మీ.దూరంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో పూర్వేశ్‌తో పాటు స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ ప్రాణాలు కోల్పోయారు.

## సివిల్స్‌తో సత్తా చాటిన తెలంగాణ బిడ్డలు

(806వ ర్యాంక్), ఇస్లావత్ శ్రీరామ్ హర్ష (823 ర్యాంక్), కట్టా ప్రత్యూష (908వ ర్యాంక్), గోగుల రాజశేఖర్ (920వ ర్యాంక్), గుగులోతు జితేందర్ నాయక్ (939వ ర్యాంక్) సాధించారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన 15 రోజుల్లో వెబ్ సైట్‌లో మార్కులు అప్ లోడ్ చేస్తామని యూపీఎస్సీ ప్రకటించింది. మరిన్ని వివరాలు కోసం ఈ ఫోన్ నెంబర్లు.. 23385271, 23381125, 23098543 సంప్రదించాలని ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించింది. ఉదయం 10 నుంచి 05.00 గంటల మధ్య సంప్రదించాలని యూపీఎస్సీ స్పష్టం చేసింది. గతేడాది అంటే.. 2025లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆగస్ట్, సెప్టెంబర్‌లో మెయిన్స్ పరీక్షలు చేపట్టారు. వాటిలో అర్హత పొందిన వారికి ఈ ఏడాది ఫిబ్రవరిలో మౌఖిక పరీక్ష నిర్వహించారు. ఈ చివరి వడపోతలో మొత్తం 1087 మంది అభ్యర్థులు సివిల్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌తో పాటు గ్రూప్ ఎ, గ్రూప్ బిలో వివిధ సెంట్రల్ సర్వీస్‌లో వీరంతా చేరనున్నారు.

**సివిల్స్ విజేతలకు అభినందనలు తెలిపిన సీఎం రేవంత్**

శుక్రవారం విడుదలైన యూపీఎస్సీ సివిల్స్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విజేతలను సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. రాష్ట్రప్రభుత్వం–సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్ అభయ హస్తం సాయం అందుకున్న వారిలో 20 మంది సివిల్స్‌కు ఎంపికవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి ఉద్యోగి కుమార్తె జి. సృజనకు ఆల్?ఇండియా స్థాయిలో 55 ర్యాంకు సాధించారు. సివిల్స్ విజేతలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలియజేశారు.

## మూడు వారాల్లో క్యాతన్‌పల్లి ఎన్నిక నిర్వహించండి

చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అర్థంతరంగా నిలిచిపోయింది. ఇక బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనకు కోర్టు రిమాండ్ విధించింది. బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా.. ఇటీవల బెయిల్ మంజూరు అయింది. అనంతరం ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. ఆ తర్వాత కేతనపల్లిలోని తన నివాసంలో బాల్క సుమన్ విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌పై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. తనను జైల్లో తీవ్ర ఇబ్బందులకు గురి చేశారంటూ పోలీసులపై ఆయన మండిపడ్డారు. ఫిబ్రవరి 11వ తేదీన తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు పోలింగ్ నిర్వహించారు. ఫిబ్రవరి 14వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. అనంతరం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్ పదవుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అలాగే క్యాతనపల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వేళ.. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఆగిపోయింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు పై విధంగా ఆదేశాలు జారీ చేసింది.



ముందుకువెళ్తున్నాం. తాజాగా ఇరాన్ డ్రోన్ వాహక నౌకను టార్గెట్ చేయడంతో అది మంటల్లో చిక్కుకుంది" అని పేర్కొంది. ఫిబ్రవరి 28న ఇరాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్–అమెరికా దాడులు ప్రారంభించాయి. దాంతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా–75ను యూఎస్ ముంచేసింది. ఇప్పుడు మళ్లీ డ్రోన్ వాహక నౌకను ధ్వంసం చేసింది. ఇప్పటివరకు ఇరాన్‌కు చెందిన 30 యుద్ధ నౌకలను ముంచేశామని/ధ్వంసం చేశామని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అలాగే ఆ దేశంలోని 200 లక్ష్యాలపై బాంబర్ ఫోర్స్ దాడి చేసినట్లు వెల్లడించింది. బి–2 స్పిరిట్ బాంబర్లు భూగర్భ లక్ష్యాలపై బంకర్ బస్టర్లను జారవిడిచినట్లు పేర్కొంది.
ఇరాన్ ప్రతిదాడులు..

**మా టార్గెట్ అమెరికా స్థావరాలే..**

**దాడుల్లో ఎవరూ చనిపోలేదు: ఇరాన్ మంత్రి**

పశ్చిమాసియాలోని అమెరికా ఆస్తులపై మాత్రమే తాము దాడులు చేస్తున్నామని ఇరాన్ విదేశాంగ సహాయ మంత్రి సయ్యద్ ఖతీబ్జాదే వెల్లడించారు. తమ దాడుల వల్ల పొరుగున ఉన్న అరబ్ దేశాల్లో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో తన దేశం చేపడుతున్న చర్యలను ఆయన సమర్థించారు."యూఎస్ ఆస్తులనే మేం లక్ష్యంగా చేసుకుంటున్నాం. అందుకే మా దాడుల వల్ల అరబ్ దేశాల్లో ప్రాణనష్టం సంభవించలేదు" అని ఖతీబ్జాదే అన్నారు. అలాగే ఇటీవల హిందూ మహాసముద్రంలో ఇరాన్ యుద్ధనౌక ఐరిస్ దేనా–75ను యూఎస్ ముంచేసిన సంగతి తెలిసిందే. "భారత స్నేహితుల ఆహ్వానం మేరకు ఆ నౌక ఇక్కడికి వచ్చింది. దానిపై అమెరికా దాడి దురదృష్టకరం" అని వ్యాఖ్యానించారు. అలాగే దిల్లీ పర్యటనలో భాగంగా ఆయన భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్–అమెరికా దాడుల్లో ఖమేనీ సహా పాలనావర్గానికి చెందిన పలువురు ఉన్నతస్థాయి వ్యక్తులు చనిపోయారు. వారి మృతితో ఇరాన్ రాజకీయ వ్యవస్థ కూలిపోతుందని ట్రంప్ ప్రభుత్వం వ్యాఖ్యలు చేస్తోంది. వాటిని ఖతీబ్జాదే తోసిపుచ్చారు. తమ దేశ పాలనా నిర్మాణం వ్యక్తులపై కాకుండా వ్యవస్థలపై ఆధారపడి ఉందని స్పష్టంచేశారు. "ఇరాన్‌లో రాజ్యాంగం ఉంది. ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించాలనే దానిపై స్పష్టమైన విభజన ఉంది" అని అన్నారు.

**ఇజ్రాయిల్ డిమోనా అణు కేంద్రంపై దాడికి ఇరాన్ గురి**

ఇజ్రాయిల్ దాడులకు ప్రతిదాడులను ముమ్మరం చేసిన ఇరాన్ ఇజ్రాయెల్ అణు రియాక్టర్‌పై గురిపెట్టిందన్న వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయిల్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తామని ప్రకటించింది. ఇజ్రాయెల్ తన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను డిమోనాకు రక్షణగా మోహరించింది. ప్రపంచంలోనే అత్యంత దుర్భేద్యమైన ప్రదేశంగా మార్చేసింది. ఇక్కడ యారో–2, 3, డేవిడ్ స్లింగ్ వంటి క్షిపణి రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఇటీవల తన అత్యాధునిక ఐరన్ బీమ్‌ను కూడా ఇక్కడికే తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. అంతేకాదు.. భూగర్భంలో కొన్ని అంతస్తుల కింద తన అణు కార్యక్రమాన్ని ఇజ్రాయెల్ సురక్షితంగా ఉంచినట్లు తెలుస్తోంది. డిమోనాపై దాడి చేయడానికి ఇరాన్ అమ్ములపొదిలో డ్రోన్లు, క్షిపణులు వంటి చాలారకాల ఆయుధాలు ఉన్నాయి. రియాక్టర్ నుంచి ఇరాన్ 1200–1500 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం ప్రయాణించేందుకు టెహ్రాన్ అమ్ముల పొదిలో షహెద్ 136 డ్రోన్లు భారీ సంఖ్యలో ఉన్నాయి. ఇది దాదాపు 50 కిలోల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. ఇక క్షిపణుల విషయానికి వస్తే సాహబ్–3, ఖైబర్‌షేకన్, ఎమాద్, ఖుర్రంషహర్, ఫత్ర, సెజ్జిల్, సుమర్ వంటి క్షిపణులున్నాయి. వీటి రేంజి 1300 కిలోమీటర్ల నుంచి 2500 కిలోమీటర్ల వరకు ఉంది. ఇవికాకుండా ఫతా–2 హైపర్ సోనిక్ క్షిపణి కూడా ఉంది. ఇది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను కూడా తప్పించుకోగలదు. గతంలో సిరియాతో ఘర్షణ వేళ ఈ రియాక్టర్ సమీపంలో కొన్ని క్షిపణులు పడ్డాయి. ఇజ్రాయెల్ ఏర్పడిన తర్వాత పొరుగు దేశాలు వరుసగా దానితో యుద్ధాలకు దిగాయి. అమెరికా సాయంతో.. వాటిని ఓడించినా.. ఎప్పటికైనా తన ఉనికికి ముప్పు తప్పదని గ్రహించింది. దీంతో నాటి ప్రధాని డేవిడ్ బెన్ గురియన్ తమ దేశాన్ని అణుశక్తిగా మార్చాలనే నిర్ణయానికి వచ్చారు. ఫ్రాన్స్ సాయంతో అణు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు నెగెవ్ ఎడారిలో 'డిమోనా' అనే ప్రదేశంలో ఓ భారీ రియాక్టర్‌ను ఇజ్రాయెల్ నిర్మించింది. ఐరోపా దేశాల టెక్నాలజీ, బ్లూప్రింట్స్, నిపుణుల సాయంతో దీనిని రూపొందించారు. ఇందులోని భూగర్భ బంకర్లలో అణుబాంబులకు వాడే ప్లుటోనియం ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఈ విషయం అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. అలా ఇజ్రాయెల్ అణ్వాయుధం తయారీలో డిమోనా రియాక్టర్ కీలక పాత్ర పోషించింది. ఈ రియాక్టర్‌కు ఉత్తరం వైపు 85 కిలోమీటర్ల దూరంలో జెరూసలెం నగరం ఉంది. ఇక 75 కిలోమీటర్ల దూరంలో ఈజిప్ట్ సరిహద్దులు.. 25 కిలోమీటర్ల దూరంలో జోర్డాన్ ఉన్నాయి. ఒకవేళ దాడి జరిగితే ఇక్కడి నుంచి లీకయ్యే రేడియేషన్ ప్రభావం ఈ దేశాలకు కూడా పాకే ప్రమాదం ఉంది.

**ఇరాన్ ప్రతీకార దాడుల వేళ..**

**దుబాయ్ వాసులకు అలర్ట్**

అమెరికా–ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తోంది. అయితే, ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులు, డ్రోన్లను ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నామని యూఏఈ రక్షణశాఖ పేర్కొంది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా భారీ శబ్దాలు వినిపిస్తున్నాయని తెలిపింది. ఇదే సమయంలో దుబాయ్ నగరం కూడా స్థానిక పౌరులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తోంది. శుక్రవారం కూడా క్షిపణి దాడులు జరిగే అవకాశం ఉందని కొందరికి మొబైల్ అలర్ట్‌లు వస్తున్నట్లు సమాచారం.అయితే, అలర్ట్ అందుకున్న వెంటనే కొందరు ఇళ్ల నుంచి బయటకు వెళ్లి లేదా వాహనాలు నిలిపి ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని యూఏఈ విపత్తు నిర్వహణ విభాగం పేర్కొంది. ఇలాంటివాటికి దూరంగా ఉండాలని.. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించింది. ముందుజాగ్రత్త చర్యగా కిటికీలకు దూరంగా ఉండాలని తెలిపింది. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై ఎప్పటికప్పుడు సోషల్ మీడియా వేదికగా స్థానిక పౌరులకు జాగ్రత్తలు చెబుతోంది.

**శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు 12 విమానాలు రద్దు చేసిన భారత్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో విమానాల రద్దు కొనసాగుతోంది. శంషాబాద్ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన 12 విమానాలు రద్దయ్యాయి. అదే సమయంలో గల్ఫ్ దేశాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన మరో 12 విమానాలు కూడా రద్దయ్యాయి. ఖతార్, యూఏఈ, కువైట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా నుంచి రావాల్సిన, వెళ్లాల్సిన విమానాలు రద్దు అయినట్లు అధికారులు తెలిపారు.

## ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందే!

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌తో ఎటువంటి ఒప్పందం ఉండదని, బేషరతుగా లొంగిపోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఆ తర్వాత ఇరాన్‌కు ఆమోదయోగ్యమైన నాయకుడి ఎన్నిక ఉంటుందన్నారు. వివిధ భాగస్వామ్య పక్షాలతో కలిసి ఇరాన్‌ను సంక్షోభం నుంచి బయటకు తీసుకువచ్చేందుకు తాము కృషి చేస్తామన్నారు. గతంలో లేని విధంగా ఇరాన్‌ను ఆర్థికంగా మెరుగైన, బలమైన స్థితికి తీసుకువస్తామన్నారు. ఇరాన్‌కు మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొంటూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పోస్టు చేశారు.
ముందు ఇరాన్ పని ముగించి.. క్యూబా సంగతి చూస్తాం: ట్రంప్ క్యూబా లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశ ప్రభుత్వం అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ముందు ఇరాన్ పని ముగించి.. తర్వాత క్యూబా సంగతి చూస్తామన్నారు. అయితే అది ఎప్పుడో తెలియదన్నారు. ఇజ్రాయెల్ దళాలతో కలిసి, అనుకున్న దానికంటే వేగంగానే తమ దళాలు ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తున్నాయన్నారు. వరుస దాడుల వల్ల ఇరాన్ సైనిక సామర్థ్యాలు కూడా భారీగా క్షీణించాయన్నారు. ఈ దాడులను ఎదుర్కోవడానికి వారికి తమలా వైమానిక దళం లేదని పేర్కొన్నారు.ఇరాన్ నావికాదళాన్ని కూడా తాము పూర్తిగా నాశనం చేశామని ట్రంప్ ప్రకటించారు. మూడు రోజుల్లోనే 24 ఇరాన్ నౌకలను తుడిచిపెట్టామన్నారు. దీంతో ఆ దేశ అధికారులు తమ కాళ్ల బేరానికి వచ్చారన్నారు. అణు ఒప్పందంపై చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నట్లు పలువురు ఇరాన్ అధికారులు తమకు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని తాను చెప్పినట్టు పేర్కొన్నారు. టెహ్రాన్ రాజకీయ భవిష్యత్తును పునర్నిర్మించడంలో ఇరాన్ దౌత్యవేత్తలు తమకు సహకరించాలన్నారు. మరోవైపు తమతో ఒప్పందం చేసుకోవడానికి క్యూబా సైతం ఎదురుచూస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో తమ ఆపరేషన్ ముగిసిన తర్వాత అమెరికా విదేశాంగ విధాన ప్రాధాన్యాల్లో పలు మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. ఇదీ చదవండి: సుంకాల సొమ్ము వాపసు చేయాల్సిందే

**ఖమేనీ హత్యకు నవంబర్‌లోనే ప్రణాళిక**

అమెరికా– ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ కీలక విషయాలు బయటపెట్టారు. సుప్రీం నేత అడ్డు తొలగించాలని తాము గతేడాది నవంబర్‌లోనే నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది చివర్లో ఓ ఉన్నతస్థాయి భద్రతా సమావేశం జరిగిందని కట్జ్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలో జరిగిన ఆ సమావేశంలో ఖమేనీ అడ్డు తొలగించాలని గట్టిగా నిర్ణయించుకొన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరాన్‌పై కొనసాగుతున్న ఆపరేషన్.. 2026 మధ్యలో జరగాల్సి ఉందన్నారు. అప్పట్లో ఈ ప్రణాళిక గురించి అమెరికాకు వెల్లడించలేదన్నారు. ఇటీవల ఇరాన్ పాలనను వ్యతిరేకిస్తూ ఆ దేశంలో నిరసనలు జరిగిన సంగతి తెలిసిందే.

## దృష్టి మరల్చేందుకే ప్రజాపాలన ఉత్సవాలు

- రెండేళ్లుగా అదే చేస్తున్నారు
- మళ్లీ మోసం చేసే యత్నం
- గతంలో ఇచ్చిన దరఖాస్తులకే దిక్కులేదు
- 99 రోజుల ప్రజాపాలనపై మండిపడ్డ హరీశ్

ఇప్పుడు పది వారాల పాటు పది రకాల నాటకాలతో ప్రజలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం కావడం సిగ్గు చేటని అన్నారు. రెండున్నరేండ్లలో అసలు ఏం చేసారని ప్రచారం నిర్వహిస్తున్నారు. రేవంత్ రెడ్డి గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి మీ పైఫల్యాలు ప్రచారం చెప్పుకుంటారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాక్షన్ ప్లాన్ పేరిట పాలనా వైఫల్యం నుంచి దృష్టి మరల్చేందుకు డైవర్షన్ ప్లాన్ డ్రామాకు తెర తీశారని ధ్వజమెత్తారు. ప్రచార కోసమేనని, ప్రజలకు ఒరిగేదేమి లేదని అన్నారు. 800 రోజుల పాలనలో చేసిందేం లేక, 99 రోజు ప్రణాళిక పేరిట రేవంత్ రెడ్డి మరో డ్రామాకు తెరతీసిండని ఆరోపించారు.రెండున్నరేండ్ల పాలన తర్వాత ప్రగతి ప్రణాళికలు గుర్తుకు వచ్చాయా?అంటూ నిలదీశారు.అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీలు, పాలన వైఫల్యాలు, కోట్లు కొల్లగొట్టేందుకు చేసిన స్కాంలు, ప్రజల ఛీత్కారాల నుంచి దృష్టి మరల్చేందుకు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మరో డైవర్షన్ ఎ÷–లాన్ అని విమర్శించారు. కోతల సమయం వచ్చినా ఈ సీజన్ ఇప్పటి వరకు రైతు భరోసా దిక్కు లేదు.గత సీజన్ పంట బోనస్ ఇవ్వక చేతులెత్తేసారు. చివరకు యూరియా కూడా సరఫరా చేయలేక రైతులను నడిరోడ్డు మీదకు ఈడ్చారు.నమ్మించి గొంతు కోసిన ఈ మోసాల గురించి రైతులకు వివరిస్తారా? చెప్పాలని డిమాండ్ చేశారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చాక యువతను మోసం చేశారు. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేశారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా మూసీ బ్యూటిఫికేషన్ పేరిట లూటీకి తెగబడ్డారు. రాజీవ్ యువ వికాసం పేరిట తీసుకున్న దరఖాస్తులు దిక్కు లేకుండా పోయాయని హరీష్‌రావు విమర్శించారు. యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం అంటూ కొత్త పాట పాడుతున్నారని దుయ్యబట్టారు .అందని గ్యారెంటీల కోసం ఎదురుచూస్తున్న లక్షల మంది బాధితుల సంగతేంటో చెప్పాలని,సోలార్ విద్యుత్, పర్యావరణం, డ్రగ్స్ అడ్డుకట్ట లాంటివన్నీ పత్రికల్లో పబ్లిసిటీ ఇచ్చుకునేందుకు పెట్టుకున్న పేర్లు తప్ప, ఇందులో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.పాలన గాలికి వదిలి పబ్లిసిటీ పేరిట చేస్తున్న మీ గారడీలను ప్రజలు గమనిస్తున్నారని, దుర్మార్గ పాలనను నిలదీసేందుకు గ్రామ గ్రామాన ప్రజలు సిద్దంగా ఉన్నారని హెచ్చరించారు

## ఎస్సీ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాట



ఎంతో పోరాడిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఈ పోరాటంలో కొందరు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏళ్ల నుంచీ వర్గీకరణ సమస్య ఉందన్నారు. మీ న్యాయమైన హక్కు కోసం మొదటి నుంచీ మద్దతుగా ఉన్నానని తెలిపారు. వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సైతం పంపామని వివరించారు. మిత్రుడి కోసం కొన ఊపిరి వరకు కర్ణుడు నిలబడ్డాడని చెప్పారు. కర్ణుడి మాదిరిగా మిత్రధర్మానికి కట్టుబడి మాదిగల వెంట నిలబడ్డామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగల వైపు న్యాయం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మీవైపే నిలబడ్డామని ఆయన స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత.. వర్గీకరణ కోసం ప్రకటన చేసిన తొలి రాష్ట్రం తెలంగాణేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లు ప్రభుత్వ ఉద్యోగులేనని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాతే అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చామన్నారు. ప్రగతి ప్రణాళికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఉద్యోగులకు సీఎం రేవంత్ హితవు పలికారు. తెలంగాణలో ఆర్థిక సమస్యలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవన్నారు.ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు అంతంత మాత్రంగానే ఉందని తెలంగాణ సీఎం తెలిపారు. మాదిగలకు మెరుగైన విద్య అందించాలన్నదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. ప్రక్షాళన చేసేందుకే విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్నానని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బర్రెలు, గొర్రెలు, చేపలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇవన్నీ మనకు తెలియవా?.. వీళ్లు కొత్తగా ఇచ్చిందేంటి? అంటూ బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్ మండిపడ్డారు. మనం బర్రెలు, గొర్రెలు కాచుకోవాలా?.. వాళ్ల పిల్లలు రాజ్యం ఏలుతారా? అంటూ ఆ పార్టీ నేతలను సీఎం రేవంత్ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం

కొత్వాల్‌గూడ ఎకో పార్కును శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫామ్‌హౌస్‌లో ఉన్నవారికి పేదల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. "నేను సీఎం అయిన తర్వాత రేషన్ కార్డు ఇచ్చా. సన్నబియ్యం ఇచ్చా. ఫ్రీ బస్సు పథకం ఇచ్చా. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మహిళలంతా నిండు మనసుతో ఆశీర్వదించాలి. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం. అభివృద్ధి విషయంలో రాజకీయాలు లేవు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ ఉపన్యాసాలకు తావులేదు. అందర్నీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలి

లభించకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లలో పేదల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో పని చేయాలని అన్నారు.క్రీడలలో భవిష్యత్తు ఉంటుందనే భావన యువతకు వచ్చేలా అవసరమైన ఇన్ ఫ్రా అభివృద్ధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గచ్చిబౌలిలో హాకీ క్రీడలు ప్రపంచ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. క్రీడలలో గాయపడిన క్రీడాకారులకు మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రతి వారం అందించే చికెన్ స్థానంలో చేపలు పెట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కోతులు, కుక్కల సమస్య పరిష్కారం కోసం వాటి సంతానోత్పత్తి నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పని తీరు ఆధారంగానే ప్రజలలో ప్రభుత్వం పట్ల స్పందన ఉంటుందని మంత్రి తెలిపారు. 99 రోజుల కార్యాచరణ సంవత్సరం మొత్తం కొనసాగించాలని ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సంయుక్తంగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. ×మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించడంతో పాటు భవిష్యత్తు ప్రణాళిక సిద్ధం చేసుకునే ఉద్దేశ్యంతో ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణ ప్రోగ్రాం చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి గ్రామం, పట్టణానికి చేరువ చేసేందుకు అనుసరించాల్సిన విధానంపై చర్చించేందుకు ఉమ్మడి జిల్లా స్థాయిలో సన్నాహక



కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 సెక్టార్‌లకు సంబంధించి రూపొందించిన ప్రణాళిక క్షేత్ర స్థాయిలో కట్టుదిట్టంగా అమలు అయ్యేలా చూడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టల్స్‌కు తహసిల్దార్ క్యాడర్ కు తగ్గకుండా ఒక అధికారిని ఇంచార్జి గా నియమించాలని, వీరు ప్రతి వారానికి ఒకసారి వెళ్లి అక్కడ భోజనం నాణ్యత పరిశీలించాలని, అక్కడ ఏదైనా తప్పు జరిగితే సంబంధిత అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. గ్రౌండింగ్ కాని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఆసక్తి లేని పక్షంలో అదే గ్రామంలో మరో లబ్ధిదారునికి కేటాయించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యత ఆధారంగా రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూ సమస్యలు జాయింట్ సర్వే ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు వస్తున్నాయని, వీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, ఆ నిధుల వినియోగం ఎలా జరుగుతుందో నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. ఎకో పార్కుల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు వ్యవసాయ రంగంలో చాలా అంశాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పంట మార్పిడి, ఎరువుల, రసాయనాల వినియోగం తగ్గించడం, ఆధునిక సాగు పద్ధతులు వంటి అంశాలను ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, భద్రాచలం ఐటిడిఎ పీవో బి. రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జెడ్పీ సిఈఓ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌పీజీ ఉత్పత్తిని పెంచండి..

పేర్కొంది. ఆ సరఫరాలు దేశీయ వినియోగదారులకు మాత్రమే చేరేలా చూడాలని ఆ మూడు సంస్థలకు సూచించింది.ఎల్‌పీజీని ఉత్పత్తి చేయడానికి కీలకమైన ప్రొపేన్, బ్యూటేన్‌ను పెట్రో కెమికల్ ప్రొడక్షన్ కోసం దారి మళ్లించవద్దని కేంద్రం రిఫైనరీలకు స్పష్టం చేసింది. ప్రధానమంత్రి ఉజ్వల యోజన వంటి పథకాల ద్వారా దేశంలో ఎల్‌పీజీ గృహ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ ఇంధన అవసరాలు తీర్చుకునేందుకు 60 శాతం దిగుమతుల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దాంతో అంతర్జాతీయంగా ధరలు పెరిగినా, రవాణాలో అంతరాయాలు ఏర్పడినా దేశీయంగా ఆ ప్రభావం కనిపిస్తుంటుంది.

## అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు సమస్యలపై
# సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

- భూసేకరణ సమస్యలతో నిలిచిపోయిన సర్వీస్ రోడ్ పనులు
- త్వరితగతిన పరిష్కారం కోరిన కేంద్ర మంత్రి



**అంబర్‌పేట, మార్చి 6 (జనంసాక్షి):** హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట్ ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్ నిర్మాణం నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయినా, భూసేకరణ సమస్యల కారణంగా సర్వీస్ రోడ్ పనులు పూర్తి కాలేదని ఆయన లేఖలో పేర్కొన్నారు. సుమారు రూ.265 కోట్ల వ్యయంతో నిర్మించిన అంబర్‌పేట్ ఫ్లైఓవర్ నగర రవాణా వ్యవస్థకు కీలకంగా మారినప్పటికీ, ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్ నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా అంబర్ పేట్, రామంతాపూర్, ఉప్పల్, నాచారం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు రోజు వారీగా ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సర్వీస్ రోడ్ లేకపోవడం వల్ల స్థానిక రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి పెరిగి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి సర్వీస్ రోడ్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేసి అంబర్‌పేట్ ఫ్లైఓవర్ కింద సర్వీస్ రోడ్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులను తొలగించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తన లేఖలో స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారమైతే నగరంలో ట్రాఫిక్ సమస్యలు కొంతవరకు తగ్గి ప్రజలకు ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు కూడా ఈ సమస్యపై పలుమార్లు ఆందోళనలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు స్పందించి సర్వీస్ రోడ్ నిర్మాణాన్ని పూర్తిచేస్తే అంబర్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశముందని భావిస్తున్నారు.

# ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి చర్యలు

**రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**




**చెన్నూర్ మార్చి 6 (జనంసాక్షి) :** ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్ పర్సన్ నాయకపు వినయ్ కుమార్, 3వ వార్డు కౌన్సిలర్ అంబటి శంకర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు వరకు 99 రోజుల కార్యచరణ రూపొందించడం జరిగిందని, గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి లలో అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్‌పై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయడం జరుగుతుందని, వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయలు తీసుకుంటామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో ప్రజల సౌకర్యార్థం సి సి రోడ్లు, మురుగు కాలువలు, త్రాగునీటి కొరకు బోర్ వెల్ లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డుకు 15 లక్షల రూపాయల చొప్పున అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, ఆయా వార్డులలో నెలకొన్న సమస్యలపై పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి సమర్పించాలని తెలిపారు. శంకుస్థాపన చేసిన కార్యక్రమాల పనులను ప్రారంభించి నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలను ఓపికగా ఆలకించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, మహిళల ఆర్థిక అభివృద్ధ దిశగా రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని, అర్హత గల మహిళలకు వచ్చే విడతలో ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నగర అభివృద్ధి, డిఎంఎఫ్‌టి, సిఎస్ఆర్ నిధుల ద్వారా చెన్నూర్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసి మోడల్ టౌన్ గా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలను భాగస్వామ్యులను చేయడం జరుగుతుందని, పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామని, ఉపయోగకరమైన చెత్తను వేరుచేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించడం జరుగుతుందని తెలిపారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల పనులను వేగవంతం చేస్తామని, చెన్నూర్‌లో చేపట్టిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అందరిచే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ చేయించారు. చెన్నూర్ పట్టణం లోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో 50 లక్షల రూపాయల నిధులతో ఫంక్షన్ హాల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 10న విశాఖలో అంతర్జాతీయ మహిళాదినోత్సవ సభ

- ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ..
- కలిసి పోరాడాలని చైతన్య మహిళా సంఘం ఏపీ, తెలంగాణ రాష్ట్ర కమిటీల పిలుపు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళలపై హింసను పెంచుతున్న ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ చైతన్యమహిళా సంఘం మార్చ్ 10న, 10.30 గంటల నుండి విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో సభ జరుపుతోందని చైతన్య మహిళా సంఘం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర కమిటీలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ బి. జ్యోతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-కన్వీనర్ రాధ, తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్ కె.శ్రీదేవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'బాలికా విద్యకు ఎంతో కృషి చేసిన సావిత్రిబాయిపూలే వర్ధంతి రోజున మార్చి 8 అంతర్జాతీయ శ్రామికమహిళా పోరాటదినం స్ఫూర్తితో ఈ సభ జరుగుతుంది. సీఎంఎస్ స్టేట్ కమిటీ మెంబెర్ లలిత అధ్యక్షతన, స్టేట్ కన్వీనర్స్ రాధ, శ్రీదేవి, ఆంధ్రా యూనివర్సిటీ లా కాలేజ్ రిటైర్డ్ ప్రొఫెసర్ నిర్మలారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పల్లవి వక్తలుగా పాల్గొంటారు. మహిళా ప్రజా సంఘాల సందేశాలు ఉంటాయి' అని తెలిపారు. సూర్యుడి వెలుగును చూడనివ్వని పని గంటలకు, శ్రమదోపిడీకి వ్యతిరేకంగా దశాబ్దాలతరబడి పోరాటం చేసి 8 గంటల పనిని సాధించారు కార్మికులు. ఇందులో ప్రధాన పాత్ర పోషించి, ప్రాణత్యాగాలు చేసిన మహిళా కార్మికుల పోరాటస్ఫూర్తి దినం మార్చ్ 8. మళ్ళీ ఇప్పుడు 12 గంటల పని కాలం వచ్చింది. 4 లేబర్ కోడ్‌ల ద్వారా కార్మిక యాజమాన్య సంబంధాల్లో ప్రభుత్వజోక్యం తగ్గి యాజమాన్యాలకు అధికారాలు పెరిగి కార్మికుల ఆర్థిక ఉద్యోగ అభద్రత పెరిగింది. మహిళా కార్మికులకు మరింతగా ఈ సమస్యలు పెరగడంతో పాటు ఇప్పటికే తీవ్రంగా వున్న లైంగిక దోపిడీ మరింత పెరిగే ప్రమాదం ఏర్పడింది. ప్రభుత్వ నియంత్రణతో మాత్రమే ఆపగలిగిన మద్యం, డ్రగ్స్, పోర్న్ విచ్చలవిడిగా పెరిగి, యువత నిర్వీర్యమవుతోంది. శాస్త్రీయవిద్య, ఉపాధి లేని యువత వీటికి బానిసయింది. హింసా ప్రవృత్తి పెరిగింది. పితృస్వామ్య భావజాలం, ఈ అనారోగ్య సామాజిక వాతావరణం మహిళలపై మరింత హింస జరగడానికి కారణమవుతున్నాయి' అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు పర్చి, యువతకు విద్య ఉపాధి కల్పించాలని, మత్తుపదార్థాలను నిరోధించి మహిళలపై నేరాలను అరికట్టే అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మహిళలు, అన్ని సెక్షన్ల ప్రజలు కలిసి పోరాడాలని పిలుపునిస్తూ జరుగుతున్న ఈ సభను జయప్రదం చేయాల్సిందిగా వారు కోరారు.

# వైద్య విద్య బలోపేతానికి సదుపాయాలు కల్పిస్తాం

- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 6 (జనంసాక్షి) :** ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ వైద్య కళాశాలలలో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట ప్రాంతంలోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల కొరకు ఏర్పాటుచేసిన బస్సులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లు రేఖ, జగతీ దేవి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఎం.పి. నిధుల నుండి 2 బస్సులు, డి. ఎం. ఎఫ్. టి. నిధుల నుండి 1 బస్సు మొత్తం 80 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దేశంలోని ఇతర ప్రాంతాల నుండి వచ్చి వైద్య విద్య అభ్యసిస్తున్నారని, వైద్య విద్య అనేది ప్రత్యేకమైనదని తెలిపారు. చదువుకోవడం అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, ఉన్నత చదువులు అభ్యసించి ఆదర్శంగా నిలవాలని, ఉన్నత స్థాయిలో ప్రజలకు సేవ అందించడం బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కొరకు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. గడిచిన 2 సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని రామగుండం, బెల్లంపల్లి, రేచిని ఇతర ప్రాంతాలలో ఓవర్ బ్రిడ్జిలు, ఇతర అభివృద్ధి కొరకు అనుమతులు పొంది పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. రైల్వే స్టేషన్లను ఆధునికరిస్తూ అనేక చర్యలు చేపట్టడం జరుగుతుందని, మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలు నిలుపడం ద్వారా రైల్వే శాఖకు ఈ ప్రాంతం నుండి అధిక ఆదాయాన్ని సమకూర్చామని తెలిపారు. విద్యారం గాన్ని పటిష్టపరిచి అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల కొరకు నూతన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు 1 వేయి మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారని తెలిపారు. వైద్య విద్య కొరకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్, మెటీరియల్, ఫ్యాకల్టీ ఇతర అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని, విద్యార్థులకు అవసరమైన బస్సులను ప్రారంభించామని తెలిపారు. ఇటీవల వరుసగా జరిగిన పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల కారణంగా ఆలస్యం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్ఓడి శ్రీకాంత్, ఎడి తులసీదేవి, డిసిసి ప్రతినిధి రఘునాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున్‌ను కలిసిన కలెక్టర్

**హనుమకొండ ప్రతినిధి మార్చి 6 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్, డాక్టర్ దేవరాజు నాగార్జున్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యుత్ సంబంధిత అంశాలపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో చేపట్టిన బహిరంగ విచారణ నిమిత్తం హనుమకొండలోని హరిత కాకతీయ కు చేరుకున్న జస్టిస్ నాగార్జున్‌ను కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, టీజీఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు, పూల మొక్కలను అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**వనపర్తి, మార్చి 6 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఏదుల మండల కేంద్రం సమీపంలో ఓ ఆటో ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని వెంకటయ్య (50), సుమిత్ర (42)గా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు వనపర్తి జిల్లా పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో స్థానిక ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు.



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 06(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం లో విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కని అందచేసిన ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు. ఈ సందర్భంగా ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌరవ శ్రీ రేవంత్ రెడ్డి ప్రకటించిన పబ్లిక్ స్కూల్స్ ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు కేటాయించగలరని, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరడమైనది. ప్రత్యేక కార్యదర్శి స్పందిస్తూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రివర్యులు అయినందున విద్యాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చే విధంగ కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# హసన్‌పర్తి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం





**హనుమకొండ ప్రతినిధి, మార్చి 6 (జనం సాక్షి) :** హసన్ పర్తి మండల కేంద్రంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఎస్ఆర్ విద్యాసంస్థకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను వరంగల్ ఎల్లమ్మ బజార్‌కు చెందిన ఆకుతోట సుప్రతిక, మంగపేటకు చెందిన అక్రమ్‌గా పోలీసులు గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మృతుల తల్లిదండ్రులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని గుండెలవిసేలా విలపించారు. వారి రోదనలు అక్కడ ఉన్నవారిని కూడా కంటతడి పెట్టించాయి. ఈ ఘటనపై హసన్ పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సివిల్స్‌లో మెరిసిన 20 మంది
# రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం

- సింగరేణి ఉద్యోగి కుమార్తె జి .సృజనకు ఆల్ ఇండియా స్థాయిలో 55 ర్యాంకు
- సివిల్స్ విజేతలకు అభినందనలు తెలియజేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

ప్రతిష్టాత్మక సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో తెలంగాణ అభ్యర్థులు సత్తా చాటడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా సివిల్ సర్వీసెస్ లో తెలంగాణ యువత రాణించాలన్న లక్ష్యంతో సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద ఆర్థిక చేయూత అందుకున్న 20 మంది అభ్యర్థులు తుది ఫలితాల్లో విజేతలుగా నిలవడంపై ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ యువత ఆకాంక్షలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందన్నారు. సింగరేణి ఉద్యోగి జి. రాజేశం కుమార్తె జి. సృజన జాతీయ స్థాయిలో 55వ ర్యాంకు సాధించడంపై సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. సివిల్స్ విజేతలకు అభినందనలు తెలిపారు.

### ఇదీ నేపథ్యం...

ఈ పథకం కింద ఈ ఏడాది 202 మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులు అయిన వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. వీరిలో 51 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారికి మరో లక్ష రూపాయల చొప్పున ఆర్థిక చేయూత అందించగా.. వారిలో ఈ రోజు ప్రకటించిన ఫలితాల్లో 20 మంది విజేతలుగా నిలిచారు. గత ఏడాది ప్రారంభించిన పథకంలో తొలుత 140 మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించిన వారికి సాయం అందించగా.. వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. వారిలో ఏడుగురు విజేతలుగా నిలిచారు.

రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద సింగరేణి సంస్థ ఆర్థిక సహాయం పొంది సివిల్ సర్వీసెస్ 2025 తుది ఫలితాల్లో విజేతలుగా ఎంపికైన 20 మందిలో 10 మంది ఓబీసీ అభ్యర్థులు, నలుగురు ఎస్టీ అభ్యర్థులు, ముగ్గురు చొప్పున ఎస్సీ, జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఉండటం విశేషం. మొత్తం మీద 16 మంది పురుష అభ్యర్థులు, 4 మంది మహిళా అభ్యర్థులు విజేతలుగా నిలిచారు. అత్యధికంగా రంగారెడ్డి నుండి ఐదుగురు, మేడ్చల్ మల్కాజగిరి మరియు వరంగల్ అర్బన్ నుండి ముగ్గురు చొప్పున ఎంపిక కాగా ములుగు, నల్గొండ, పెద్దపల్లి, సూర్యాపేట, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, మహబూబ్ నగర్, మెదక్ జిల్లాల నుండి ఒక్కొక్కరు ఎంపిక అయ్యారు .

## భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలి

**విశ్వజన కళా మండలి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మాస్టార్ జి**



**నిర్మల్ బ్యూరో, మార్చ్ 6 (జనంసాక్షి) :** జై భీమ్ సేన, మానవ హక్కుల పరిరక్షణ సంఘం తెలుగు ఉమ్మడి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని 6 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టులుగా పాఠ్యాంశములలో చేర్చాలని డిమాండ్ తో దేశవ్యాప్తంగా 5 లక్షల కిలోమీటర్లు భారతదేశ రాజ్యాంగ పాఠ్యాంశ రథయాత్ర లో భాగంగా శుక్రవారం నిర్మల్ కు చేరుకున్నారు. భారత రాజ్యాంగ రథయాత్ర నాయకులకు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు మెమోరాండం అందజేశారు.. టీఎన్జీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాస్టర్ జి మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల లో సబ్జెక్టులుగా చేర్చాలని అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలలో రథయాత్ర ద్వారా ప్రయాణిస్తూ కోటి సంత కాల సేకరణ చేపడుతున్నామనీ అన్నారు. అనంతరం గోడ ప్రతులను కరప త్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు రాజ్యాంగం అంజన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గట్టు అశోక్, జాతీయ కమిటీ సలహాదారులు మిడనల నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సలహాదారులు ఎర్ర అలెగ్జాండర్ ప్రభు, రాష్ట్ర కమిటీ మహిళా అధ్యక్షురాలు ఆవుల ఎస్తేరు రాణి, తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ఈ పురుషోత్తం లు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్య సేవలకు ప్రత్యేక చర్యలు



- మంత్రి జూపల్లి కృష్ణారావు

**నేరడిగొండ, మార్చి 6 (జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలో తెలంగాణ ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఈ మెడికల్ క్యాంప్ ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ డీఎంహెచ్ఓ నరేందర్ వైద్యులు స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# ఆర్థికంగా కుంగిపోతున్న తెలంగాణ విశ్వవిద్యాలయాలు

**తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం కృంగిపోతున్న ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ ఇది తిరుగలేని సంక్షోభం కాదు. సరైన ప్రణాళిక, సమగ్ర విధానాలు అమలు అయితే 2030 నాటికి స్థిరత్వం సాధ్యమే. ఉన్నత విద్యా సంస్థలు రాష్ట్ర అభివృద్ధికి పునాది, జ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణానికి కీలకంగా ఉంటాయి. కాబట్టి ఆర్థిక పునరుద్ధరణ, పారదర్శక నిర్వహణ, పరిశోధన ఆధారిత ఆదాయ వనరుల విస్తరణ, పరిశ్రమల భాగస్వామ్యాలు, మానవ వనరుల సంస్కరణ తక్షణంగా చేపట్టాలి. ఈ చర్యలు అమలు అయినప్పుడు తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు స్థిరమైన భవిష్యత్తుకు దారితీస్తాయి.**




తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మొత్తం 12 ప్రధాన ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని సాధారణంగా గుర్తించబడుతున్నాయి. ఇవి రాష్ట్ర ఉన్నత విద్యా వ్యవస్థకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యా వ్యవస్థ రాష్ట్ర సామాజిక, ఆర్థిక , సాంస్కృతిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, సాతవాహన విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, తెలంగాణ విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయం, కాళోజి నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వంటి విశ్వవిద్యాలయాలుదశాబ్దాలుగా తెలంగాణ ప్రాంతానికి విద్యా, పరిశోధన, సాంస్కృతిక రంగాల్లో సేవలందిస్తున్నాయి.

2014కు ముందు పరిస్థితులను పరిశీలిస్తే, అప్పటి సంయుక్త రాష్ట్ర వ్యవస్థలో ఉన్నప్పటికీ ఈ విశ్వవిద్యాలయాల ఆర్థిక పరిస్థితి తక్కువ ఒత్తిడితో సాగింది. ప్రభుత్వ గ్రాంట్లు సమయానికి విడుదల కావడం, వేతనాల చెల్లింపుల్లో ఆలస్యం తక్కువగా ఉండటం, యూజీసీ వంటి జాతీయ సంస్థల నుంచి అభివృద్ధి నిధులు కొంతవరకు అందడం వల్ల వ్యవస్థ స్థిరంగా ఉండేది. 2005-2013 మధ్య కాలంలో విద్యార్థుల చేరికలు కూడా స్థిరంగా ఉండేవి. వేతనభారం ఉన్నప్పటికీ ప్రభుత్వ ప్రత్యక్ష మద్దతు 70% పైగా ఉండటం వల్ల ఆర్థిక లోటు తీవ్రమైన స్థాయికి చేరలేదు. అయితే 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పరిస్థితులు క్రమంగా మారాయి. కొత్త రాష్ట్ర నిర్మాణ దశలో మౌలిక వసతుల విస్తరణకు పెద్దపీట వేయబడింది. కొత్త భవనాలు, హాస్టళ్లు, ప్రయోగశాలలు, పరిపాలనా విభాగాల విస్తరణకు నిధులు కేటాయించబడ్డాయి. ప్రారంభ దశలో ఇది అభివృద్ధి సూచికగా కనిపించినా, తర్వాతి సంవత్సరాల్లో నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయి. 2014--2024 మధ్య వేతనాలు సుమారు 100% పైగా పెరిగినట్లు అంచనాలు సూచిస్తున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ గ్రాంట్ల పెరుగుదల ఆ శాతానికి సరిపోలలేదు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం విస్తరణ మరో కీలక అంశంగా మారింది. విద్యార్థుల సంఖ్య పెరగడం సానుకూల అంశమే అయినప్పటికీ, రీయింబర్స్‌మెంట్ బకాయిలు 12--18 నెలలు ఆలస్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఆ ల స్యా ల ం విశ్వవిద్యాలయాల నగదు ప్రవాహాన్ని దెబ్బతీశాయి. జీతాల చెల్లింపుల కోసం అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితులు కొన్ని క్యాంపస్‌లలో కనిపించాయి. ముఖ్యంగా ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం వంటి పెద్ద విశ్వవిద్యాలయాలు వేలాది సిబ్బందికి వేతనాలు చెల్లించాల్సిన బాధ్యతతో మరింత ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. 2014కు ముందు వేతనాలు, నిర్వహణ ఖర్చులు కలిపి మొత్తం వ్యయంలో సుమారు 65% ఉండగా, 2025 నాటికి అది 75%-80% వరకు పెరిగినట్లు అంచనా. అభివృద్ధి, పరిశోధన రంగాలకు కేటాయింపులు తగ్గిపోయాయి. ఖాళీ బోధన పోస్టులు భర్తీ కాకపోవడం మరో సమస్యగా మారింది. కొన్ని విశ్వవిద్యాలయాల్లో 30%-40% వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు సూచిస్తున్నాయి. ఇది విద్యా నాణ్యతపై ప్రభావం చూపింది. స్వయం ఆర్థిక కోర్సులు ఒక దశలో ఆదాయ వనరుగా భావించబడ్డాయి. అయితే 2020 తర్వాత ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పెరుగుదల, ఆన్‌లైన్ విద్యా వేదికల విస్తరణ కారణంగా ఈ కోర్సులలో చేరికలు తగ్గాయి. ఆశించిన ఆదాయం రాకపోవడంతో ఆర్థిక లోటు మరింత పెరిగింది. ఇప్పటికే నియమించిన సిబ్బందిని కొనసాగించాల్సిన బాధ్యత వల్ల ఖర్చులు తగ్గించడం సాధ్యం కాలేదు.

మొత్తం దృశ్యాన్ని పరిశీలిస్తే, 2014కు ముందు కొంత స్థిరత్వంతో సాగిన ఆర్థిక వ్యవస్థ 2014 తర్వాత విస్తరణ, వేతనభారం, బకాయిల ఒత్తిడి కారణంగా క్రమంగా దిగజారింది. 2026 నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఈ 12 విశ్వవిద్యాలయాలు వార్షిక బడ్జెట్‌లో సుమారు 15%--20% లోటుతో కొనసాగుతున్నాయని అంచనా వేయవచ్చు. అభివృద్ధి ప్రాజెక్టులు నెమ్మదించడం, పరిశోధన నిధుల కొరత, మౌలిక సదుపాయాల నిర్వహణలో ఆలస్యం వంటి సమస్యలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతిమంగా, తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం ఆర్థిక భారాన్ని మోస్తున్న కీలక దశలో ఉన్నాయి. సమయపాలిత గ్రాంట్లు, వేతన నిర్మాణ పునర్వ్యవస్థీకరణ, పరిశోధన గ్రాంట్ల పెంపు, పరిశ్రమల భాగస్వామ్యంతో ప్రత్యామ్నాయ ఆదాయ వనరుల సృష్టి వంటి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత క్లిష్టమయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర ఉన్నత విద్య భవిష్యత్తు స్థిరత్వం కోసం సమగ్ర ఆర్థిక సంస్కరణలు అత్యవసరం. మొత్తం దృశ్యాన్ని సమగ్రంగా పరిశీలించినప్పుడు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న 12 విశ్వవిద్యాలయాల ఆర్థిక పరిస్థితి 2014 తర్వాత క్రమంగా క్షీణించిన వాస్తవం స్పష్టంగా కనిపిస్తుంది. 2014కు ముందు పరిమిత వనరులతోనూ, నియంత్రిత వ్యయ నిర్మాణంతోనూ, సమయానుకూల గ్రాంట్లతోనూ ఈ విశ్వవిద్యాలయాలు ఒక స్థిరత్వాన్ని కలిగి ఉండేవి. అప్పటి వ్యవస్థలో వేతనభారం ఉన్నప్పటికీ, ప్రభుత్వ మద్దతు శాతం 70% వరకు ఉండటం వల్ల ఆర్థిక లోటు తీవ్రమైన సంక్షోభంగా మారలేదు. అయితే రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విస్తరణ, కొత్త క్యాంపస్‌లు, అదనపు సిబ్బంది నియామకాలు, పెరుగుతున్న పరిపాలనా ఖర్చులు కలిసి ఖజానాపై గణనీయమైన భారం మోపాయి.

2014-2026 మధ్య కాలంలో వేతన వ్యయం సుమారు 100% పైగా పెరిగినట్లు అంచనా వేయవచ్చు. అదే సమయంలో ప్రభుత్వ గ్రాంట్ల పెరుగుదల దానికి అనుపాతంగా లేకపోవడం వల్ల విశ్వవిద్యాలయాలు నగదు ప్రవాహ సమస్యలను ఎదుర్కొన్నాయి. వేలాది సిబ్బంది వేతనాలు, పెన్షన్ బాధ్యతలు, నిర్వహణ ఖర్చులు కలిపి వార్షిక వ్యయంలో 75%-80% వరకు చేరినట్లు అంచనాలు సూచిస్తున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలకు మిగిలే మొత్తం 10% లోపే ఉండటం ఆందోళన కలిగించే అంశం. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్య మరో కీలక అంశంగా నిలిచింది. కొన్ని సంవత్సరాల్లో 12-18 నెలల ఆలస్యం నమోదైందని విద్యా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిస్థితి వల్ల విశ్వవిద్యాలయాలు బ్యాంకు అప్పులు తీసుకోవడం, అంతర్గత నిధులను వాడుకోవడం వంటి చర్యలకు దిగాల్సి వచ్చింది. ఫలితంగా వడ్డీ భారం కూడా పెరిగింది. 2025 చివరినాటికి కొన్ని విశ్వవిద్యాలయాల్లో సమీకృత లోటు 15%--20% వరకు ఉన్నట్లు అంచనా వేయవచ్చు. ఇది తక్షణ ఆర్థిక సంస్కరణలు అవసరమని సూచిస్తుంది.

బోధన పోస్టుల ఖాళీలు 30%--40% వరకు ఉండటం విద్యా నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. నియామకాల ఆలస్యం వల్ల తాత్కాలిక అధ్యాపకులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. పరిశోధన ప్రాజెక్టుల పరంగా కూడా వెనుకబాటు స్పష్టంగా కనిపిస్తోంది. జాతీయ స్థాయి గ్రాంట్ల పోటీలో వెనుకబడటం వల్ల కేంద్ర నిధుల వాటా తగ్గింది. దీని ప్రభావం ప్రయోగశాలల ఆధునీకరణ, కొత్త కోర్సుల ప్రవేశపెట్టడంపై పడింది. స్వయం ఆర్థిక కోర్సులు ప్రారంభ దశలో ఆదాయ వనరుగా కనిపించినప్పటికీ, 2020 తర్వాత ప్రైవేట్ రంగ పోటీ పెరగడంతో అడ్మిషన్లు 15% వరకు తగ్గినట్లు అంచనా. ఆశించిన ఆదాయం రాకపోవడంతో ఆర్థిక సమతుల్యత సాధ్యం కాలేదు. ఇప్పటికే సృష్టించిన మౌలిక వసతులు, నియమించిన సిబ్బంది కొనసాగింపుతో ఖర్చులు తగ్గించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాలు అభివృద్ధి ప్రాజెక్టులను వాయిదా వేయాల్సి వచ్చింది.

2026 నాటికి రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల కలిపిన వార్షిక వ్యయం సుమారు 4,500-5,000 కోట్ల మధ్య ఉండవచ్చని అంచనా. అందులో ప్రత్యక్ష ప్రభుత్వ గ్రాంట్లు 60%-65% వరకు మాత్రమే ఉంటే, మిగతా భాగం ఫీజులు, గ్రాంట్లు, ఇతర వనరుల ద్వారా సమీకరించాల్సిన పరిస్థితి ఉంది. ఈ గ్యాప్‌ను పూడ్చేందుకు సమగ్ర వ్యూహం అవసరం. వేతన నిర్మాణ పునర్వ్యవస్థీకరణ, ఖాళీ పోస్టుల సమీక్ష, డిజిటల్ పరిపాలన ద్వారా ఖర్చుల తగ్గింపు, పరిశ్రమల భాగస్వామ్యంతో ఆదాయ వనరుల విస్తరణ వంటి చర్యలు అత్యవసరం.

మొత్తంగా, తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఆర్థిక పరిస్థితి 2026 నాటికి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, ఇది తిరుగులేని సంక్షోభం కాదు. సరైన విధాన నిర్ణయాలు, సమయపాలిత నిధుల విడుదల, ఖర్చుల నియంత్రణ, ఆదాయ వనరుల విస్తరణ, పారదర్శక పరిపాలన అమలు చేస్తే 2030 నాటికి స్థిరత్వం సాధ్యమే. 2014 తర్వాత విస్తరణ దశలో ఏర్పడిన అసమతుల్యతను 2026-2030 మధ్య సంస్కరణల దశగా మలచుకోవాలి. ఉన్నత విద్య రాష్ట్ర అభివృద్ధికి మూలాధారం. విశ్వవిద్యాలయాల ఆర్థిక పునరుద్ధరణ రాష్ట్ర భవిష్యత్తు జ్ఞాన సమాజ నిర్మాణానికి పునాది అవుతుంది. సరైన ప్రణాళికతో ముందుకు సాగితే, ప్రస్తుతం కనిపిస్తున్న 15%--20% లోటు పరిస్థితి క్రమంగా తగ్గి, స్థిరమైన ఆర్థిక నిర్మాణం ఏర్పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.విద్యా నాణ్యతకు పెద్ద భారం వేతన భారం. నియామకాల ఆలస్యం తాత్కాలిక అధ్యాపకులపై ఆధారపడే పరిస్థితిని ఏర్పరిచింది. అభివృద్ధి కార్యక్రమాలు 10% లోపే నిధులతో నడుస్తున్నాయి. స్వయం ఆర్థిక కోర్సులు ఆదాయ వనరుగా ఉండగా, 2020--2026 మధ్య ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పోటీ కారణంగా అడ్మిషన్లు సుమారు 15% తగ్గాయి. ఫలితంగా ఆశించిన ఆదాయం అందలేదు.

సమగ్ర పరిష్కారాలుగా డిజిటల్ పరిపాలన, ఆన్‌లైన్ టెండర్ విధానం, నిర్వహణ ఖర్చుల తగ్గింపు, పరిశోధన కన్సల్టెన్సీ ప్రాజెక్టులు, అలుమ్ని ఎండోమెంట్‌లు, పరిశ్రమల భాగస్వామ్యం ముఖ్యంగా అమలు చేయాలి. ప్రతి విశ్వవిద్యాలయం కనీసం 15% స్వీయ ఆదాయం లక్ష్యంగా పెట్టుకోవాలి. మానవ వనరుల సంస్కరణలో ప్రాధాన్యతా క్రమంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. పనితీరు ఆధారిత ప్రోత్సాహక విధానం, నిరంతర శిక్షణా కార్యక్రమాలు విద్యా నాణ్యత పెంచడానికి అవసరం.

పరిశోధన రంగ అభివృద్ధి కోసం జాతీయ, అంతర్జాతీయ గ్రాంట్లలో పోటీ పెంచాలి. స్టార్టప్ ఇంక్యుబేషన్, పరిశ్రమల భాగస్వామ్యం ద్వారా ఆర్థిక శక్తిని విస్తరించాలి. ప్రభుత్వ గ్రాంట్ల ఆధారపడే శాతం 50%--65% మధ్య ఉండేలా నియంత్రణ అవసరం. స్వీయ ఆదాయం 20% స్థాయికి చేరాలి. 2030 దృష్టిలో డిజిటల్ పరిపాలన పూర్తి అమలు చేయడం, సమయపాలిత నిధుల విడుదల, పారదర్శక ఆర్థిక నిర్వహణ అత్యంత కీలకం.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు 2014 తర్వాత విస్తరణ దశలోకి ప్రవేశించాయి. కొత్త క్యాంపస్‌లు, హాస్టళ్లు, ప్రయోగశాలలు, అదనపు సిబ్బంది నియామకాలు నిర్వహణ ఖర్చులను పెంచాయి. వేతన వ్యయం సుమారు 100% పెరగడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు 12-18 నెలలు ఆలస్యం కావడం, పరిశోధన నిధుల కొరత, ఖాళీ బోధన పోస్టులు 30%-40% స్థాయికి చేరడం వంటి పరిస్థితులు ఈ విశ్వవిద్యాలయాలను ఆర్థిక ఒత్తిడికి గురిచేశాయి. 2026 నాటికి వార్షిక వ్యయం ?4,500-?5,000 కోట్ల మధ్య ఉండగా, ప్రభుత్వ గ్రాంట్లు 60%-65% మాత్రమే ఉంటాయి. మిగతా నిధులు ఫీజులు, స్వీయ ఆదాయాలు, పరిశోధన ప్రాజెక్టులు, పరిశ్రమల భాగస్వామ్యాల ద్వారా సమీకరించాల్సి ఉంటుంది.

విద్యా నాణ్యతకు పెద్ద భారం వేతన భారం. నియామకాల ఆలస్యం తాత్కాలిక అధ్యాపకులపై ఆధారపడే పరిస్థితిని ఏర్పరిచింది. అభివృద్ధి కార్యక్రమాలు 10% లోపే నిధులతో నడుస్తున్నాయి. స్వయం ఆర్థిక కోర్సులు ఆదాయ వనరుగా ఉండగా, 2020--2026 మధ్య ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పోటీ కారణంగా అడ్మిషన్లు సుమారు 15% తగ్గాయి. ఫలితంగా ఆశించిన ఆదాయం అందలేదు.

సమగ్ర పరిష్కారాలుగా డిజిటల్ పరిపాలన, ఆన్‌లైన్ టెండర్ విధానం, నిర్వహణ ఖర్చుల తగ్గింపు, పరిశోధన కన్సల్టెన్సీ ప్రాజెక్టులు, అలుమ్ని ఎండోమెంట్‌లు, పరిశ్రమల భాగస్వామ్యం ముఖ్యంగా అమలు చేయాలి. ప్రతి విశ్వవిద్యాలయం కనీసం 15% స్వీయ ఆదాయం లక్ష్యంగా పెట్టుకోవాలి. మానవ వనరుల సంస్కరణలో ప్రాధాన్యతా క్రమంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. పనితీరు ఆధారిత ప్రోత్సాహక విధానం, నిరంతర శిక్షణా కార్యక్రమాలు విద్యా నాణ్యత పెంచడానికి అవసరం.

పరిశోధన రంగ అభివృద్ధి కోసం జాతీయ, అంతర్జాతీయ గ్రాంట్లలో పోటీ పెంచాలి. స్టార్టప్ ఇంక్యుబేషన్, పరిశ్రమల భాగస్వామ్యం ద్వారా ఆర్థిక శక్తిని విస్తరించాలి. ప్రభుత్వ గ్రాంట్ల ఆధారపడే శాతం 50%-65% మధ్య ఉండేలా నియంత్రణ అవసరం. స్వీయ ఆదాయం 20% స్థాయికి చేరాలి. 2030 దృష్టిలో డిజిటల్ పరిపాలన పూర్తి అమలు చేయడం, సమయపాలిత నిధుల విడుదల, పారదర్శక ఆర్థిక నిర్వహణ అత్యంత కీలకం.

తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం కృంగిపోతున్న ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ ఇది తిరుగలేని సంక్షోభం కాదు. సరైన ప్రణాళిక, సమగ్ర విధానాలు అమలు అయితే 2030 నాటికి స్థిరత్వం సాధ్యమే. ఉన్నత విద్యా సంస్థలు రాష్ట్ర అభివృద్ధికి పునాది, జ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణానికి కీలకంగా ఉంటాయి. కాబట్టి ఆర్థిక పునరుద్ధరణ, పారదర్శక నిర్వహణ, పరిశోధన ఆధారిత ఆదాయ వనరుల విస్తరణ, పరిశ్రమల భాగస్వామ్యాలు, మానవ వనరుల సంస్కరణ తక్షణంగా చేపట్టాలి. ఈ చర్యలు అమలు అయినప్పుడు తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు స్థిరమైన భవిష్యత్తుకు దారితీస్తాయి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# ప్రజాప్రభుత్వంలో రైతులంటే పట్టింపేది?

తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి..రెండు సంవత్సరాల రెండు నెలల 6 రోజులు అవుతోంది. అయినా ఇంకా పూర్తి స్థాయిలో పాలనపై పట్టు సాధించినట్లు కనిపించడం లేదు. సంక్రాంతి పండుగకు 'రైతు భరోసా' ఇస్తామని ఆశపెట్టి.. అటు తర్వాత మున్సిపల్ ఎన్నికల కోడ్ పూర్తయ్యాక అని సాగదీశారు. అవి ముగిశాక కేబినెట్ భేటీ తర్వాత అన్నారు. అదీ అయింది. అయినా ఇంకా 'భరోసా' మాత్రం రైతుకు అందలేదు. గత ప్రభుత్వం కరోనా కష్టకాలంలోనూ ఠంఛనుగా 'రైతుబంధు' అందజేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సర్కారును గత ప్రభుత్వంతో పోల్చి చూసినపుడు బీఆర్ఎస్ పాలనే బెటర్ అనే ఫీలింగ్ ప్రజల్లో బలపడుతోంది.

'ఎద్దు ఏడ్చిన ఎవుసం .. రైతు ఏడ్చిన రాజ్యం' బాగుపడదనే సంగతి ప్రస్తుత ఏలికలకు బాగా తెలుసు. అయినా ప్రాధాన్యత క్రమంలో ఫార్మర్ వెల్ఫేర్‌ను పక్కనపెట్టినట్లే కనబడుతోంది ఎందుకో మరి. పాలనపై పట్టు బిగించాల్సింది పోయి.. డైవర్షన్ పాలిటిక్స్‌కు మాత్రమే రంగం సిద్ధం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు?న్నది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు బోలెడు హామీల సంగతి ఊసే లేదనలేం. ఫ్రీ బస్ జర్నీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు, ఆరోగ్య శ్రీ వంటి కొన్నింటికి శ్రీకారం చుట్టారు. కానీ, 'మహాలక్ష్మి'లో కీలకమైన రూ.2,500, 'కల్యాణ లక్ష్మి'కి తులం బంగారం, ఫ్రీ స్కూటీలతో పాటు మరిన్ని కీలకమైన హామీలన్నింటిపైనా కనీస ప్రకటన చేయలేకపోతున్నారు. ఆర్థికంగా భారం ఉన్నదని, గత ప్రభుత్వ అప్పుల వల్ల చేయలేకపోతున్నామని సుస్పష్టంగా తెలిపేందుకు సైతం సంకోచిస్తున్నారు. బహుశా ఎన్నికల ఫలితాలలో అవి ప్రభావం చూపుతాయని భావిస్తున్నట్లున్నారు. కానీ, ఇప్పటికే స్థానిక సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు ముగిశాయి. రాబోయే పరిషత్ ఎలక్షన్స్‌లోనూ గెలుపే లక్ష్యమని టార్గెట్ పెట్టుకున్నట్లు?న్నారు. అయితే, ఇవన్నీ ముగిసేనాటికి క్షేత్రస్థాయిలో పరిస్థితులలో మార్పులు జరిగితే మాత్రం అసెంబ్లీ ఎన్నికల నాటికి జనం 'చేతి'ని వీడేలా మార్పులు జరగొచ్చు. అధికార పార్టీలో అంతర్గతంగానే కాక, బయట కూడా చినికి చినికి గాలివానలా ఎప్పుడైనా ఏదైనా జరగొచ్చు. అసమ్మతి పవనాలు, బీసీ వాదం ఇంకా బలపడిన క్రమంలో ఆ పార్టీ అధిష్టానం సైతం ఏమీ చేయలేని పరిస్థితులు రావచ్చు. దిద్దుబాటు చర్యలు ఇప్పటి నుంచే మొదలు పెడుతూ.. పరిస్థితులు చక్కబడేలా వ్యవహరించాల్సి ఉంటుంది. అవసరమైతే కేంద్రం నుంచి దూతల రూపంలో నేతలను సమన్వయ పరుస్తూ.. క్షేత్రస్థాయిలో ప్రజల శ్రేయస్సుకు బలంగా అడుగులు పడేలా.. అన్ని వర్గాలకు, ముఖ్యంగా రైతులకు న్యాయం జరిగేలా సూచనలు చేయాలి. గత సర్కారు హయాంలో రెండో సారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినపుడు సుమారు రెండు నెలలకు పైగా ఇద్దరే (కేసీఆర్, మహమూద్ అలీ) ప్రభుత్వంలో నాడు ముఖ్యమంత్రి, హోం మంత్రిగా బాధ్యతలు తీసుకున్న క్రమంలో తీవ్రమైన విమర్శలు కాంగ్రెస్ నేతల నుంచీ వచ్చాయి. కాగా, రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల రెండు నెలలు దాటుతోంది. అయినా ఇంకా రెండు బెర్తులు ఖాళీగానే ఉండటం గమనార్హం. దీనిపై నోరు మెదపలేని స్థితి ఉన్నది. కీలకమైన పోర్టుఫోలియోలు విద్య, మున్సిపల్, హోం శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉండటం చేత పాలనలో ఏ రకంగా పట్టు సాధించగలరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం ఈ విషయాలన్నింటిపైన సునిశిత పరిశీలన చేసి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.



**అంబీర్ శ్రీకాంత్,**
**సెల్ : 81859 68059**

## యుద్ధం కీడుకే..

అమెరికాకు అనుమానమే పెనుభూతమై నది
అహంకారం పడగలు విప్పింది
అగ్రరాజ్యం ఉగ్రరూప మెత్తింది
సోయి మరచి ఇజ్రాయిల్ వంత
పాడుతున్నది

ఇరాన్ అసలే తలవంచ నంటున్నది
దేనికైనా సిద్ధమై ప్రతిన పూనింది
నిరంకుశుల పాలిటి పిడుగునంటున్నది
అలి ఖమేనినే మా దేవుడంటున్నది

ఏ పాపమెరుగని విద్యార్థి నినుల బలి
తీసుకున్నది
విప్లవ ఖమేనీని చంపి సంబరపడు తున్నది
వారసులను కూడా వదలనని
విర్రవీగుతున్నది

మేము అసలైన నియంతలమని
రంకెలేస్తున్నది

పచ్చని దేశాల నెత్తురు మరిగినవి
కళ్ళు మండి కుళ్ళు తో కులుకుతున్నవి
పామరుల ఆర్తనాదాలతో
ఆటాడుకుంటున్నవి
వినాశకాలే విపరీత బుద్ధులు
ప్రకటిస్తున్నవి
తిన్నదరుగక యుద్ధమని హద్దుదాటు
తున్నవి
అందమైన విశ్వాన్ని విధ్వంసం లో
ముంచుతున్నవి
బాంబుల మోతలతో ధరణి విలపిస్తున్నది
అతి తెలివితో అవినీతికి కీడు
తలపెట్టుతున్నది

**నమిల కొండ నాగేశ్వర్ రావు**
**8688553470, మేడ్చల్**

## యుద్ధం మనకు

**సారీ, నాకు కాదు కదా శ్రీ**

ఆలోచనకు
ఆచరణకు
మధ్య..... సంఘర్షణ
ముగిసినట్లేనా

నూతన మానవుడిని
కలలు కన్నా
కాలం మీద మనిషి
ఇప్పుడు చెదలు పట్టి
వాడిపోయిన పూల చెట్టు
అయిండు.

కవి మాత్రం ఏం చేస్తాడు
రాసిన పద్యం
పదేపదే చదువుతుంటాడు.

ఎవరి ఒంటిమీద,
గాలివీస్తుందో
వాడి పక్కల, పద్యం
జోడించి
హుజూర్ అంటాడు.

కోటిస్తే, కల్లు తాగిన
కోతిలా గంతులేస్తాడు.

దేశం
దేశం చుట్టూ అల్లుకున్న
విశ్వము.
లావా బద్దలై
అగ్ని సముద్రంలో ఉంటే,

ఇప్పుడు అందరూ
అరుణోదయ కాంతి
ముఖపక్షులే

**2**

భయం కమ్మిన భ్రాంతి
ఎప్పుడు అందంగానే,
రంగుల హరివిల్లు లాగే
వికసిస్తుంది.

ఎటు వచ్చి..... సీతాకోకల
జీవన రెక్కలే
కత్తిరించబడుతాయి.
మాట
పాట... స్వస్థత కోల్పోయి
పరాయి గొంతులో
సాలెగూడు అవుతుంది.

నిన్ను నువ్వు
నేను నేను... ఎక్కడో తెగిన
గాలిపటం వాలిన ముళ్ళ
కంపలమీద
జీవం చచ్చిన
శరీరాలతో పడి ఉంటాము.

**3**

సబ్ టి హై
అందరూ మంచిగానే
ఉన్నారు
పాలకుల మాటే
మన అభివృద్ధి పాట.

ఖమ్మం....
ప్రజా దుఃఖం
కుమ్మెర...
పసిపిల్ల శుభం మీద

తల్లి దుఃఖం
అర్ధరాత్రి స్వాతంత్రం
తెచ్చిన
ఒకే ఒక్కడి
సాక్షిగా...,
మూసీ నది రోదన
వినిపించదు.

అమెరికా వాడి
సామ్రాజ కాంచ
కనిపించదు.

లొంగిపోవడం
లోపర్చుకోవడమే
ఏదో ఒకటి
నేను బ్రతుకుతే చాలు.

యుద్ధం మనకు
సారీ, నాకు కాదు కదాశ్రీ

**జనజ్వాల**
**9949163770**


'ముక్తవరం పార్థసారథి' ఇక లేరు

# తెలుగు సాహిత్యానికి తీరని లోటు

తెలుగు సాహిత్య లోకంలో మౌనంగా తపించి, మమకారంతో మార్గదర్శనం చేసిన మహనీయుడు ముక్తవరం పార్థసారథి. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోవచ్చు. కానీ, ఆయన రచనల్లో నిక్షిప్తమైన ఆలోచనా సంపద మాత్రం ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఎనభై ఒక్క ఏళ్ల వయసులో ఆయన తుదిశ్వాస విడవడం సాహితీ ప్రియులందరినీ కలచివేసింది.

గ్రామీణ నేపథ్యం నుంచి విశ్వసాహిత్య దర్శనం వరకు..

తెలంగాణలోని భువనగిరి ప్రాంతంలో జన్మించిన పార్థసారథి గారు సాధారణ కుటుంబంలో పెరిగినా అసాధారణమైన సాహితీ దృక్పథాన్ని పెంపొందించుకున్నారు. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలతోపాటు ప్రపంచ సాహిత్యాన్నీ సమానంగా అధ్యయనం చేశారు. ఈ విస్తృత పఠనమే ఆయన రచనలకు పునాదిగా నిలిచింది. ప్రపంచ సాహిత్యంలోని గొప్ప భావజాలాన్ని తెలుగులోకి అనువదించాలన్న తపన ఆయనలో ఎప్పుడూ జీవించింది.




**బహుముఖ ప్రతిభాశాలి**

కథ, నవల, విమర్శ, వ్యాస రచన, సాహిత్య చరిత్ర, అనువాదం – ఇలా ప్రతి ప్రక్రియలోనూ పార్థసారథి గారు తమదైన ముద్రవేశారు. సాధారణంగా ఒక రచయిత ఒక ప్రక్రియలోనే రాణిస్తారు. కానీ ఆయన మాత్రం అన్ని ప్రక్రియల్లో సమాన నైపుణ్యాన్ని ప్రదర్శించడం విశేషం. ఆయన గద్యం గంభీరంగా ఉండేది. పద ప్రయోగంలో కట్టుదిట్టం, భావ వ్యక్తీకరణలో సరళత ఆయన రచనల ప్రత్యేకతలు. 'మనసులోని చలి' నవలలో మానవ మనస్తత్వంలోని సంఘర్షణలను తాత్విక దృష్టితో విశ్లేషించారు. 'కించిర్విషాదం', 'నువ్వూ నేనూ–చిన్నారావు', 'రంగుల వల', 'పగిలిన అద్దం', 'నోబెల్ తారలు' వంటి రచనలు ఆయన సాహితీ వైవిధ్యానికి అద్దం పడతాయి.

అనువాదంలో ఆయన ప్రత్యేకత

ప్రపంచ సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేయడంలో పార్థసారథి గారు చేసిన కృషి అమూల్యం. అమెరికన్ రచయిత జాక్ లండన్ రచించిన "ది ఐరన్ హీల్" నవలను 'ఉక్కు పాదం' పేరిట ఆయన తెలుగులోకి అనువదించి, వర్గ దోపిడీ స్వరూపాన్ని, సామాజిక అసమానతల నిర్మాణాన్ని తెలుగు పాఠకులకు అర్థమయ్యేలా చేశారు. వివిధ దేశాల కథలను ఎంపిక చేసి 'వంద కథలు', 'కథల వాచకం' "14 దేశాలు , " 20 కథలు" వంటి సంకలనాలుగా అందించారు.కొన్ని కథల పుస్తకాలను ప్రజాశక్తి ప్రచురణ సంస్థ ప్రచురించింది.

**సామాన్యుడి జీవిత చిత్రకారుడు**

ఆయన కథల్లో సామాన్య మనిషి జీవితం ప్రతిబింబించింది. గ్రామీణ సమాజంలో జరిగే చిన్న చిన్న సంఘటనలను కూడా లోతైన మానసిక విశ్లేషణతో చిత్రించేవారు. 'చిట్టి ఏడుపు', 'ఆ రాత్రి', 'పరువు', 'పాఠం', 'పక్షి',, 'నీలికళ్ళు' వంద కథలు' పాఠకుల మనసుల్లో చెరగని ముద్రవేశాయి. మధ్యతరగతి జీవనశైలిలోని ఆత్మగౌరవం, అట్టడుగు వర్గాల పోరాటం, కుటుంబ బంధాల్లోని సంక్లిష్టతలు – ఇవన్నీ ఆయన కథల్లో సహజంగా మిళితమై ఉంటాయి.

**భాషాభిమాని, యువతరానికి మార్గదర్శి**

అచ్చతెలుగు పదాల వాడకంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. అనవసర విదేశీ పదాల వాడకాన్ని నివారించాలనుకునేవారు. సరళమైన పదాలతోనే లోతైన భావాలను వ్యక్తం చేయగల శక్తి ఆయన సొత్తు. యువ రచయితలను ప్రోత్సహించడంలో ఆయన ఎప్పుడూ ముందుండేవారు. తమ రచనలు పంపిన వారికి సూచనలిచ్చి, మార్గదర్శనం చేసేవారు.

చివరిగా... ముక్తవరం పార్థసారథి గారి మరణం కేవలం ఒక రచయిత మృతి మాత్రమే కాదు. ఒక ఆలోచనా సంప్రదాయ ధారకు ముగింపు. సంప్రదాయం, ఆధునికత మధ్య సమతుల్యం ఎలా ఉండాలో తన రచనల ద్వారా చూపించిన మార్గదర్శి ఆయన. ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగడమే ఆ మహనీయునికి నిజమైన నివాళి. ఆయన లేని లోటు భౌతికమైనదే కానీ, ఆయన ఆలోచనలు, రచనలు కాలగర్భంలో కలిసి పోకుండా తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆయన అభిమానులు, ప్రచురణ సంస్థలు ముందుకు వచ్చి, ఆయన రచనలను ఒక సమగ్ర సంకలనంగా ప్రచురిస్తే ఒక ప్రముఖ తెలంగాణ కవి, రచయితకు, తెలుగు సాహితీ లోకానికి మేలు జరుగుతుంది.మన తెలంగాణ యూనివర్సిటీ, తెలుగు అకాడమీ, తెలంగాణ సారస్వత పరిషత్తు మెదలైన సమోన్నత సంస్థలు, ఇతర తెలుగు భాషా, సాహిత్య సంస్థలు ఈ విషయంలో చొరవ చూపాలని సాహితీ అభిమానుల విజ్ఞప్తి.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# వికసిత భారత్ లక్ష్యంగా మహిళలు ముందుండాలి

**రాజేంద్రనగర్, మార్చి 6 (జనం సాక్షి) :** దేశ రక్షణ, అభివృద్ధి దిశగా ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా దేశానికి సేవ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, జనహిత వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హైదర్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆమె ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ సేవికా సమితి ప్రతినిధి నాగశ్రీ హాజరయ్యారు. కార్యక్రమంలో సుమారు 120 మంది మహిళలు, 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వర్ రెడ్డి, నాగశ్రీలు మాట్లాడుతూ వికసిత భారత్ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. మహిళలు విద్య, ఉద్యోగాలు, వ్యాపారాలు, సామాజిక సేవల్లో ముందుండటం ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తేనే 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యం



సాధ్యమవుతుందని అన్నారు. దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వాతంత్ర్యానికి ముందే డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించి దేశభక్తి, ఐక్యత భావాలను ప్రజల్లో పెంపొందించేందుకు కృషి చేశారని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ దేశభక్తి, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. అలాగే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, 2047 నాటికి భారతదేశాన్ని వికసిత భారత్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ప్రతి పౌరుడు దేశాభివృద్ధి కోసం తన వంతు బాధ్యతగా కృషి చేయాలని, ముఖ్యంగా యువత దేశ నిర్మాణంలో ముందుండాలని పిలుపునిచ్చారు. మహిళలు విద్య, సామాజిక సేవ, నాయకత్వ రంగాల్లో మరింత ముందుకు రావాలని సూచించారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ సేవికా సమితికి చెందిన విద్యార్థినులు దండ విన్యాసాలు, క్రమశిక్షణా ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. అలాగే కార్యక్రమం సందర్భంగా కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి లాటరీ డ్రా ద్వారా విద్యార్థులు, మహిళలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అభివృద్ధిలో గోమారాన్ని అగ్రభాగంలో నిలుపుదాం

- నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజు రెడ్డి



**శివ్వంపేట, మార్చి 6 (జనంసాక్షి) :** అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా గోమారాన్ని అగ్రభాగంలో నిలుపుదామని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. శివంపేట మండల పరిధిలోని గోమారం గ్రామంలో 30 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్డు పనులను శుక్రవారం నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుమ్మరి హైమావతి ఆంజనేయులు, ఉప సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, మాజీ సర్పంచ్ లావణ్య మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్, శివంపేట పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, మాణిక్యం, ప్రభాకర్ రెడ్డి, వెంకటేశం సీతారాంరెడ్డి, సుధీర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డితోనే సాధ్యం

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు భూమిపూజ



**బొంరాస్‌పేట, మార్చి 6 (జనం సాక్షి) :** గ్రామాల అభివృద్ధి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ తో కలిసి జానకంపల్లి, మహంతిపూర్,ఏర్పుమల్ల తదితర గ్రామాల్లో సిసి రోడ్డు,పాఠశాల ప్రహరీ గోడ,నూతన మంచినీటి వాటర్ ట్యాంకు నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎన్నడు జరగని విధంగా నేడు అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి,జయకృష్ణ,వెంకట్ రాములు గౌడ్,అంజిల్ రెడ్డి,మల్లేష్, మల్లికార్జున్,దేశ్య నాయక్,ఆయా గ్రామాల సర్పంచులు బందెయ్య,వెంకటయ్య,పంచాయతీ కార్యదర్శులు నరేష్,రమేష్ రాథోడ్,సంపత్ కుమార్ రెడ్డి,యువ నాయకులు సంతోష్ నాయక్,ప్రవీణ్,మహిపాల్,మహిపాల్ రెడ్డి,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## మత్తుతో జీవితాలు చిత్తు

- దురాలవాట్లకు దూరంగా ఉండాలి
- కోట్‌పల్లి మండల కేంద్రంలో పాల్గొన్న అధికారులు

**కోట్‌పల్లి, మార్చి 6 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఆదేశాలు మరియు డీజీపీ తెలంగాణ పోలీస్ గారి మార్గదర్శకత్వంలో, అలాగే ఈగల్ ఫోర్స్ తెలంగాణ ఆధ్వర్యంలో మరియు స్నేహ మెహ్రా ఐపీఎస్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వికారాబాద్ జిల్లా ఆదేశాల మేరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కోట్ పల్లి మండలంలో డ్రగ్స్ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమాలు "పిల్లల భద్రత – డ్రగ్స్ కు అడ్డుకట్ట" అనే అంశంపై నిర్వహించబడినవి. కోట పల్లి మండలంలోని కోట్ పల్లి, ఎన్నారం, బర్వాడ్, మోత్కుపల్లి గ్రామాల పాఠశాల ప్రాంగణాలలో విద్యార్థులు మరియు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ..... యువత మరియు విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలు మరియు సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో మత్తు పదార్థాల



(నార్కోటిక్స్)కు సంబంధించిన ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే ఆంటీ నార్కోటిక్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు సమాచారం ఇవ్వాలని, లేదా 8712671111 వాట్సాప్ నెంబర్ కు వివరాలు పంపాలని సూచించారు. సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడుతుందని, వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్య – నార్కోటిక్ డీఎస్పీ, కోట్ పల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎం. శైలజ , సిబ్బంది, మండల స్థాయి అధికారులు తాసిల్దార్ కె. శ్రీనివాస్, ఎంపీడీవో హేమంత్ , ఎంఈఓ చంద్రప్ప , ఎంపీఓ సురేందర్ రెడ్డి , డా. మేఘనా, ఎంఏఓ ,కరుణాకర్ రెడ్డి , వైస్ ప్రెసిడెంట్ స్వప్న , విద్యార్థులు మరియు మండల ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులు విక్రయించాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**హత్నూర, మార్చి 6 (జనం సాక్షి) :** రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, పురుగు మందులను మాత్రమే విక్రయించాలని జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. మండలంలోని కాసాల 12వ వార్డులో గల పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ చేసిన మందులు,ఎరువులు,విత్తనాలతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన ధరల పట్టికను పరిశీలించారు. నాసిరకం ఉత్పత్తులను అమ్మడం ద్వారా పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతారని వారు చెప్పారు.

# ఏలికట్ట గ్రామ అభివృద్దే లక్ష్యం

- ఎనిమిదవ వార్డులో సిసి రోడ్డు పనుల ప్రారంభం

**ఫరూఖ్‌నగర్, మార్చి 6 (జనం సాక్షి) :** గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ప్రజలందరి సహకారంతో ముందుకు సాగుతున్నామని సర్పంచ్ బుడ్డ నవ కిరణి నరసింహ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎనిమిదవ వార్డులో సర్పంచ్ బుడ్డ నవకిరని నరసింహ ముదిరాజ్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీశైలం ముదిరాజ్ తో కలిసి నూతన రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు పూజలు నిర్వహించి, రోడ్డు అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేయడమే మా లక్ష్యం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని అన్నారు. ప్రతి వార్డులోనూ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఎనిమిదవ వార్డు ప్రజల సహకారంతో ఈ రోడ్డు పనులను విజయవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి తేజస్విని, డిప్యూటీ సర్పంచ్ అభినవ్, మరియు వార్డు సభ్యులు పురుగుల




సురేష్, మంగలి శ్రీశైలం, గడ్డ మీది శ్రీను, బక్క సులోచన, పిట్టల కళమ్మ, అరుణమ్మ, గోనెల రాము, గుల్లే ప్రమీల, మహిళా సంఘం నాయకురాలు వడ్ల సుమిత్ర మరియు గ్రామ పెద్దలు ఆర్ల యాదయ్య, సాకలి చంద్రయ్య, చౌడపురం భీమయ్య, బాలరత్నం గౌడ్, గుల్లే కృష్ణయ్య, ముత్యాల రాములు,యూసప్, లింగం గౌడ్, అంబటి అంజయ్య , వడ్డే యాదయ్య, వడ్డే నర్సింలు, పిట్టల బోనయ్య, మందువాద నరేష్ , బక్క కార్తీక్ రెడ్డి మరియు గ్రామ యువకులు మంగలి నరసింహ, బుడ్డ సురేష్, అమర్నాథ్ రెడ్డి, సీమ లింగం, విశాల్ రెడ్డి, కావాలి నరేష్, గుంటి సాయి, గడ్డ మీది నవీన్, ఖదీర్, బాలు యాదవ్, శ్రీకాంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**రేవల్లి, మార్చి 6 (జనంసాక్షి) :** అంతర్జాతీయ మహిళల దినోత్సవం వారోత్సవాలలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామం, పాతతాండ గ్రామ పంచాయతీకి చెందిన గిరిజన మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మహిళల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ వారి జీవిత లక్ష్యాలను సాధించాలని కోరారు. ప్రతి మహిళ మహిళా హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకొని సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని పొందాలని సూచించారు. అదేవిధంగా గృహహింస చట్టం, వరకట్న నిషేధ చట్టం, గర్భాధారణకు ముందు, ప్రసవానికి ముందు లింగ నిర్ధారణను నిరోధించే చట్టం, పోక్సో ఆక్ట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, రేవల్లి మండల ఎస్సై రజిత, పారా లీగల్ వాలంటీర్ రవీందర్ పాల్గొన్నారు.

## పేదవారి సొంతింటి కల నెలవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం



**శామీర్‌పేట్, మార్చి 6 (జనం సాక్షి) :** మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కేశవరం గ్రామంలో నిర్మితమైన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, ఎంసీపల్లి మున్సిపల్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింహులు యాదవ్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేద కుటుంబాల గృహ కలను నిజం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తోంది. ఈ పథకం లక్షలాది కుటుంబాలకు ఆశ, ఆత్మవిశ్వాసం, భద్రత ఇచ్చింది అని ఇక ముందు కూడా మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రెష్ యాదవ్ కృషితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చెపడతామని అన్నారు. ఈ కార్య క్రమంలో స్థానిక కౌన్సిలర్ మల్లేష్ యాదవ్, ఇంది రమ్మ కమిటీ మెంబర్లు రామస్వామి, మున్సిపల్ మైనారిటీ అధ్యక్షులు మహమ్మద్ యూసుఫ్, స్థానిక నాయకులు వెంకటేష్, ఈశ్వర్, ఏలూరి కొమరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## తారా కళాశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ప్రారంభోత్సవం

**సంగారెడ్డి టౌన్, మార్చి 6 (జనం సాక్షి) :** తార ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న "ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక" ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రవీణ ప్రారంభించారు. ప్రత్యేకంగా విద్యాశాఖ అభివృద్ధికై ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమములో భాగంగా 10 రోజుల అభివృద్ధి ప్రణాళిక ను ఏర్పాటు, ఈ పది రోజుల్లో చేపట్టి చేపట్టవలసిన అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందము ఎన్ఎస్ఎస్ అధికారులు ఎన్సిసి అధికారి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాల నిరోధక పై విద్యార్థులకు అవగాహన సదస్సు



**కాప్రా, మార్చి 6 (జనం సాక్షి) :** కాప్రాలోని విజయ హైస్కూల్ కాప్రా శుక్రవారం మాదక ద్రవ్యాల నిరోధక చర్యలు అనే అంశంపైన విద్యార్థులకు అవగాహన సదస్సును పాఠశాల కరెస్పాండెంట్ కొప్పునూరు రాజేశ్వర్ సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కుషాయిగూడ క్రైమ్ విభాగానికి చెందిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకటేశ్వర్లు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సుధాకర్ రెడ్డిలు హాజరై, 9,10వ తరగతుల విద్యార్థులనుద్దేశించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అనగా మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించే పదార్థాలు. మాదక ద్రవ్యాల వాడకం ఒక ప్రమాదమైన వ్యసనం .ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనది. ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాల కన్నా తీవ్రమైన ప్రభావకాలు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం 5.6 శాతం జనాభా అనగా 185 మిలియన్ల మంది ఇలా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు దీని ద్వారా యువతరంపై తీవ్ర ప్రభావం చూపి వినాశనానికి దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. వీటికి దూరంగా ఉండి యువత చదువుకుని నవ సమాజ నిర్మాణ అభివృద్ధికి కృషి చేయాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీమతి కొప్పునూరు వీణ,ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి అద్దంకి పద్మావతి,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తర్బూజా పంట సాగుతో రైతులకు నష్టాలు

- ఖరీదైన పెట్టుబడులు పెట్టినా ఆర్థికంగా నష్టం
- కాయ సైజు పెరగక లాభం రాని వైనం
- గణనీయంగా తగ్గుతున్న ధరలు

**ధారూర్, మార్చి 6 (జనం సాక్షి) :** వేసవికాలంలో రంజాన్,గుడ్ ఫ్రైడే.ఒక్కపొద్దు పర్వదినాల సమయంలో లాభాలు వస్తాయని భారీ పెట్టుబడులు పెట్టి,రాత్రి,పగలు అనక కష్టపడి సాగు చేస్తున్న తర్బూజా పంట సాగు దిగుబడులు లేక భారీ నష్టాలను రైతులకు తెచ్చిపెట్టిందని మండలంలో తర్బూజ పంట సాగు చేసే రైతులు ఆందోళన చెందుతున్నారు.మార్కెట్లో మంచి పేరున్న భారీ లాభాలు వస్తాయని విత్తనం కంపెనీ వారు చెప్పిన మాటలు విని ఖరీదైన విత్తనం సాగు చేసి భారీ పెట్టుబడులు పెట్టి పంట సాగు చేస్తే,ఒక్కొక దంటుకు ఒకటి.రొండు చొప్పున మామూలు చిన్నసైజు కాత కాసీ తీవ్ర నిరాశకు గురి చేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.మార్కెట్లో తర్బూజ పంటకు మంచి ధర పలుకుతున్నదిగుబడి గణనీయంగా తగ్గిపోయి తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తీవ్ర నిరాశ చెందుతున్నారు.తేడాది ఎకరంనర పొలంలో సాధారణ తర్బూజా విత్తనం నాటి సుమారు 30 టన్నుల తర్బూజా పంటను విక్రయించగా,ఈ సారి అదే ఎకరంనర పొలం సాగు చేసినప్పటికీ సగం దిగుబడి కూడా రాలేదని రైతులు దిగులు చెందుతున్నారు.ఈసారి పంట 10 నుండి15 టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదని చెబుతున్నారు.వాతావరణ మార్పులు,వైరస్ ప్రభావం,పంటపై వచ్చే రోగాల నుంచి కాపాడుకునేందుకు ఖరీదైన మందులను పిచికారి చేయాల్సి వస్తుందని తర్బూజా కాయలు సరిగా పెరగడం లేదని రైతులు అంటున్నారు.పైగా ప్రస్తుతం పూత కాయల నాణ్యత తగ్గడంతో కొంత పంట మార్కెట్ కు పనికిరాకుండా పోతుందని ప్రస్తుతం టన్నుకు రూ.10,000 నుంచి వాటిల్లిందని రైతులు పెట్టుబడులు పెరిగి,ఆదాయం తగ్గిపోవడంతో తిరిగి సాగు చేయాలన్నా ఆర్థిక పరిస్థితి



అనుకూలంగా లేదని రూ.15,000 వరకు ధర ఉన్నప్పటికీ,దిగుబడి తక్కువగా ఉండటంతో లక్షల రూపాయల నష్టం వస్తుందని ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం చేస్తే రైతులు పంటలను పండిచడానికి ముందుకు వస్తారని రైతులు అంటున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
07 మార్చి 2026

# అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

- పూరి ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను గుర్తించి నివేదిక ఇవ్వండి
- వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య
- మంగపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన

**సంగారెడ్డి, మార్చి 6 (జనం సాక్షి) :** అర్హులైన లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. శుక్రవారం హత్నూర మండలం మంగపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మండలంలోని ప్రతి గ్రామంలో పూరి ఇళ్లలో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో మంజూరైన ఇండ్ల సంఖ్య, నిర్మాణ



దశలు, లబ్ధిదారుల ఖాతాల్లో నిధుల జమ వంటి అంశాలపై పై ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లకు ఫోటో కాప్చరింగ్ వెంటనే పంపాలని ఆదేశించారు. అలాగే స్లాబ్ పనులు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు ఏప్రిల్ 20-26 వరకు నిర్వహించే సంక్షేమ మహోత్సవాల సందర్భంగా గృహప్రవేశ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులు తమ స్వంత ఇళ్లలో నివసించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిర్మాణంలో వున్న ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని , ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

### వేసవిలో తాగునీటి కొరత లేకుండా జాగ్రత్తలు..

వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నీటి వనరులను పరిశీలించి అవసరమైన చోట్ల బోర్లు మరమ్మతులు చేయడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కల్పించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తుగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు.

### రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచండి..

రైతులకు సరిపడా ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హత్నూర మండలం కసాల గ్రామంలోని డీసీఎంఎస్ ఎఫ్ఎస్‌సీ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలను పరిశీలించారు. విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లుబుక్స్, స్టాక్ బోర్డు వివరాలను తనిఖీ చేసి అధికారులను పలు విషయాలపై ప్రశ్నించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరిపడా నిల్వలో ఉంచాలని, ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి చలపతి రావు, సర్పంచ్ మన్నే రాధా రమేష్, తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయితీ సెక్రటరీ, ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల బలోపేతానికి మహిళా సమైక్య భవనాలు

- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



**కొల్చారం, మార్చి 6 (జనం సాక్షి) :** మహిళా సంఘాల బలోపేతానికి ప్రతి గ్రామంలో మహిళా సమైక్య భవనాలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యేవాకిటి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నాడు మండల పరిధిలోని సంగాయిపేట పైతర యనగండ్ల గ్రామాలలో పర్యటించి మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి కొరకు మహిళలకు తక్కువ వడ్డీకి డ్వాక్రా రుణాలు అందజేయడం జరుగుతుందన్నారు. డ్వాక్రా మహిళలు ప్రతినెల సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి ప్రతి గ్రామంలో 10 లక్షల రూపాయలతో మహిళా సమైక్య భవనాల నిర్మాణం చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు యాబన్నగారి రవితేజ రెడ్డి, సర్పంచులు పుర్రె కాంతమ్మ ఊశయ్య, కోరబోయిన లక్ష్మి పెంటయ్య, ఉప సర్పంచ్ గోపాల్ గౌడ్, ఎంపీడీవో రఫిక్ ఉన్నీసా, బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు రాంపల్లి గౌరీ శంకర్ గుప్తా, మండలయువత విభాగం అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, నాయకులు పాశం శ్రీనివాస్ రెడ్డి,ముత్యంగారి సంతోష్ కుమార్, వెంకట్రాంరెడ్డి, అరిగే రమేష్ కుమార్, భాను ప్రకాష్ రెడ్డి,సురేష్ గౌడ్, ధనరాజ్, వివిధ గ్రామాల నాయకులు మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపకూడదు



**అల్లాదుర్గం, మార్చి 6 (జనంసాక్షి) :** వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకుండా ఎవరు వాహనాలు నడప కూడదని అల్లాదుర్గం ఎస్సై శంకర్ అన్నారు. శుక్రవారం అల్లాదుర్ ఎక్స్ రోడ్ వద్ద వాహన తనిఖీ నిర్వహించారు, ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు లేని 8 వాహనాలను చలాన్ వేసి సీజ్ చేయడం జరిగినది, తాగి నడిపిన వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి చలానా వేయడం జరిగినదని ఎస్సై తెలిపారు , తర్వాత వారిని కోర్టులో ప్రొడ్యూ చేయడం జరుగుతుందన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా ఎవరు కూడా వాహనాన్ని నడపకూడదని వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలియజేశారు.

# నంగునూరు మండల రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

- ఒక్క నీటి బొట్టు తరలించిన ఆందోళన చేపడతాం
- సిద్దిపేట జిల్లా ఇరిగేషన్ అధికారికి వినపత్రం
- మండల టిఆర్ఎస్ నాయకులు

**నంగునూరు, మార్చి 6 (జనం సాక్షి) :** కాలేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా నిర్మించిన రంగనాయక సాగర్ కుడి కాలువ ఎల్ డి 10 నుండి కమలాయపల్లి శివారు వద్ద డి3 కెనాల్ కు అనుసంధానం చేసేందుకు ఎంపీ చమల కిరణ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి చెప్పడం జరిగింది. అక్రమంగా అనుసంధానం చేయడం వాళ్ల సిద్దిపేట నియోజకవర్గం లోని గ్రామాల రైతులకు నంగునూరు మండలంలోని రైతుల పంట పొలాలకు సాగునీరు అందక పంటలు వేసిన రైతులు నష్టపోతారని తక్షణమే రంగనాయక సాగర్ కుడికాలువ నిర్మించకుండా తగు చర్యలు తీసుకోవాలని నంగునూరు మండల గ్రామాల రైతులను ఆదుకోవాలని శు



క్రవారం రోజు సిద్దిపేట జిల్లా ఇరిగేషన్ అధికారికి నంగునూర్ మండల బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం మండల బి ఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు లింగం గౌడ్, సీనియర్ నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, కోల రమేష్ గౌడ్ లు మాట్లాడుతూ కమలాయిపల్లి గ్రామ శివారులొ గల రైతులు రంగనాయక సార్ కుడికాలు ఎల్ డి 10 కాల్వను నిర్మించడానికి పూర్తిగా వ్యతిరేకించారు .గతంలో మా గ్రామ శివారులో తపస్సుపల్లి డీ 3 కాలువ లోభాగంగా మా భూమిని నష్టపోయామని గతంలో తపస్పల్లి రిజర్వాయర్ నుండి డి3 కాల్వ కింద కమలాయిపల్లి, అర్జున్ పట్ల, ఆకునూరు, లింగాపూర్ జాలపల్లి ,దులిమిట్ట గ్రామాల పరిధిలో కుమారుల 7వేల ఎకరాల ఆయకట్టు క్రింద సేకరించబడింది. కాబట్టి ఆ గ్రామ రైతులు రంగనాయక సాగర్ కుడి కాలువ ఎల్.డి 10 కాలువను పూర్తిగా వ్యతిరేకంచారు. అప్పటి పరిస్థితుల్లో పైప్ లైన్ వేయడం వేయడం జరిగింది. కానీ ఇప్పుడు డి 3 కాల్వకు ఓటి అనుసంధానం చేయాలని దౌర్జన్యంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రయత్నం చేస్తా ఉండు , ఈ ఓటి నిర్మాణ పనులు విరమించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ఎస్ నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను వేధించిన ఇద్దరు ఆకతాయిలను అరెస్టు చేసిన జిల్లా షీ టీమ్



**నాగర్ కర్నూల్, మార్చి 6 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ బస్టాండ్ ఆవరణలో మహిళలను వేధిస్తున్నారని సమాచారంతో జిల్లా షీ టీం సభ్యులు ఎస్సై రజిత, ఏఎస్ఐ విజయలక్ష్మి మఫ్టీ లో వెళ్లి బస్టాండ్ ఆవరణలో నిఘా పెట్టి మహిళలను వేధిస్తున్న ఇద్దరు నిందితులను గుర్తించి పోలీస్ స్టేషన్ తరలించారు. మహిళల భద్రతపై జిల్లా షీ టీం నిరంతరంగా పనిచేస్తుందని మరోసారి రుజువైంది. నాగర్‌కర్నూల్ షీ టీం ప్రతి వేధింపు ఫిర్యాదును తీవ్రంగా తీసుకుంటుందని, మహిళల భద్రత కోసం ఇలాంటి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని, షిటీమ్ టీమ్ 24/7 నిరంతరం అలర్ట్‌గా ఉంటుందని, మహిళలు ఎవరైనా వేధింపులు, సతాయింపులకు గురైతే భయపడకుండా వెంటనే జిల్లా షీ టీం నంబర్ 8712657676, డయల్ 100 ను సంప్రదించాలని ఎస్సై రజిత తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేద ప్రజల కళ్ళల్లో ఆనందం

- సిడిసి చైర్మన్ గడీల రాంరెడ్డి

**సదాశివపేట, మార్చి 6 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇళ్లతో పేద ప్రజల కళ్ళల్లో ఆనందం, ముఖంలో చిరునవ్వు చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధి వెంకటాపూర్, వెల్టూరు గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురు చేస్తున్న నిరుపేద కుటుంబాలకు నేడు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలతో వారి సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారని అన్నారు. గత 10 సంవత్సరాలలో ఇల్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు అనుభవించారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి 5 లక్షల రూపాయల ఖర్చుతో సొంతింటి కల సహకారం చేస్తుందని సిడిసి చైర్మన్ గడిల రామ్ రెడ్డి తెలిపారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి ల సహకారంతో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ



మండల అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, ఓగ్గు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, పిఎసిఎస్ మాజీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు,మాజీ సర్పంచులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, గ్రామపంచాయతీ కార్యదర్శి లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెయింట్ పీటర్స్ పాఠశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు

**సంగారెడ్డి టౌన్, మార్చి 6 (జనం సాక్షి) :** సంగారెడ్డిలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నేటి కాలంలో చాలాచోట్ల అగ్ని ప్రమాదాలు జరుగుతుండడం గమనిస్తున్నాము. గ్యాస్ సిలిండర్ విషయంలో, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి సంగారెడ్డి పట్టణంలోని అగ్నిమాపక శాఖ అధికారి భిక్షపతి తగిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. చక్కని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీ నాగిరెడ్డి, యాదగిరి, యాదయ్య, రవి, రత్నం,



ఇక్బాల్, శ్రీకాంత్ గౌడ్, ప్రధాన ఉపాధ్యాయులు శ్రీ రవి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రామచంద్రపురంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**రామచంద్రాపురం, మార్చి 6 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎం.ఐ.జి కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి హాజరై మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకోవాలని, విద్య, ఉపాధి మరియు సామాజిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాణి యాదవ్, విజయ, స్వర్ణ జ్యోతి, లత, విజయలక్ష్మి, అరుణ జ్యోతి, సునీత, రాధ, గాయత్రి, తార, చైతన్య తదితరులు పాల్గొన్నారు. కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక

**హత్నూర, మార్చి 6 (జనం సాక్షి) :** ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. కార్యక్రమంలో భాగంగా హత్నూర మండలంలోని మంగాపూర్ గ్రామాన్ని శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. దశలవారీగా బిల్లులు సకాలంలో అందుతున్నాయా అంటూ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మంచినీటి కొరత, అంతర్గత సిసి రోడ్లు,డ్రైనేజీ సమస్య ఉందని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్,సర్పంచి కృష్ణవేణి, వార్డు సభ్యులు నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.



# అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడేషన్ కార్డు అందేలా కృషి చేస్తాం

**మహబూబ్‌నగర్ బ్యూరో అర్బన్, మార్చి 6 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా టీయుడబ్ల్యుజే (ఐజేయు) పనిచేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన యూనియన్ కీలక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

### అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులు

క్షేత్రస్థాయిలో ఎండనక, వాననక కష్టపడుతూ వార్తలు సేకరించే ప్రతి ప్రొఫెషనల్ జర్నలిస్టుకు ప్రభుత్వం నుండి అక్రిడేషన్ కార్డు అందేలా యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని విరహత్ అలీ భరోసా ఇచ్చారు. అక్రిడేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక, ఇతర అడ్డంకులను తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు.

### డెస్క్ జర్నలిస్టులు ఆందోళన చెందవద్దు

డెస్క్ జర్నలిస్టుల అక్రిడేషన్ల విషయంలో సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని ఆయన కోరారు. డెస్క్ మీద పనిచేసే వారికి కూడా న్యాయం జరిగేలా నిబంధనల్లో అవసరమైన మార్పులు చేసేందుకు యూనియన్ శ్రమిస్తోందని వివరించారు. ఈ సందర్భంగా డెస్క్ జర్నలిస్టులు తమ సమస్యలపై విరహత్ అలీకి వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత యూనియన్ తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

### సంక్షేమమే మా ప్రాధాన్యత

దశాబ్దాల పోరాట చరిత్ర కలిగిన టీయుడబ్ల్యుజే (ఐజేయు), జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక విజయాలను సాధించిందని ఆయన గుర్తు చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలోని జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, వారి పిల్లల చదువుల విషయంలో యూనియన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. స్థానిక సమస్యలను



ఎప్పటికప్పుడు పరిష్కరించేలా జిల్లా శాఖ సమన్వయంతో పనిచేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యుజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా కన్వీనర్ అహ్మద్ పాషా, మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు కాటం నాగరాజు గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి మరియు యూనియన్ సభ్యులు, పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

- విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



**జనగామ ప్రతినిధి, మార్చి 6 (జనంసాక్షి)** : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల పరిసరాలు పరిశుభ్రం గా ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఉపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని బచ్చన్నపేట మండల కేంద్ర పరిధిలో గల కేజీబీవీ పాఠశాలను లిజిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూలి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కిచెన్‌ను సందర్శించి.. కూరగాయలు తాజాగా ఉన్నాయా లేదా అని, వంట సరుకుల నాణ్యతను, గుడ్లను నీటిలో వేసి వాటి నాణ్యతను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పాఠశాలను ప్రతి రోజూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు గురించి ఎస్ఓను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. ఉదయం అల్పాహారం ఏం పెట్టారు? ఎలా ఉంది? అని ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకి పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ గీత, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి లక్ష్యంగా పాలకమండలి పని చేయాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- ఘనంగా నూతన పాలకమండలి బాధ్యతల స్వీకరణ



**పరకాల, మార్చి 6 (జనం సాక్షి):** పరకాల పట్టణ అభివృద్ధి లక్ష్యంగా, ప్రజల ఆశయాల కనుగుణంగా నూతన పాలక మండలి పనిచేయాలని పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పరకాల పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలోమున్సిపాలిటీ నూతన పాలక మండలి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాతో కౌన్సిలర్లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలక మండలి పని చేయాలి అన్నారు. పరకాల పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు మున్సిపాలిటీ పాలక మండలి కృషి చేయాలని కోరారు. పరకాల పట్టణ అభివృద్ధికి నూతన కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పాలక మండలికి పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆరోగ్యానికి పోలీసు క్రీడలు అవసరం

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- భూపాలపల్లిలో పోలీసు క్రీడలు ప్రారంభం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** నిత్యం విధుల్లో ఉండే పోలీసుల ఆరోగ్యానికి పోలీసు క్రీడలు అవసరమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో శుక్రవారం జిల్లా స్థాయి నాలుగవ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రారంభించారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ స్పోర్ట్స్ మీట్‌లో సుమారు 194 మంది పోలీస్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల కోసం ట్రాక్ ఈవెంట్స్‌తో పాటు క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ సిబ్బందిలో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం, ఐక్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అనంతరం ఎస్పీ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. అలాగే ఎస్పీ, అడిషనల్ ఎస్పీ కలిసి ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం కింద జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల యువతతో 13 జట్లను తీసుకొని వారికి వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25 శాతం పెనాల్టీ 12 శాతం వడ్డీని ఎత్తివేయాలి



- కేసులు పెడుతారనే భయంతో ఆత్మహత్య చేసుకున్న తనుకు స్వప్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్

**ములుగు బ్యూరో, మార్చి6 (జనం సాక్షి):** డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై విధించిన 25% పెనాల్టీతోపాటు 12 శాతం వడ్డీని ప్రభుత్వం ఎత్తివేయాలని రైస్ మిల్లర్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ అన్నారు. డిఫాల్ట్ లిస్టులో ఉన్న నేపథ్యంలో సివిల్ సప్లై అధికారులు కేసులు పెడతారని భయంతో కరీంనగర్ జిల్లా కేశవపట్నం బాలాజీ ఇండస్ట్రీస్ యజమాని తనుకు సురేష్ భార్య తనుకు స్వప్న శుక్రవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బాదం ప్రవీణ్ వెంటనే కరీంనగర్ చేరుకొని స్వప్న మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్వప్న ఆత్మహత్యకు గల గల కారణాలను కుటుంబ సభ్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ డిఫాల్ట్ లిస్టు లో తమ రైస్ మిల్లు ఉన్న నేపథ్యంలో సివిల్ సప్లై అధికారులు,ప్రభుత్వం తమపై కేసులు పెడతారని భయంతో స్వప్న ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం బాధాకరమని అన్నారు. స్వప్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆయన సందర్భంగా భగవంతుని వేడుకున్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చినట్టుగానే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటున్న రైస్ మిల్లర్ వ్యవస్థపై ప్రభుత్వం పెద్ద మనసు చేసుకొని డిఫాల్ట్ మిల్లర్లపై విధించిన 25% పెనాల్టీతోపాటు 12 శాతం వడ్డీని ఎత్తివేయాలని ఆయన కోరారు. ఉరిశిక్ష పడిన ఖైదీకి సైతం క్షమాభిక్షపెడుతున్న ప్రజాస్వామ్య పాలనలో ఉన్నామని,ఎన్నో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించిన నక్సలైట్లకు పునరావాసం పేరుతో కోట్లాది రూపాయలు ఇస్తున్నటువంటి ప్రభుత్వం రైతులకు ప్రభుత్వానికి వారిదిగా ఉండే మిల్లర్లపై ఇంత కఠిన వైఖరిని ప్రదర్శిస్తుంది ఇప్పటికైనా డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షులు గోనెల రవీందర్,కార్యదర్శి సత్యనారాయణ, ములుగు జిల్లా రైస్ మిల్లర్లు రామిని శ్రవణ్ కుమార్, శ్రీరాములు పాల్గొన్నారు.

# స్థానిక సమస్యల పరిష్కారానికి 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'

- వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్
- చీపుర్లు చేతబూని కార్యాలయ ఆవరణలో శుభ్రత కార్యక్రమం



**వరంగల్ బ్యూరో, మార్చి 06 (జనం సాక్షి) :** స్థానిక సమస్యల పరిష్కారానికి 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మేయర్ కలెక్టర్‌లు లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించి, చీపుర్లు చేతబట్టి కార్యాలయ ఆవరణలో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శానిటేషన్ ప్రతిజ్ఞలో ప్రజాప్రతినిధులు కలెక్టర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం వరంగల్ (పశ్చిమ)శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం ఈనెల 6 నుండి జూన్ 12 వరకు 99 రోజులపాటు ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేశారని, కార్పొరేషన్ ఆధ్వర్యం లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మేయర్ కలెక్టర్‌లతో కలిసి ప్రారంభించామని, మన పట్టణాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత అని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త డబ్బాల్లో వేసి స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని అన్నారు. నగర మేయర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ఒక్కోరోజు ఒక్కో కార్యక్రమాన్ని చేపట్టి విజయవంతంగా నిర్వహించాలని ఆదేశాలున్నాయని ప్రధానంగా శానిటేషన్‌కు వారం రోజుల పాటు కార్యక్రమాలను కేటాయించారని, దీనితో పాటు నీటి సరఫరా తో పాటు మహిళా దినోత్సవ కార్యక్రమ నిర్వహణను కూడా షెడ్యూల్‌లో చేర్చారని, ప్రజల భాగస్వామ్యంతో ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందని భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని, అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలు సమన్వయంతో కలిసి పని చేసినపుడు అనుకున్న స్థాయిలో విజయవంతం అవుతాయని తెలిపారు. హనుమకొండ జిల్లా కలెక్టర్/బల్దియా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఇందులో భాగం గా పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు వివిధ సమస్యలను పరిష్కారం చేసి ఫైల్ పెండెన్స్ క్లియర్ చేయాలని ఇందులో కేవలం మున్సిపాలిటీ కాకుండా రూరల్ అడ్మినిస్ట్రేషన్ లు ముఖ్య భూమిక పోషిస్తాయని, ప్రతి విభాగానికి ఒక వారం కేటాయించి అందులో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని, పిహెచ్‌సి స్థాయిలో స్పెషలిస్ట్ డాక్టర్‌లతో హెల్త్ క్యాంప్ ల ఏర్పాటు, రైతు వేదికల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, జీడబ్ల్యూఎంసి పరిధిలో దాదాపు 90 శాతం ప్రాజెక్ట్ లు ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయని, ఉర్సు, భద్రకాళి వడ్డేపల్లి బండ్ లలో పనులు కొనసాగుతున్నాయని, వాటిని ప్రారంభించేలా చూస్తామని వాహన షెడ్డులో ఫిల్టర్ బెడ్లలో పేరుకు పోయిన స్క్రాప్ ను క్లియర్ చేసి, ఆ పరిసరాలను పరిశుభ్రంగా తయారు చేయాలని సూచించారు. నగరంలో జంక్షన్లు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, గ్రాండ్ ఎంట్రెన్స్ లను స్మార్ట్ సిటీ లో ప్లాన్ చేశామని నగరం లో ఎంట్రీ అయ్యేక్రమం లో ఒక గ్రాండ్ లుక్ ఉంటుందని తెలిపారు. డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, అకౌంట్స్ అధికారి శివ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, బిర్రు శ్రీనివాస్, ఏం హెచ్ ఓ డా.రాజేష్, హెచ్ ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వ యంతో విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, డ్రైనేజీలు, కాలనీలు, ఇళ్ల పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో విద్యుత్ సౌకర్యాలు, డ్రైనేజీ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, మిడిల్ పోల్స్ అవసరం వంటి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# ఎక్సైజ్ కాలనీలో చైన్‌స్నాచింగ్

**హనుమకొండ ప్రతినిధి మార్చి 6 (జనం సాక్షి) :** హన్మకొండ నగరం లోని ఎక్సైజ్ కాలనీలో శుక్రవారంఉదయం ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా మహిళ మెడలోని బంగారు చెయిన్ లాక్కెళ్లిన దుండగులు. మహిళ నవ్య దుండగున్ని ఆపే ప్రయత్నం చేయగా, బైక్ పై పరారయ్యారు. వెంటనే బాధితురాలు మామిళ్ల నవ్య సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మామిళ్ల నవ్య ఫిర్యాదు మేరకు దుండగుల కోసం గాలిస్తున్న సుబేదారి పోలీసులు, పోలీస్ బృందాలు దర్యాప్తు చేపట్టాయి. దొంగల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో

# అందరూ భాగస్వామ్యం కావాలి

- స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్, కలెక్టర్...



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 6 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమం లో భాగంగా రాష్ట్ర శుక్రవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, బల్దియా మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు ఇంచార్జ్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొన్నారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలిసి స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను రూపొందించిందన్నారు. పట్టణాలు, గ్రామాలు సమానంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మౌలిక వసతుల కల్పన, పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, శానిటేషన్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాలనీలు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలని, ప్రతి పౌరుడు కూడా పరిశుభ్రతను కాపాడటంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించేందుకు అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వచ్చే 99 రోజులలో పట్టణాభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి అంశాల్లో స్పష్టమైన మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.




# పారిశుధ్యంపై విప్లవాత్మకంగా ముందుకు సాగాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 06(జనంసాక్షి):** పారిశుద్ధ్యం పై విప్లవాత్మకంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి చెత్తను సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయాల పరిసరాలలో పరిశుభ్రతను పాటించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. ప్లాస్టిక్ విరుదల వల్లే పారిశుధ్యం లోపించడమే కాకుండా పర్యావరణంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ఎక్కడైనా చెత్త కనిపిస్తే దానిని తీసి డస్ట్ బిన్ లో వేయాలని సూచించారు. ఎవరైనా చెత్తను రోడ్డుపై వేస్తే దానిని తీసి డస్ట్ బిన్ లో వేయాలని గాంధీజీ సూత్రాన్ని పాటించాలని పేర్కొన్నారు. ప్రజలు బాధ్యతగా తీసుకొని చెత్తను రోడ్డుపై వేయకుండా మున్సిపల్, గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త సేకరణ వాహనాలలో వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో దత్తరావు, ఆర్డీవో లోకేశ్వరరావు, డిడబ్ల్యుఓ భాస్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిడి రమాదేవి, హార్టికల్చర్ అధికారిన నదీమ్, వెటర్నరీ అధికారి సురేష్, మత్స్య శాఖ అధికారి సాంబశివరావు, తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవోపేతంగా శ్రీ నాగులమ్మ పగిడిద్దరాజుల మహోత్సవం

- భక్తులు కిక్కిరిసిపోవడంతో జనసంద్రోహంగా మారిన రాజుపేట కేంద్రం
- లోక కళ్యాణం కొరకు అగ్నిగుండంలో నడిచిన రామకృష్ణ స్వామీజీ...
- నాగులమ్మ తల్లిని దర్శించుకున్న కుంజా సూర్య రామ్





**మంగపేట మార్చి 06(జనంసాక్షి) :** మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామ పంచాయితీ పరిధిలోని లక్ష్మి నర్సాపూర్ గ్రామంలో కొలువైన శ్రీ నాగులమ్మ ఆలయంలో మహా జాతర ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన గురువారం ఉదయం నుండి ప్రత్యేక పూజ నిర్వహించి రాత్రి 11 గంటల 45 నిమిషాల సమయంలో ఆలయ ధర్మకర్త, ప్రధాన పూజారి బాడిషా రామకృష్ణ స్వామీజీ శ్రీ నాగులమ్మ, పగిడిద్దరాజుల దివ్య కళ్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణార్థం ప్రజలందరూ సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ నాగులమ్మ ఆలయ ధర్మకర్త, ప్రధాన పూజారి బాడిషా రామకృష్ణ స్వామీజీ అగ్నిగుండంలో నడిచారు. శ్రీ నాగులమ్మ పగిడిద్దరాజుల కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడం కొరకు భక్తులు వివిధ రాష్ట్రాలైన చత్తీస్గడ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి సుదూర ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో తరలిరావడంతో రాజపేట పరిసర ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకొని పూర్తిగా భక్తులతో కిక్కిరిసిపోయింది. అలాగే ఆలయ పరిసర ప్రాంతంలో సంస్కృతిక, ఫోక్ డాన్స్ లతో కళాకారులు భక్తులను అలరింపజేశారు. శ్రీ నాగులమ్మ మహా జాతర ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు శుక్రవారం అమ్మవార్లను వేలాది సంఖ్యలో తరలివచ్చి దర్శించుకొని మొక్కలు చెల్లించుకున్నారు. మహా జాతర నిర్వహణలో చివరి రోజైన శనివారం అమ్మవార్ల వన ప్రవేశం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్త, ప్రధాన పూజారి బాడిషా రామకృష్ణ స్వామీజీ, నాగరమేష్‌లు తెలిపారు.

### శ్రీ నాగులమ్మ తల్లిని దర్శించుకున్న కుంజా సూర్య రామ్

మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామపంచాయితీ పరిధిలోని లక్ష్మి నర్సాపూర్ గ్రామంలో కొలువైన శ్రీ నాగులమ్మ తల్లిని గురువారం రాత్రి 10 గంటల సమయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క కుమారుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య రామ్ శ్రీ నాగులమ్మ తల్లిని దర్శించుకొని శ్రీ నాగులమ్మ, పగడిద్దరాజుల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

### పటిష్ట బందోబస్తు నిర్వహించిన పోలీసులు

శ్రీ నాగులమ్మ మహా జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్, స్థానిక ఎస్సై తిరునగిరి వెంకట రంగయ్య సూరి, ఏటూరు నాగారం ఎస్సైలు ఆర్. మహేష్, శ్రీకాంత్, నరేష్ లతో పాటు సుమారు 50 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

# జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి

- అధికారులంతా ప్రజలతో మమేకం కావాలి
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలి
- 99 రోజుల కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలి
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 6 (జనం సాక్షి) :** జిల్లా అభివృద్ధి సమిష్టి గా కృషి చేయాలని అధికారులంతా ప్రజలతో మమేకం కావాలని జిల్లా ఇంచార్జీ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. 99 రోజుల కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ లోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పై ఉమ్మడి మెదక్ జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణలో ఉమ్మడి మెదక్ జిల్లాను మొదటి స్థానంలో ఉండేలా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రజలతో మమేకమై వారితో కలిసి పనిచేసి నప్పుడే సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అవకాశం ఉందని సీఎం భావించి ఈ కార్యక్రమంను తీసుకొచ్చారు దీన్ని అమలుచ్చేసే భాద్యత అధికారులదే అన్నారు. వేసవికాలంలో త్రాగునీరు సమస్యరాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని అవసరమైన ప్రాంతాలలో బోర్ల రిపేర్లు, ప్రత్యామ్నాయ తాగునీరు సరఫరాకు ప్రతిపదనలు పంపాలన్నారు. అసెంబ్లీలో చర్చించి త్రాగునీరు సమస్య రాకుండా కావలసిన తాత్కాలిక పనుల కోసం అనుమతులు తీసుకుంటాను అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రాణాలిక కార్యక్రమంలో భాగంగా 10 థీమ్స్ లలో రూపొందించిన కార్యక్రమాలను ఆయా శాఖల ద్వారా పకడ్బందీగా నిర్వహించాలని వాటితో పాటు 99 రోజుల ప్రణాళికను అన్ని శాఖలచే నిర్వహించాలని సూచించారు. నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫెడ్ వారు నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ప్రారంభించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానన్నారు. రెసిడెంటిల్ స్కూల్లలో త్రాగునీరు సమస్య తలెత్తకుండా చూడాలని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకునేలా వారిని మానిటర్ చెయ్యాలన్నారు. గుమ్మడిదలలో ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సోలార్ విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించే సూర్య ఘర్ యోజన పథకం పై రివ్యూ చెయ్యాలన్నారు. ఏటిసిలు త్వరగా నిర్మాణం అయ్యేలా టిజీఐఐసి చర్యలు తీసుకోవలని సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో 6 గ్యారంటీలు ప్రజలకు పూర్తిగా అందేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులచే గృహప్రవేశాలు చేయించాలని అన్నారు. మన దేశ అవసరాలకు మించి వరి పంట దేశంలో పండుతుందని రైతులు లబ్ధి పొందేలా 30% పంట మార్పిడి చేయించాలన్నారు. అధిక ఆదాయాన్ని సమకూర్చే ఆయిల్ ఫామ్ తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. విద్యా, వైద్యం చాలా ముఖ్యమని పేద ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్య సేవలాందించాలన్నారు. రేషన్ కార్డ్స్, డిజిటల్ హెల్త్ కార్డ్స్ అర్హత ఉన్న పేదలందరికీ అందేలా చూడాలన్నారు. ముందుగా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, సిద్దిపేట జిల్లా కలెక్టర్, హైమావతి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన మంత్రి కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు, ,మెదక్ అదనపు కలెక్టర్లు నగేష్ ,మాధురి ,అబ్దుల్ హామీద్ ,మెదక్ మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నూతనకల్‌లోని తొమ్మిది గ్రామాల భూములు రీ-సర్వే



**నూతనకల్, మార్చి 6 (జనంసాక్షి) :** నూతనకల్ మండలంలోని తొమ్మిది గ్రామాలలో భూముల రీ-సర్వే నిర్వహించేందుకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహసిల్దార్ శ్రీనివాసరావు పాత్రికేయుల సమావేశంలో తెలిపారు ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం గుండ్లసింగారం, యడవెల్లి, నూతనకల్, పెదనేమిల, దర్శనపల్లి,ఎర్రపహాడ్, మాచనపల్లి, చిల్పకుంట్ల, మిర్యాల గ్రామాలలో అన్ని రకాల భూములను తిరిగి సర్వే చేసి రికార్డులను సరిచేయనున్నట్లు చెప్పారు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఐఏఎస్ ఆదేశాల మేరకు సర్వేకు సంబంధించిన నోటిఫికేషన్ 6(1) ను సంబంధిత గ్రామాల్లో,మండలంలోని ముఖ్య ప్రదేశాల్లో ప్రదర్శించినట్లు ఆయన పేర్కొన్నారు త్వరలోనే రీ--సర్వే పనులు ప్రారంభమవుతాయని, దీనికి ముందు గ్రామసభలు నిర్వహించి రైతులు, ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయనున్నట్లు తెలిపారు ఈ రీ--సర్వే ద్వారా ప్రభుత్వ భూములను సంరక్షించడంతో పాటు భూములపై తలెత్తే వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని వారు తెలిపారు రైతులు, ప్రజలు సర్వే ప్రక్రియకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆసన్ అలీ, రెవెన్యూ సిబ్బంది, జిపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ, మార్చి 6 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా ప్రభుత్వం – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రణాళిక లో అన్ని అన్నికార్యక్రమాలను పూర్తి చేయాలని స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం నాడు మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలు లతో కలిసిప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం ఈ 99 రోజులు సరైన ప్రణాళికలతో మిర్యాలగూడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు సిద్ధంగా ఉండాలని కౌన్సిలర్లు , మున్సిపల్ సిబ్బందిని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కౌన్సిలర్లు, విభాగాల మున్సిపల్ పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 6 (జనంసాక్షి) :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా పని చేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. శుక్రవారం బాలెంల గ్రామపంచాయతీ కార్యాలయంలో 99 రోజుల కార్యక్రమం అమలు పై నిర్వహించిన సన్నాహక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నూతనంగా గెలిచిన స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజలలో మంచి పేరు సుస్థిరం చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని అన్నారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు జరిగే ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ లో స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. పెండింగ్ ఫైల్స్ క్లియర్, త్రాగునీరు, విద్యా, వైద్యంపై వచ్చిన దరఖాస్తులు పది రోజులలో క్లియర్ చేయాలని అన్నారు. 99 రోజుల కార్యక్రమంలో చివరి వరకు ప్రజా ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొనాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేయాలని సూచించారు. పేద ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బాలెంల గ్రామంలో ప్రజలతో కలెక్టర్ ముచ్చటించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిచెన్ షెడ్డు, స్టోర్ రూమ్, వంటశాల, కంప్యూటర్ రూమ్ ల్యాబ్ పరిశీలించారు, స్కూలుకు సంబంధించిన బిల్లులు ఆన్ లైన్ లో ఎలా చేస్తారని అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ మంచి మార్కులు తెచ్చుకోవాలని, ప్రతి సబ్జెక్టులో నూటికి 70 శాతం మార్కులు రావాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లల భోజన వసతులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, ఆర్డీఓ వేణు మాధవరావు, తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీఓ లింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గండ్రవాణి గూడెం పంచాయతీ భవన పనులు షురూ..

- జనం సాక్షి వార్తకు స్పందన



**మాడుగులపల్లి, మార్చి 6 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న జనం సాక్షి పత్రిక మరోసారి తన ప్రభావాన్ని చాటుకుంది. నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం గండ్రవాణి గూడెం గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవంపై ఇటీవల ప్రచురితమైన కథనం అధికారుల్లో, కాంట్రాక్టర్‌లో చలనం తెచ్చింది.

### వార్త రాగానే రంగంలోకి యంత్రాంగం

గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం పూర్తయినా, చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉండటం వల్ల ప్రారంభోత్సవానికి నోచుకోకుండా నిరుపయోగంగా ఉన్న వైనాన్ని జనం సాక్షి ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చింది. ఈ వార్తపై తక్షణమే స్పందించిన ఉన్నతాధికారులు మండల స్థాయి అధికారులను కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

### యుద్ధ ప్రాతిపదికన పనులు

అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్ వెంటనే స్పందించి, శుక్రవారం నుండే పెండింగ్‌లో ఉన్న ఫినిషింగ్ పనులు విద్యుత్ సౌకర్యాల ఏర్పాటును తక్షణమే ప్రారంభించారు. భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేసేలా పనులు వేగవంతం చేశారు.

### గ్రామస్తుల హర్షం

తమ గ్రామానికి సొంత పంచాయతీ భవనం అందుబాటులోకి వచ్చేలా వార్తను ప్రచురించిన జనం సాక్షి పత్రికకు వెంటనే స్పందించి పనులు మొదలుపెట్టిన అధికారులకు గండ్రవాణి గూడెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. వార్త ప్రభావంతో పనులు మొదలవ్వడం సంతోషకరం.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**తుంగతుర్తి, మార్చి 6 (జనం సాక్షి) :** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తుంగతుర్తి ఎస్సై క్రాంతి కుమార్ విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి పరీక్షల సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం కోసం జిల్లా ఎస్పీ నర్సింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో నీ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినిలకు లక్ష్యాలు సాధించడం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పాఠ్యాంశాలను పునశ్చరణ చేయాలని అన్నారు. క్రమశిక్షణతో చదివితే తప్పకుండా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆందోళన చెందకుండా ఒత్తిడికి గురవకుండా మనసుపెట్టి చదవాలని అన్నారు. తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ చదువుపై దృష్టి పెట్టేలా చేయాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావడం సాధ్యమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు శు భాకాంక్షలు తెలిపి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి చదువుకున్న పాఠశాలకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్



**కనగల్లు (నల్లగొండ) మార్చి 6 (జనం సాక్షి) :** అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయంగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాల ప్రగతిని ముందుకు తీసుకుపోవాలని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని లైన్ వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదవారికి మెరుగైన వైద్య సేవలను అందించాల నే ఉద్దేశంతోనే మార్చి 6 నుంచి 31 వరకు జిల్లాలోని అన్ని పట్టణ, మండల ఆరోగ్య కేంద్రాల లో ఆరు రకాల వైద్య సేవలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య సేవల శిబిరాలకు నిపుణులైన డాక్టర్లను పిలిపించడం జరుగుతుందని, వైద్య సేవలలో డెంటల్, ఓ బి జి, ఆర్థోపెడిక్, ఆప్తమాలజిస్ట్, పీడియాట్రిషన్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్లచే వైద్యం అందించడమే కాకుండా, మందులను కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. వైద్య సేవలకు వచ్చే రోగుల పేర్లు ఆన్లైన్లో నమోదు అయిన వెంటనే వారికి ఒక ఐడి నెంబర్ వస్తుందని ఈ ఐడి నెంబర్ ద్వారా భవిష్యత్తులో కూడా ఉచిత వైద్య సేవలను పొందే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. ప్రతిరోజు ఇద్దరూ లేరా ముగ్గురు స్పెషలిస్ట్ డాక్టర్లు మూడు పీహెచ్సీ ఆసుపత్రులలో హాజరై రోగులకు వైద్యం అందజేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ పి శ్రీనివాస్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ నర్సింగారావు, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డి పి ఆర్ ఓ వెంకటేశ్వర్లు, లైన్ వాడ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఖాజా సమీయుద్దీన్, లైన్ వాడ ఆసుపత్రి డాక్టర్ ఈఫ్టేయర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## మండలంలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

**ఉర్కొండ, మార్చి 6 (జనం సాక్షి) :** ఉర్కొండ మండల కేంద్రంలో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయినా సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఊరుకొండ గ్రామంలో ఎస్సి కులం పేరుతో దూషించిన మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాసులు తండ్రి పేరు అంజయ్య అను వ్యక్తిపై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణదేవ తెలిపారు.. ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, వార్డు సభ్యుడు అయిన పోలె గణేష్ తండ్రి పేరు అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు పై ఈ కేసు నమోదు చేశామని, గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇందిరమ్మ గృహాలకు సంబంధించి 5మంది పేర్లను పంచాయతీ కార్యదర్శి కి ఇచ్చినందుకు మీరు ఎవరు అంటూ సర్పంచ్ భర్త మ్యాకల శ్రీనివాసులు అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషించినట్లు ఫిర్యాదులో చేశారు. దీనిపై కల్వకుర్తి డిఎస్పీ దర్యాప్తు చేయనున్నారనీ ఎస్సై కృష్ణదేవ తెలిపారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- 99 రోజుల కార్యాచరణతో ముందుకు సాగాలి
- కార్యక్రమ 10 థీమ్స్ బాగున్నాయి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**మహబూబ్‌నగర్ బ్యూరో మార్చి 6 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు అధికారులు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి/ఉమ్మడి పాలమూరు జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న 99 రోజుల కార్యక్రమంలో సూచించిన 10 థీమ్స్ చాలా బాగున్నాయని మంత్రి కితాబునిచ్చారు. 99 రోజుల కార్యక్రమాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలనీ ఆయన సూచించారు. గ్రామ సభల్లో తాగునీటి సమస్య ను ప్రజలు ప్రస్తావించే అవకాశం ఉందని, తాగునీటి సమస్యను ముందస్తుగా పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా సమీకృత భవన సముదాయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు పై జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. మూడో విడత నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12 న జరిగే ప్రజా ప్రతినిధుల శిక్షణ చాలా ముఖ్యం అన్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉండొద్దని చెప్పారు. ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం అని మంత్రి పేర్కొన్నారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ప్రచార పోస్టర్ లు, టీ షర్ట్ లను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, కలెక్టర్ల తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ బదావత్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, నారాయణపేట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, , మహబూబ్‌నగర్ మేయర్ గుమాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లు మల్లు నర్సింహ్మారెడ్డి, వార్ల విజయకుమార్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ఆయా జిల్లాల ఆర్డీవోలు,మున్సిపల్ కమిషనర్‌లు డి ఆర్ డి ఓ లు, డిపివోలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి




**చండూరు, మార్చి 06 (జనంసాక్షి) :** చండూరు మున్సిపాలిటీ పరిధిలో 6వ వార్డు, 3వ వార్డు మరియు 9 వార్డులలో నీటి సమస్య ఉన్నందున వేసవి కాలములో ప్రజలకు నీటి సమస్య రాకుండా కొత్త బోరులు వేయించడం జరిగింది. అందులో భాగంగా శుక్రవారం నాడు కొత్త బోర్లను ప్రజలకు అందుబాటులో తీసుకురావడం జరిగింది. ఇట్టి కార్యక్రమములో చండూరు మున్సిపాలిటీ చైర్ పర్సన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్ పర్సన్ భూతరాజు దశరథ, మున్సిపల్ కమీషనర్ ఎల్. మల్లేశం, కౌన్సిల్ సభ్యులు శ్రీమతి తేలుకుంట్ల రాజకుమారి, బుషిపాక వాసు, సామ సుజాత, జెల్ల ధనమ్మ, కోన్రెడ్డి మధు, కోడి సుష్మ వెంకన్న, కలిమికొండ పారిజాత, కటకం రమేష్, కల్లెట్ల మారయ్య, పాల్గొన్నారు.




# అమెజాన్‌లో మళ్లీ లేఆఫ్‌లు

**వాషింగ్టన్:**ఇ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో ఉద్యోగుల లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. తాజాగా తన రోబోటిక్స్ విభాగంలో ఉద్యోగాల కోతలు చేపట్టింది. అమెజాన్ గోదాముల నెట్‌వర్క్‌ను నడిపించే ఆటోమేషన్ వ్యవస్థలను డిజైన్ చేసి, నిర్మించే పనులను రోబోటిక్స్ విభాగం నిర్వహిస్తుంది. కనీసం 100 మంది వైట్–కాలర్ ఉద్యోగులపై తాజా కోతల ప్రభావం పడిందని వార్తా సంస్థ 'రాయిటర్స్' వెల్లడించింది. తాజా లేఆఫ్‌ల నిర్ణయం చాలా కష్టమైనదని, కానీ అనివార్యమని అమెజాన్ రోబోటిక్స్ ఉపాధ్యక్షుడు స్కాట్ డ్రెసర్ పేర్కొన్నారు. కంపెనీకి రోబోటిక్స్ 'వ్యూహాత్మక ప్రాధాన్యత'గా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. తక్కువ సంఖ్యలో ఉద్యోగులను తొలగించినట్లు అమెజాన్ ప్రతినిధి ధ్రువీకరించారు. తొలగించిన ఉద్యోగులకు సెవెరెన్స్ పే, ఆరోగ్య బీమా, ఉద్యోగ నియామక మద్దతు అందుతాయని తెలిపారు. కొవిడ్ సమయంలో అధిక నియామకాల వల్ల కంపెనీ ఉద్యోగుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో వ్యయాల నియంత్రణలో భాగంగా తాజా కోతలను అమెజాన్ చేపట్టింది. 2022 చివరి నుంచి ఇప్పటివరకు కంపెనీ 57,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించింది. గతేడాది అక్టోబరులో 14,000 మందిని, ఈ ఏడాది జనవరిలో 16,000 మంది ఉద్యోగులను సంస్థ లేఆఫ్ చేసింది. 2012లో వేర్‌హౌస్ ఆటోమేషన్ సంస్థ కివా సిస్టమ్స్‌ను కొనుగోలు చేసిన తర్వాత, అమెజాన్ లాజిస్టిక్స్ కార్యకలాపాల్లో రోబోటిక్స్ విభాగం కీలక పాత్ర పోషిస్తోంది. గత జులైకి అమెజాన్ నెట్‌వర్క్‌లో 10 లక్షల కంటే ఎక్కువ రోబోలు ఉన్నాయి. గత అక్టోబరులో మల్టీ–ఆర్మ్‌డ్ రోబో బ్లూ జేను తీసుకొచ్చిన సంస్థ, ఆరు నెలల్లోపే దాన్ని నిలిపివేసింది. ప్రస్తుతం ఆర్బిటల్ అనే మాడ్యులర్ వేర్‌హౌస్ వ్యవస్థకు మారుతోంది. మోర్గాన్ స్టాన్లీలో 2,500 మంది తొలగింపు: ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ, తన మొత్తం ఉద్యోగుల్లో 3% (2,500 మంది) ఉద్యోగులను తొలగించింది. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, ట్రేడింగ్, వెల్త్ మేనేజ్‌మెంట్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఈ కోతలు ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫైనాన్షియల్ అడ్వైజర్లపై ప్రభావం పడలేదు. 2025లో బ్యాంక్ వార్షిక ఆదాయం రికార్డు గరిష్ఠానికి చేరింది. నాలుగో త్రైమాసిక లాభాలు కూడా వాల్‌స్ట్రీట్ అంచనాలను మించాయి. 2026ను ఆశాజనకంగా ప్రారంభించిన సంస్థ, ఏఐ అంతరాయాలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. తాజా ఉద్యోగ కోతలు వ్యూహం, వ్యక్తిగత పనితీరు ఆధారంగా జరిగాయని, ఇతర విభాగాల్లో నియామకాలు చేపట్టాలని బ్యాంక్ యోచిస్తోందని సమాచారం. డిసెంబరు చివరకు మోర్గాన్ స్టాన్లీ ఉద్యోగుల సంఖ్య 92,992గా ఉంది.



# బేర్ మళ్లీ వచ్చింది

## భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్‌లు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో లాభాలు చవిచూసిన సూచీలు.. ఒక్కరోజు తిరగక ముందే మళ్లీ బేర్ గుప్పిట్లోకి వెళ్లాయి. సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 24,500 మార్కు దిగువన ముగిసింది. ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధం మున్ముందు మరింత తీవ్ర రూపం దాలుస్తుందన్న భయాలు సూచీలను పడేశాయి. 'అసలు కథ ఇప్పుడే మొదలైందంటూ' అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యలు దీనికి ఆజ్యం పోశాయి. సెన్సెక్స్ ఉదయం 79,658.99 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,015.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఆరంభంలో ఓ మోస్తరు నష్టాల్లో కొనసాగిన సూచీ.. ఆఖర్లో మరింత అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో ఇంట్రాడేలో 78,812.18 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1097 పాయింట్ల నష్టంతో 78,918.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 315.45 పాయింట్ల నష్టంతో 24,450.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం 91.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, రిలయన్స్, సన్‌ఫార్మా, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ స్టాక్స్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 86.98 డాలర్ల వద్ద కొనసాగుతుండగా..



బంగారం ఔన్సు 5082 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.


**కారణాలు ఇవీ..**

ఇరాన్, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధం ఇప్పుడే ముగిసే సూచనలు కనిపించడం లేదు. అసలు యుద్ధం ఇప్పుడే మొదలైందంటూ అమెరికా రక్షణ మంత్రి పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇరాన్‌పై యుద్ధం విషయంలో టైమ్ లిమిట్ అంటూ ఏమీ పెట్టుకోలేదని వ్యాఖ్యానించడం యుద్ధం దీర్ఘకాలం కొనసాగొచ్చన్న అంచనాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తలతో చమురు ధరలు గరిష్ఠ స్థాయి వద్ద కొనసాగుతుండడం కూడా దిగుమతులపై ఆధారపడే మన దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్న భయాలు నెలకొన్నాయి. ద్రవ్యోల్బణం, వృద్ధిపై భయాలు నెలకొన్నాయి. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో రూ.3762 కోట్ల విలువైన షేర్లు విక్రయించినట్లు ఎన్ఎస్ఈ డేటా చెబుతోంది. ఒక్క మార్చి నెల్లో రూ.21,436 కోట్ల విలువైన షేర్లను ఎఫ్ఐఐలు విక్రయించడమూ ప్రతికూల ప్రభావం చూపింది.

# పసిడి ఆభరణాల స్వచ్ఛత..

## 380 జిల్లాలకు హాల్‌మార్కింగ్

బంగారం ధర బాగా పెరిగిన నేపథ్యంలో, పసిడి ఆభరణాల స్వచ్ఛతపై పారదర్శకత పెంచడం ద్వారా, కొనుగోలుదార్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పసిడి ఆభరణాలకు తప్పనిసరి హాల్‌మార్కింగ్ నిబంధనల అమలును 380 జిల్లాలకు పొడిగించింది. ఈ నిబంధనల అమలును దశలవారీగా 2021లో ప్రభుత్వం ప్రారంభించింది. దశలవారీగా ప్రస్తుతం విస్తరిస్తూ వచ్చింది. ఇప్పుడు 380 జిల్లాలకు విస్తరించడంతో చిన్న, ప్రాంతీయ మార్కెట్లను కూడా తప్పనిసరి హాల్‌మార్కింగ్ పరిధిలోకి తెచ్చినట్లయ్యింది.





ప్రస్తుతం దేశంలో 800 వరకు జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రకారం చూస్తే.. ఇంకా ఈ నిబంధనల వర్తింపునకు దూరంగా సుమారు 400 జిల్లాలు ఉన్నాయన్నమాట. మోసాలకు అడ్డుకట్ట...: హాల్‌మార్కింగ్ ఆఫ్ గోల్డ్ జువెలరీ అండ్ గోల్డ్ ఆర్టేఫ్యాక్ట్స్ (సవరణ) ఆదేశాలు–2026 ప్రకారం.. తప్పనిసరి హాల్‌మార్కింగ్ పరిధిని 380 జిల్లాలకు పెంచుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పసిడి వినియోగం అధికంగా ఉండే తెలంగాణలో 13, ఆంధ్రప్రదేశ్‌లో 18 జిల్లాలు సహా ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లోని రెండో అంచె, మూడో అంచె జిల్లాలను కూడా హాల్‌మార్క్ తప్పనిసరి పరిధిలోకి తీసుకొచ్చారు. పెద్ద నగరాలతో పోలిస్తే చిన్న, ప్రాంతీయ విపణుల్లో కొనుగోలుదార్లకు పసిడి స్వచ్ఛతపై అవగాహన తక్కువగా ఉంటోంది. అక్కడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయడం వల్ల, చెల్లించిన నగదుకు తగ్గట్లు స్వచ్ఛమైన బంగారాన్ని కొనుగోలు చేయగలుగుతారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి ఆభరణంపై ఉండే ప్రత్యేక గుర్తింపు సంఖ్య సాయంతో, కొనుగోలుదార్లు బంగారం స్వచ్ఛతను తెలుసుకోగలుగుతారు. మోసాలు తగ్గుతాయి.

# అనిల్ అంబానీ రిలయన్స్ పవర్‌పై ఈడీ దాడులు

ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీ రిలయన్స్ పవర్‌కు సంబంధించి ముంబయి, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా 15 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా అనిల్ ఫిబ్రవరి 27న ఈడీ విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే ఆయన గైర్హాజరైన నేపథ్యంలో ఈ సోదాలు జరిగాయి. అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు రూ.వేల కోట్ల విలువైన బ్యాంకు రుణ మోసానికి పాల్పడ్డాయనే ఆరోపణలపై ఆయనపై ఈడీ కేసు నమోదైంది. వీటి మొత్తం విలువ రూ.40వేల కోట్లుగా పేర్కొంది.






# ట్రంప్ మాటను కుర్దులు నమ్మేనా?


**న్యూఢిల్లీ:**ఇరాన్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుర్దులు కలిసి రావాలని అందుకు ఆయుధాలను సరఫరా చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. అయితే కుర్దులకు అంత బలగముందా? సుశిక్షితమైన ఇరాన్ బలగాలను ఎదుర్కోగలరా? అమెరికా మాటలను వారు వినే అవకాశముందా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**కుర్దులంటే ఎవరు?**

పశ్చిమాసియాలో ఈ తెగ ఎక్కువ. ఇస్లాం మతానికి చెందిన వీరు ఇరాన్, ఇరాక్, సిరియా, తుర్కియే దేశాల్లో విస్తరించి ఉన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయం లోనే ప్రత్యేక దేశం 'కుర్దిస్థాన్' ఏర్పాటు చేయాలని ఉద్యమించినా ఫలితం లేకుండా పోయింది. మొత్తంగా వీరి సంఖ్య దాదాపు 3 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇరాన్ జనాభాలోనే దాదాపు పదిశాతం కన్నా ఎక్కువగా అంటే.. దాదాపు కోటి వరకు ఉంటారని అంచనాలున్నాయి. ఇరాన్‌లో దాదాపు అర శతాబ్దానికిపైగా తిరుగుబాటు చేస్తున్న చరిత్ర వీరిది. పైన పేర్కొన్న నాలుగు దేశాల్లోనూ వీరిపై అనేక అరాచకాలు జరిగినట్టు అంతర్జాతీయ సంస్థల నివేదికలు చెబుతున్నాయి.

**అమెరికాను నమ్మొచ్చా?**

సిరియాలో అసద్ ప్రభుత్వంపై వీరోచితంగా పోరాడిన చరిత్ర వీరిది. అయితే, తుర్కియేలోనూ వీరి జనాభా ఎక్కువగా ఉండటంతో అక్కడి ఎర్డోగాన్ ప్రభుత్వం పలు కఠిన చర్యలు తీసుకుంది. తుర్కియే నాటోలో సభ్యదేశం కావడంతో గతంలో అమెరికా ఈ దళాలకు ఆయుధాలు అందించడం మానేసింది. కొంతకాలం కిందట సిరియాలో అధికారంలోకి వచ్చిన అహ్మద్ అల్ షరా ప్రభుత్వం..




స్థానికంగా ఉన్న పలు కుర్దు ప్రాంతాలను ఆక్రమించిన అమెరికా పెద్దగా పట్టించుకోలేదు. కొన్నేళ్ల క్రితం సిరియా, ఇరాక్‌లలో అనేక దారుణాలకు ఒడిగట్టిన ఐసిస్‌ను తొలిసారిగా నిలువరించింది కుర్దులే కావడం విశేషం. 1975లో వీరిపై ఇరాకీ దళాలు దాడులకు పాల్పడితే నాటి అమెరికా అధ్యక్షుడు ఫోర్డ్ వీరిని రక్షించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 1988లో వీరిపై సద్దాం ప్రభుత్వం రసాయన ఆయుధాలతో జరిపిన దాడిని అప్పటి అధ్యక్షుడు రీగన్ పెద్దగా పట్టించుకోలేదు. 1990లో వీరి తిరుగుబాటుకు ఆనాటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ బుష్ మద్దతు ఇచ్చారు. సద్దాం సేనలు వీరిని ఇనుపపాదంతో అణచివేసినప్పుడు మాత్రం మౌనంగా ఉండిపోయారు. గతంలో కొన్ని చేదు అనుభవాలు ఎదురైనప్పటికీ.. కుర్దులు మళ్ళీ అమెరికా మాటలను విశ్వసిస్తున్నారు. అయితే వీరున్న నాలుగు దేశాల్లోనూ ఆయా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మద్దతు ఇవ్వాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది. అప్పటికే ఆరు కుర్దు సాయుధ బృందాలు అమెరికాకు మద్దతుగా ఇరాన్ ఐఆర్‌జీసీతో సాయుధ పోరుకు సిద్ధమయ్యాయి. నాటోలో కీలకమైన తుర్కియే మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. కుర్దులు బలవంతమైతే తమ దేశంలోని కుర్దులు కూడా వేర్పాటువాదులతో చేయి కలుపుతారన్న ఆందోళన వ్యక్తం చేస్తోంది.

**ఫలితాలనిస్తుందా?**

కుర్దుల దాడులు, తిరుగుబాటు పెద్దగా పనిచేయక పోవచ్చనే చెప్పవచ్చు. ఎందుకంటే ఇరాన్‌లో మెజార్టీ వర్గం వీరికి మద్దతు పలకకపోవడమే ఇందుకు కారణం. కేవలం వీరున్న ప్రాంతాల్లోనే కొంత పురోగతి ఉండవచ్చు. అయినా ఐఆర్‌జీసీ, బాసిజ్ దళాలను ఎదుర్కోవడం వీరికి కష్టసాధ్యం. కుర్దు దళాలు గెరిల్లా యుద్ధంలో సిద్ధహస్తులు. ముఖాముఖి పోరుకు అత్యున్నత సైనిక శిక్షణ ఎంతో అవసరం. ఇలాంటి పరిస్థితుల్లో కుర్దుల మద్దతు ఏ మేరకు ప్రభావం చూపుతుందనేది వేచి చూడాల్సిందే. ఇరాన్‌లో ప్రభుత్వ మార్పు కోరుతూ ఆ దేశంలోని ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తే తప్ప.. అమెరికా, ఇజ్రాయెల్ ఆశిస్తున్న విధంగా ఫలితాలు ఉండకపోవచ్చని విశ్లేషకుల అంచనా.

# జనగణన చిహ్నాల ఆవిష్కరణ

**న్యూఢిల్లీ:**కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న 2027 జనాభా లెక్కల సేకరణ ప్రక్రియలో భాగంగా హోంమంత్రి అమిత్ షా గురువారం ప్రగతి, వికాస్ పేరుతో రెండు జనగణన చిహ్నాలను ఆవిష్కరించారు. స్త్రీ, పురుష జనగణకులను ప్రతిబింబించేలా వీటిని రూపొందించారు. "ఈ చిహ్నాలు 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో స్త్రీ, పురుషుల సమాన భాగస్వామ్యానికి ప్రతీకలు. వీటి ద్వారా జనగణన–2027కు సంబంధించిన కీలక లక్ష్యాలను, సమాచారాన్ని సమాజంలోని ప్రతివర్గానికీ చేరవేస్తాం" అని అధికారిక ప్రకటన పేర్కొంది. 2027 జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన సమాచారాన్ని వీటి సాయంతో ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేస్తారు. తొలిసారి డిజిటల్ రూపంలో సేకరించనున్న లెక్కల కోసం సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీడాక్) రూపొందించిన డిజిటల్ సాధనాలను కూడా అమిత్‌షా ఈ సందర్భంగా విడుదల చేశారు. ఉపగ్రహ దృశ్యాల సాయంతో డిజిటల్ మ్యాపింగ్‌కు సహాయపడే హౌస్‌లిస్టింగ్ బ్లాక్ క్రియేటర్ (హెచ్‌ఎల్‌బీసీ)తో పాటు గృహ జాబితా సమాచారాన్ని సేకరించి అప్‌లోడ్ చేసేందుకు ఉపయోగపడే ఆఫ్‌లైన్ మొబైల్ యాప్.. 'హెచ్‌ఎల్‌ఓ'ను హోం మంత్రి ప్రారంభించారు. ప్రజలు తమ వ్యక్తిగత, కుటుంబ సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించేందుకు ఉపయోగపడే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (ఎస్‌ఈ) పోర్టల్‌ను, జనగణనకు సంబంధించిన పరిపాలనా పరమైన పర్యవేక్షణకు సాయపడే సెన్సస్ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టంను కూడా అమిత్‌షా ఆవిష్కరించారు. జనాభా లెక్కల సేకరణలో తొలి దశ అయిన హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్ వచ్చేనెల 1 నుంచి ప్రారంభమవుతుంది.



# వెలుగులోకి మరిన్ని ఎప్‌స్టీన్ ఫైళ్లు..

## ట్రంప్‌పై సంచలన ఆరోపణలు

**న్యూఢిల్లీ:**ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన మరిన్ని ఫైళ్లను అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసింది. వీటిల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆధారాలు ఉన్న పత్రాలు బయటకు వచ్చాయి. తాను మైనర్‌గా ఉన్నప్పుడు ట్రంప్ తనను లైంగికంగా వేధించినట్లు ఓ మహిళ 2019లో ఎఫ్‌బీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించినట్లు తెలుస్తోంది. తాను 13 నుంచి 15 ఏళ్ల మధ్యలో ఉన్న సమయంలో ఎప్‌స్టీన్ తనను ట్రంప్‌నకు పరిచయం చేసినట్లు మహిళ ఆరోపించింది. అనంతరం వారు ఇరువురు తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. ఆ సమయంలో ట్రంప్ తనతో అసభ్యంగా ప్రవర్తించినట్లు వెల్లడించింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ వివాదం మొదలైనప్పటి నుంచి ఆ ఘటనలకు సంబంధించిన వివరాలు బయటకు చెప్పొద్దని తనకు, తన కుటుంబసభ్యులకు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు తెలిపింది. అయితే గతంలో తాము విడుదల చేసిన పలు ఎప్‌స్టీన్ ఫైళ్లలో సదరు మహిళ ట్రంప్‌పై అసత్య ఆరోపణలు చేసినట్లు పలువురు పేర్కొన్నారని న్యాయశాఖ అధికారులు వెల్లడించారు. దీంతో వాటిని పరిశీలనకు పంపామన్నారు. తుది పరిశీలన అనంతరం గురువారం 47వేల పత్రాలు విడుదల చేశామన్నారు. దీంతో ఎప్‌స్టీన్ ఫైళ్లను ట్రంప్ ప్రభుత్వం నిర్వహిస్తోన్న తీరుపై డెమోక్రాట్లు దర్యాప్తు చేపట్టారు. కాగా ఎప్‌స్టీన్ ఫైళ్లతో తనకు ఎలాంటి సంబంధం లేదని గతంలో ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. అయినప్పటికీ ఆయనపై ఆరోపణలు ఉన్న పత్రాలను న్యాయశాఖ మళ్లీ విడుదల చేయడం గమనార్హం.

# యుద్ధం మొదలైనప్పటినుంచి.. 200 మంది చిన్నారులు మృతి

టెహ్రాన్:అమెరికా– ఇజ్రాయెల్, ఇరాన్ దాడులతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. యుద్ధం కారణంగా ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. వారిలో చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధం మొదలైన నాటినుంచి దాదాపు 200 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని తాజాగా యునిసెఫ్ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఇరాన్‌లో 181 మంది మరణించినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో (7), ఇజ్రాయెల్ (3), కువైట్(1)లో మృతి చెందినట్లు తెలిపింది. యుద్ధాలు పిల్లలు ప్రారంభించరు.. కానీ, మూల్యం మాత్రం చెల్లిస్తున్నారు అని వ్యాఖ్యానించింది. పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలు ఇప్పటికే చిన్నారులపై ఆందోళనకర ప్రభావాన్ని చూపిందని పేర్కొంది. ఇదిలాఉండగా.. అమెరికా– ఇజ్రాయెల్ తొలిరోజు ఆపరేషన్‌లో ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న ఓ బాలికల పాఠశాలపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 160 మందికి పైగా విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తెలిపింది. ఈ దాడిపై తాజాగా యూఎస్ దళాలు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు యూఎస్ అధికారులు పేర్కొన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

# 50 జెట్‌లతో.. ఖమేనీ బంకర్‌పై బాంబుల వర్షం!

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల మోత మోగిస్తోంది. శుక్రవారం ఉదయం కూడా భారీ స్థాయిలో దాడులు చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) వెల్లడించింది. సుప్రీం లీడర్ ఖమేనీ నివాస ప్రాంగణంలో నిర్మించిన భూగర్భ బంకర్ లక్ష్యంగా ఈ దాడులు చేశామని తెలిపింది. ఈ ఆపరేషన్‌లో దాదాపు 50 యుద్ధ విమానాలు పాల్గొన్నాయని పేర్కొంది. ఇజ్రాయెల్ గూఢచర్య సంస్థ 'మొస్సాద్' సమన్వయంతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపిన ఐడీఎఫ్.. ఇందుకు సంబంధించిన వీడియో విడుదల చేసింది. సంక్షోభ సమయాల్లో సుప్రీం లీడర్ ఖమేనీని అత్యవసరంగా తరలించేందుకు ఈ బంకర్‌ను నిర్మించారని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఈ సురక్షితమైన స్థావరాన్ని అభివృద్ధి చేసేందుకు వాళ్లకు చాలా ఏళ్లు పట్టిందని తెలిపింది. అయితే, ఈ బంకర్‌ను ఖమేనీ ఎన్నడూ ఉపయోగించలేదని సమాచారం. యుద్ధం మొదటి రోజే ఖమేనీ చనిపోగా.. ప్రస్తుతం కొందరు ఇరాన్ సీనియర్ అధికారులు దాన్ని ఉపయోగించినట్లు ఐడీఎఫ్ అంచనా వేసింది. టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న భూగర్భ బంకర్ అనేక వీధుల్లో విస్తరించి ఉందని, దీనికి అనేక ప్రవేశ ద్వారాలు ఉన్నాయని



ఐడీఎఫ్ పేర్కొంది. సీనియర్ అధికారులు సమావేశమయ్యేందుకు గదులు కూడా ఉన్నాయని తెలిపింది. మరోవైపు ఇరాన్‌లోని 200 లక్ష్యాలపై తమ బాంబర్ ఫోర్స్ దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. భూగర్భ లక్ష్యాలపైనా బంకర్ బస్టర్లను జారవిడిచినట్లు పేర్కొన్న విషయం తెలిసిందే.

## సోషల్ మీడియాలో ఉగ్ర ప్రచారం.. విద్యార్థి అరెస్ట్

ముంబయి: ఉగ్ర సంస్థలతో సంబంధమున్న ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అధికారులు అరెస్ట్ చేశారు. పాక్‌కు చెందిన నిషేధిత ఉగ్ర సంస్థల హ్యాండ్లర్లతో మహారాష్ట్రకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి అయాన్ షేక్ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లలో వారు పంపుతున్న ఉగ్ర సమాచారాన్ని అతడు సోషల్‌మీడియాలో ఇతర విద్యార్థులకు షేర్ చేస్తున్నట్లు వెల్లడించారు. నిందితుడి ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకొని.. ఫోరెన్సిక్ పరీక్షలకు పంపామన్నారు. అయాన్ షేక్‌కు ఉగ్ర హ్యాండ్లర్లతో సంబంధం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని పేర్కొన్నారు.

# ఓ నెల రోజులు రష్యా నుంచి చమురు కొనొచ్చట!

దాదాపు 7 మిలియన్ బారెళ్ల రష్యన్ చమురును మోసుకెళ్లే మరో 8 నౌకలు కూడా సింగపూర్ సముద్రప్రాంతంలో నిలిచిఉన్నాయి. అవికూడా త్వరలో భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలుకు అమెరికా లైసెన్స్ జారీ చేయడానికి ముందే.. భారత ఓడరేవుల వైపు వచ్చే దిశగా రష్యా నౌకలు తమ గమ్యస్థానాలను మార్చినట్లు బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. 2022 నుంచి రష్యా చమురును భారత్ గణనీయంగా దిగుమతి చేసుకుంటుంది. అయితే.. అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఇటీవల ఈ దిగుమతులు తగ్గాయి. ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలోనే రష్యా మళ్లీ ఎగుమతి చేస్తుండడంతో భారత్‌కు చమురు కష్టాలు తొలగిపోయే అవకాశం ఉంది.



# కమనీయం.. రమణీయం స్వామివారి కళ్యాణం

- అంగరంగ వైభవంగా అది దేవుని కల్యాణం
- కన్యాదాతలుగా ఈశ్వర , సురేష్ నాగలక్ష్మి దంపతులు
- కల్యాణానికి వేలాదిగా తరలివచ్చిన శివ పార్వతులు
- మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాల సమర్పణ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 6 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజారాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం అంగరంగ వైభవంగా శివ పార్వతుల కల్యాణమును ఆలయ అర్చకుల వేద మంత్రాల మధ్య నిర్వహించారు.రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగ వున్న శివ పార్వతులు, ట్రాంజెండర్లు, భక్తులు తరలివచ్చారు.పురవీధులన్ని భక్తులతో కిక్కిరిసిన పోయాయి.ఆలయ పార్కింగ్ స్థలంలో ఏర్పాటుచేసిన శివార్చన వేదికను రంగురంగుల పూలతో అలంకరించారు. స్వామి వారి ఎదుర్కోళ్ళు కార్యక్రమములో శివయ్యకు పెద్దలుగా ప్రతాప రామకృష్ణ, ఆలయ అర్చకులు ఉండగా పార్వతి దేవికి ఆలయ ఈవో వ్యవహరించారు.స్వామివారికి కట్న కానుకల కింద రూ కోట్లు యిస్తామని ఈవో ఒప్పుకున్నారు.ఎదుర్కోళ్ళు కార్యక్రమంలో మేళా తలాలతో ఉత్సవ మూర్తులను కల్యాణ వేదిక పైకి చేర్చారు.మున్సిపల్ ఆధ్వర్యంలో కార్యాలయం నుండి ఊరేగింపుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది మేళా తాళాలతో పట్టు వస్త్రాలు,ముత్యాల తలంబ్రాలు,పండ్లను తీసుకు వచ్చి ఆలయ ఈవోకు అందచేశారు. స్వామివారి కళ్యాణం అభిజిత్ లగ్న సుముహూర్తము ఉదయం 10.30 నుండి 12.30 వరకు స్వామి వారి కల్యాణంను ఆలయ అర్చకులు వేద మంత్రాల మధ్య కళ్యాణ తంతు నిర్వహించారు. కన్యాదాతలుగా ఈశ్వర సురేష్ నాగలక్ష్మి దంపతులు వ్యవహరీం చారు.మరో వైపు శ్రీ స్వామి వారి కళ్యాణం జరుగుతుండగా శివ పార్వతులు ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకోని శివుడితో పెళ్లి జరిగినట్లు భావించారు. శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కళ్యాణం తిలకించడానికి రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిగా శివపార్వుతులు, ట్రాజెండర్లు, భక్తులు తరలి వచ్చారు. రాజన్న ఆలయంతో పాటు ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయింది. దాదాపు 2 గంటల పాటు జరిగిన కళ్యాణంను భక్తులు అసక్తిగా తిలకించారు. ప్రధానంగా కళ్యాణం జరిగేటపుడు శివ పార్వతులు చేతిలో త్రిశూలను కదలిస్తూ, ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకుని తమ భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు. కల్యాణ నికి సుమారు 50 వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు.

**కళ్యాణనికి దేవాదాయ శాఖ భారీ ఏర్పాట్లు**

వేములవాడ రాజన్న ఆలయంలో జరిగిన శివ కళ్యాణం వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర సన్నిధిలో శివ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగిందన్నారు. కళ్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారుల సమన్వయంతో ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మొట్ట మొదటిసారిగా గుడి చెరువు ఆవరణలో పార్కింగ్ స్థలంలోని శివకళ్యాణం స్టేజ్ మీద స్వామివారి కళ్యాణం జరిగిందన్నారు.సుమారు 60 వేల మంది పైగా భక్తులు స్వామివారి కళ్యాణంలో పాల్గొన్నార న్నారు.రాజన్న ఆలయాన్ని రూ 150 కోట్లతో అభివృద్ధి చేస్తున్నమని,స్వామి వారి ఆశీస్సులతో లోక కళ్యాణం జరిగి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కళ్యాణ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే పర్యవేక్షణలో డిఎస్పి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ సిఐ వరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ మహేందర్, ఆధ్వర్యంలో బారి బందోబస్తును ఏర్పాటు చేశారు. కళ్యాణ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్, పాలకవర్గము, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, భాజాప రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, పలు పార్టీల నాయకులు, ఆలయ ఏఈవోలు, సిబ్బంది, భక్తులు, ట్రాంజండర్లు పాల్గొన్నారు.

# సమన్వయంతో పని చేస్తే ప్రజలకు మెరుగైన సేవలు

### శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల సమస్యలను సమన్వయంతో పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళిక కార్యక్రమమని తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులకు ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికపై అవగాహన సదస్సు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు నారాయణ రెడ్డి, మను చౌదరి, దీపక్ తివారి, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పని చేయాలని సూచించారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు కేటాయించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు నోడల్ అధికారులను నియమించామని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. హౌసింగ్ ద్వారా ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి చెల్లింపులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ అవగాహన సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, శంకరయ్య, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, వివిధ శాఖల చైర్మన్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కంగ్రాట్యులేషన్స్ వేమన్న

### వేం నరేందర్ రెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసిన సిరాజ్ హుస్సేన్



**కరీంనగర్ బ్యూరో, మార్చ్ 06 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వేం నరేందర్ రెడ్డినీ కరీంనగర్ కాంగ్రెస్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజు హుస్సేన్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైనందున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరేందర్ రెడ్డి నీ శాలువతో సత్కరించారు. అనంతరం సిరాజు హుస్సేన్ మాట్లాడుతూ... వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యుడుగా రాష్ట్రం నుంచి ఎంపిక లాంచనమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నరేందర్ రెడ్డి ని ఎంపిక చేయడం అభినందనీయమని రాబోయే రోజుల్లో మరింతగా రాష్ట్ర అభివృద్ధిలో వేం నరేందర్ రెడ్డి కీలక పాత్ర పోషిస్తారని హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు సాధించడంలో కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి కీలకంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. వేం నరేందర్ రెడ్డి సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి అంతటావే పదవులు లభిస్తాయని ఇందుకు నిదర్శనం వేం నరేందర్ రెడ్డి పనితీరే నని సిరాజు హుస్సేన్ పేర్కొన్నారు. వేం నరేందర్ రెడ్డి రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధిలో మరింత కష్టపడి పనిచేస్తారని రాష్ట్రాన్ని అగ్ర భాగాన నిలిపేందుకు శక్తి యుక్తులు ఉపయోగిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రధాన సలహాదారుడిగా వ్యవహరించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రికి తగిన సలహాలు సూచనలు అందించారని పేర్కొన్నారు.

# మొన్న డీఎస్పీగా.. నేడు ఐఏఎస్‌గా

### సివిల్స్‌లో, గ్రూప్ -1లో సత్తా చాటిన గుడెల్లి సృజన



**మంథని (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూరు / సెంటనరికాలనీ చెందిన పద్మశాలి సింగరేణి ఉద్యోగి కుటుంబం గుడెల్లి రాజేశం-రాణి కూతురు గుడెల్లి సృజన 2025 ఆగస్టులో జరిగిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ) 2025 ఫలితాలలో రాతపరీక్షలో అర్హత సాధించి 2026 ఫిబ్రవరి 27న నిర్వహించిన పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూలు) ఫలితాలలో 958 మంది యోగ్యత పొంది నియామకానికి ఎంపికైన జాబితాలో 55వ ర్యాంక్ సాధించింది. గతంలో గ్రూప్-1 లో 35 ర్యాంకు సాధించి డిఎస్పీగా నియామకమై ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం పక్షాన గుడెల్లి సృజన, వారి కుటుంబ సభ్యులకు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య శుభాకాంక్షలు తెలియజేశారు.

# రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



**కరీంనగర్ బ్యూరో, మార్చి 06 (జనంసాక్షి) :** ఆర్చరీ క్రీడకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన క్రీడని, క్రీడ ద్వారా విద్యార్థులకు జ్ఞాపకశక్తితో పాటు ఏకాగ్రత అభివృద్ధి చెందుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. క్రీడల వలన విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు ఒత్తిడి నుండి ఉపశమనం లభించడం జరుగుతుందని వారు తెలిపారుల. క్రీడల ప్రాముఖ్యత దృష్టిలో పెట్టుకొని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు వివిధ రకాల క్రీడల పోటీలను నిర్వహించడం జరుగుతుందని, వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు సైతం ఎంపిక చేస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తున్నామని చెప్పారు. అసోసియేషన్ వారు నిర్వహించినటువంటి జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలకు చెందినటువంటి డి.సుదీక్ష 9వ తరగతి, కె.లిశిత అక్షయ, 8వ తరగతి, జి.శ్రీహరినాథ్,8వ తరగతి, డి.శ్రి నిత్య , 4వ తరగతి అత్యుత్తమ ప్రతిభను కనబరిచి త్వరలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని వారు చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలను అందజేసి రాష్ట్ర స్థాయిలోనూ అసమాన ప్రతిభను కొనసాగించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల పట్టణ సీఐగా ఎన్.శ్రీనివాస్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 06 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల పట్టణ సీఐగా ఎన్.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కృష్ణ ఐజి ఆఫీస్ మల్టీ జోన్ హైదరాబాద్ కు బదిలీ కాగా కామారెడ్డి జిల్లా నుండి శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. సిరిసిల్ల పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

### శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయంలో

# ఏసిబి ముమ్మర సోదాలు




### బట్టబయలవుతున్న అవినీతి చిట్టా



**శేరిలింగంపల్లి, (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆకస్మిక దాడులతో మొదలుపెట్టి ముమ్మర తనిఖీలను కొనసాగిస్తోంది. అవినీతి నిరోధక శాఖ(ఏసిబి) విభాగం అధికారులు శుక్రవారం ఉదయం వేళలోనే శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయానికి చేరుకొని ప్రధానంగా పట్టణ ప్రణాళిక విభాగం, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం కార్యాలయాలలో సోదాలు నిర్వహిస్తూ పలు కీలక ఆధారాలను సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం దశాబ్దాలుగా అవినీతిలో కూరుకుపోయి ఎన్నో సందర్భాలలో తీవ్ర విమర్శలు, అవినీతి ఆరోపణలు, ఉన్నతాధికారుల మొట్టికాయలు తిన్నప్పటికీ కనీస మార్పు, అధికారులలో చలనం కొరవడడం, దీనికి తోడు ఓవైపు హైడ్రా, మరోవైపు అవినీతి నిరోధక శాఖా అధికారులకు స్థానికులనుండి, పలు స్వచ్ఛంద సంస్థలనుండి, సామాజికవేత్తలనుండి స్పష్టమైన ఆధారాలతో కూడిన ఫిర్యాదులు అందిన దరిమిలా ఇప్పటికే హైడ్రా అనేక సందర్భాలలో శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి అవినీతి తుట్టెను దులుపుతూ వందలు, వేల కోట్ల రూపాయల అక్రమ భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు అనేక అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తుండడంతో శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో పేరుకుపోయిన అవినీతి బాహ్య ప్రపంచానికి ప్రస్తుతం బట్టబయలవుతోంది. ఈ క్రమంలోనే శుక్రవారం ఏసిబి అధికారులుసైతం జిహెచ్ఎంసి కార్యాలయానికి చేరుకోవడంతో శేరిలింగంపల్లి ఒక్కసారిగా విస్తూపోయింది. అనాదిగా శేరిలింగంపల్లిలో చోటు చేసుకున్న అక్రమాల దాష్టీకానికి కాలం పండిపోయి ప్రస్తుతం హైడ్రా రూపంలో, తాజాగా ఏసిబి రూపంలో వెంటాడి అవినీతి మకిలిని కడిగిపారేస్తుందన్న ఆశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తుండడం ఆలోచించాల్సిన విషయం. శుక్రవారం జరిగిన దాడులలో రంగారెడ్డి జిల్లా ఏసిబి విభాగం డిఎస్పి ఆనంద్ కుమార్ తన అధికారులతో కలిసి పాల్గొనడంపట్ల అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయం పట్టణ ప్రణాళిక విభాగం ఏసిపి పై అనేక అవినీతి ఆరోపణలు, అక్రమ నిర్మాణాల విషయంలో వారు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర వివాదాస్పదం అవుతున్న తరుణంలో ఏసిబి ఎంట్రీ పట్ల శేరిలింగంపల్లి సామాజికవేత్తలు ఎంతోకొతూహలాన్ని వ్యక్తం చేస్తుండడం గమనార్హం. ఏసిబి అధికారులు నిజాయితీగా దర్యాప్తును కొనసాగిస్తే వేలకోట్ల రూపాయల అవినీతి బహిర్గతమవుతుందని, ఆ సొమ్ము ప్రభుత్వానికి సొంతమవుతుందని, కాబట్టి రాష్ట్ర ఉన్నతాధికార వర్గం ఎలాంటి లాలూచీ కార్యక్రమాలకు తలగకుండా శేరిలింగంపల్లి అవినీతి తిమింగలాలను చెరబట్టి శేరిలింగంపల్లిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా ఏసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలోని ఐదు బృందాలు టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, మరియు బయోడైవర్సిటీ విభాగాల్లో ఏకకాలంలో తనిఖీలను కొనసాగిస్తున్నాయని, అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వైఫల్యం చెందడమే కాకుండా వాటికి నోటీసులు జారీచేసి ఆపై చర్యలు తీసుకోకుండా ముడుపుల కోసం బేరసారాలకు దిగుతున్నారనే స్పష్టమైన ఆధారాలు అధికారులకు లభించినందునే వారు కచ్చితంగా దాడులను కొనసాగిస్తున్నారని కార్యాలయ ఉద్యోగులు చెప్పుకుంటుండడం విశేషం. గత 10 నెలల్లో సుమారు 450 అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చినా... ఎలాంటి పురోగతి లేకపోవడంపై అధికారులు ఆరా తీస్తూ సిబ్బందిని వివరణ కోరుతున్నట్లు సమాచారం అందుతోంది.

# క్రీడా ప్రాంగణాలపై పట్టింపేది ?

### పిచ్చి మొక్కలు, పొదలు, తాగుబోతులకు అడ్డగా క్రీడా ప్రాంగణాలు




**మర్పల్లి (జనంసాక్షి):** ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఉల్లాసానికి శారీరత్వానికి క్రీడలు ఎంతగానో దోహ దపడతాయి. గ్రామీణ ప్రాంతాలలో యువకులు, విద్యార్థులు ఆడుకోవడం తో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తూ వారిలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం లక్షలాది రూపాయలను వేచించి అనేక గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. మండలంలోని ప్రతి గ్రామానికి స్థలాలు కేటాయించి నిధులను మంజూరు చేసింది. వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో క్రీడా ప్రాంగణాలు పొదలు, పిచ్చి మొక్కలతో, తాగుబోతులకు అడ్డాగా హస్తవ్యస్తంగా మారిపోయాయి. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం లోని కొత్లాపూర్ గ్రామంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన క్రీడా ప్రాంగణం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. క్రీడా ప్రాంగణం చుట్టూ ముళ్ళ పొదలు పెరిగిపోవడంతో పాటు విషసర్పాలకు ఆవాసంగా మారిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.క్రీడలను అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాంగణం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై పాడైపోయింది. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి చాలా వరకు విరిగిపోవడంతో ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు కూడా విరిగిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉండటంతో ఎవరైనా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రీడా ప్రాంగణం మొత్తం ముళ్ళ పొదలు చెత్తా చెదారంతో నిండిపోయి దరిద్రంగా తయారైంది. ఇక ఈ ప్రాంగణం కొందరు మందుబాబులకు అడ్డాగా మారిందని, సాయంత్రం సమయాల్లో యువత క్రీడలు ఆడాల్సిన స్థలం అసాంఘిక కార్యకలా పాలకు కేంద్రంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేసి మరమ్మతులు చేపట్టి గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# చిట్టి బుర్రలకు మరింత పదును ఇన్స్పైర్ పోటీలు

### ఇన్స్పైర్ మనక్ పోటీలకు ఎంపికైన కమ్మదనం గురుకుల అమ్మాయిలు



**ఫరూక్ నగర్, (జనంసాక్షి) :** విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును పెట్టి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వైజ్ఞానిక ప్రదర్శన,ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమ్మదనం ఇంచార్జి ప్రిన్సిపాల్ శారద అన్నారు.ఇటీవల సైన్స్ దినోత్సవం సందర్భంగా కమ్మదనం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కళాశాలలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మానక్ అవార్డు 2025-26కు కమ్మదానం పాఠశా లకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికైయ్యారని ప్రిన్సిపాల్ శారద మీడియా కు తెలిపారు.పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి శాలిని,ఓ.సహస్ర తమ వినూత్న ఆవిష్కరణ ఆలోచనలతో ఈ అవార్డుకు ఎంపికయ్యారు.ఈ అవార్డు కింద ఒక్కో విద్యార్థికి తమ ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం రూ.10,000 ప్రైజ్ మని మంజూరు చేయబడిందన్నారు.ఫరూఖ్‌నగర్ మండలం నుంచి మొత్తం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఎంపిక కాగా అందులో ఇద్దరు అమ్మాయిలు కమ్మదనం రెసిడెన్షియల్ పాఠశాలకు చెందినవారు కావడం విశేషం ఈ సందర్భంగా పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి శారద మాట్లాడుతూ,ఇన్‌స్పైర్ మానక్ అవార్డు 2025--26కు గురుకుల అమ్మాయిలు ఎంపిక కావడం గర్వకారణంగా నిలిచిందన్నారు.ఎంపికైన విద్యార్థినులను అభినందించి,వారి ప్రతిభను కొనియాడారు.అలాగే వారికి మార్గదర్శకత్వం అందించిన గైడ్ టీచర్స్ నీ అభినందించారు.విద్యార్థులు మున్ముందు భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆవిష్కరణలతో ముందుకు సాగి మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# సెస్‌లో ఎహెచ్‌ల 72 గంటల పాటు విధుల బహిష్కరణ



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మార్చి 6 (జనంసాక్షి):** సెస్ లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ హెల్పర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11 నుండి 14 వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఈ నెల 11 ఉదయం 6 గంటల నుంచి 14 ఉదయం 6 గంటల వరకు విధులు సెస్ ఉద్యోగులు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల చెల్లించే ఎన్టీఏను 8 నెలల నుండి నిలిపివేశారన్నారు.విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు రెగ్యులర్ చేయలేదని తెలిపారు అసిస్టెంట్ హెల్పర్ పేరుకే పెట్టి తక్కువ వేతనాలు ఇవ్వడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ టౌన్ సిబ్బంది ఎస్ రాంబాబు,పీ కొండయ్య, బి.రాజేష్, టి.అర్జున్, ఏ.మల్లేశం పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో తుమ్మ ఇషాన్ ప్రతిభ

### బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపిక



**కరీంనగర్ టౌన్ (జనంసాక్షి):** కరీంనగర్ నగరానికి చెందిన తుమ్మ ఇషాన్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మార్చి 02న కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్చరీ పోటీల్లో ఇషాన్ ఈ ఘనత సాధించాడు. కరీంనగర్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తుమ్మ ప్రవీణ్ కుమార్ తనయు డైన తుమ్మ ఇషాన్, ఈ పోటీల్లో అండర్-13 కాంపౌండ్ విభాగ ంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. తన గురి తప్పని నైపుణ్య ంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు.జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన ఇషాన్, ఈ మార్చి 8వ తేదీన హైదరాబాద్ లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఇషాన్ తల్లిదండ్రులు కోచ్ అభిషేక్ అతడిని ప్రత్యేకంగా అభినందించారు. ఇషాన్ సాధించిన ఈ విజయం పట్ల కరీంనగర్ ఆర్చరీ క్రీడాకారులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేసారు.

# నిర్మల్ అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం : అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



**నిర్మల్ బ్యూరో,(జనంసాక్షి):** నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లను నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగు చ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం మున్సిపాలిటీ తరఫున పూర్తి సహకా రం అందిస్తామని చైర్మన్ అప్పాల కావ్య తెలిపారు. నగరంలోని మౌలిక వసతుల మెరుగుదల, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి అంశాల్లో జిల్లా యంత్రాంగం సహకారం అవసరమని వారు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడు తూ జిల్లా అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వ యంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన సూచించారు.

# జగదీశ వీరుడితో అతి వసూళ్ల పోరు

- ఆర్టీఓ కార్యాలయంలో కలెక్షన్ వార్
- పైసల వసూల్ కోసం పోటీ
- సొంత మనిషిని నియమించుకున్న బాస్



**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి) :** ఖమ్మంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక్కొక్కరిది ఒక్కో తీరు. ఏ కార్యాలయమైనా వసూళ్ల మయం గా మారింది. కొన్ని శాఖలు బజారున పడుతున్నాయి. మరికొన్ని నిశబ్దంగా తమ పని తాము కానిస్తున్నాయి. నిఘా వ్యవస్థ లేకపోవడంతో శాఖాధికారుల విచ్చలవిడి దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఖమ్మం ఆర్టీఓ కార్యాలయంలో డిసెంబర్ 20న ఏసిబి సోదాలు నిర్వహించారు. ఆ ఘటనతో అందరు ఉలిక్కిపడ్డారు. ఆ సమయంలో ఆర్టీఓ కార్యాలయంలో కలెక్షన్ కోసం నియమించిన ఏజెంట్ నవీన్ లక్షల రూపాయలు తీసుకుని పరారైనట్లు సమాచారం. నవీన్ కోసం ఏజెంట్లు , అధికారులు అనధికారికంగా ఆరా తీస్తున్నారు. నవీన్ ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఆ ఘటన తర్వాత యంవిఐ వెంకట రమణ సెలవు పై వెళ్లారు. వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టినట్లు చెబుతున్నప్పటికీ అంతర్గత విభేదాలు తలెత్తడంతో సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో కొత్తగా జే. శ్రీనివాస్ ను ఖమ్మం బదిలి పై ఆర్టీఓ తీసుకువచ్చారు. వెంకట రమణ బాధ్యతలన్నీ శ్రీనివాస్ కు అప్పగించారు. అప్పటికే అన్నింటి పై పట్టు సాధించిన వెంకట రమణ తనకు ప్రస్తుతం ఇచ్చిన బాధ్యతలతో అసంతృప్తితో ఉన్నట్లుగా సమాచారం. అన్ని సర్దుకున్న తర్వాత వద్దామనుకున్న వెంకటరమణకు శ్రీనివాస్ రూపంలో ఓ అడ్డంకి ఏర్పడింది. కలెక్షన్ బాధ్యతలు సైతం శ్రీనివాస్ కు అప్పగించినట్లు సమాచారం. దీని పై ఏసిబి అధికారులు సైతం ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీఓ కార్యాలయంలో 63 మంది ఏజెంట్లు ఉన్నారు. ప్రతి రోజు వారి నుంచి లక్షల రూపాయలు వసూలవుతున్నాయి. ఒక కోడ్ ని వాడుకుంటూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. నవీన్ పరారీ కావడంతో అతని స్థానంలో బాస్ ఆదేశాల మేరకు వెంకట్రావు అనే ఏజెంట్ ని నియమించుకున్నారు. ఇప్పుడు కలెక్షన్ అంశాలన్ని బాస్ మనిషే పూర్తిగా చూసుకుంటున్నట్లు సమాచారం. కీలకమైన వసూళ్ల బాధ్యత నుంచి మొదలు అన్ని తానే నిర్వహిస్తున్నట్లు తెలుస్తున్నది. కొత్తగా వచ్చిన అధికారి వాహనాల తనిఖీల ద్వారా భారీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖమ్మం ఆర్టీఓ కార్యాలయంలో విస్తృతమైన అవినీతి, దళారుల జోక్యం, లంచాల డిమాండ్ సర్వసా ధారణంగా మారాయి. వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ల జారీలో అక్రమాలు, నగదు లావాదేవీలు ఏసీబీ దాడుల్లో తరచుగా వెలుగు చూస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం , భద్రాద్రి ఆర్టీఓ కార్యాలయాల్లో అక్రమ సొమ్ము, ఏజెంట్ల హవా బయటపడే అవకాశం ఎక్కువగా ఉంది. దరఖాస్తుదారులు నేరుగా వస్తే పనులు ఆలస్యం చేయడం, ఏజెంట్ల ద్వారా వస్తే త్వరగా చేయడం సాధారణంగా మారింది. డ్రైవింగ్ పరీక్షలు సరిగ్గా నిర్వహించకుండా, లంచాలు తీసుకుని లైసెన్సులు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాత వాహనాలకు కూడా లంచాలు తీసుకుని ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆర్టీవో కార్యాలయాల్లో అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు పనిచేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అవినీతిని అరికట్టేందుకు ఏసీబీ అధికారులు ఆర్టీఓ కార్యాలయాల్లో ప్రత్యేక నిఘా ఉంచి, సస్పెక్ట్ చెక్స్ నిర్వహించనున్నట్లు సమాచారం. అధిక నిబంధనలు, సంక్లిష్టమైన లైసెన్సింగ్ విధానాలు, అపారదర్శక బ్యూరోక్రసీ కారణంగా ప్రజలు ఏజెంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

# తెలంగాణలో 'శాలువా' సందడి

- పెరిగిన సన్మానాల క్రేజ్
- గల్లీ నుండి ఢిల్లీ దాకా సన్మానాలే సన్మానాలు



**కొందుర్గు (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో సరికొత్త సంస్కృతికి తెరలేచింది. ఆత్మీయతకు, గౌరవానికి ప్రతీకగా నిలిచే 'శాలువా' ఇప్పుడు ప్రతి వేడుకలోనూ ప్రధాన ఆకర్షణగా మారుతోంది. ఉత్సవాలు, జన్మదిన వేడుకలు, ప్రారంభోత్సవాలు.. సందర్భం ఏదైనా సరే, అతిథులను శాలువాతో సన్మానించడం ఇప్పుడు ఒక సంప్రదాయంగా, ఒక గౌరవప్రదమైన అలవాటుగా రూపాంతరం చెందింది. ఒకప్పుడు కేవలం రాజకీయ సభలు, అధికారిక కార్యక్రమాలకే పరిమితమైన శాలువా సన్మానాలు, ఇప్పుడు గల్లీ నుంచి ఢిల్లీ దాకా సామాన్యుల వేడుకల్లోనూ భాగమయ్యాయి. పుట్టినరోజు వేడుకల్లో పెద్దల ఆశీస్సులు తీసుకునేటప్పుడు, స్నేహితులు ఒకరినొకరు అభినందించుకునేటప్పుడు శాలువా కప్పి గౌరవించుకోవడం విశేషం. ఈ సంస్కృతి మనుషుల మధ్య బంధాలను బలపరుస్తూనే, పెద్దరికాన్ని గౌరవించే విధానానికి అద్దం పడుతోంది. సన్మానాల పరంపర పెరగడంతో శాలువాలకు మార్కెట్‌లో విపరీతమైన గిరాకీ పెరిగింది. సాధారణ క్లాత్ స్టోర్ల నుంచి పెద్ద పెద్ద షోరూమ్‌ల వరకు శాలువాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో కంటే ఇప్పుడు అమ్మకాలు రెట్టింపు అయ్యాయని వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రంగురంగుల డిజైన్లు, మెత్తటి వస్త్రాలతో కూడిన శాలువాలు కస్టమర్లను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. శాలువాల గిరాకీ పెరగడం కేవలం వ్యాపారులకే కాకుండా, వీటి తయారీపై ఆధారపడ్డ అనేక నిరుపేద కుటుంబాలకు, చేనేత కార్మికులకు వరంగా మారింది. ముఖ్యంగా గ్రామాల్లో, పట్టణాల్లో చిన్న చిన్న కుటీర పరిశ్రమల ద్వారా శాలువాలు తయారు చేసే వారికి ఇప్పుడు చేతినిండా పని దొరుకుతోంది. తక్కువ ధరలో నాణ్యమైన శాలువాలు లభిస్తుండటంతో సామాన్యులు కూడా వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

## అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ కార్యక్రమం



**చేవెళ్ల, (జనంసాక్షి):** చేవెళ్ల స్థానిక శ్రీ సాయి చైతన్య స్కూల్ లో శుక్రవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రం స్టేషన్ ఎస్ఎఫ్ఓ రవీందర్ రెడ్డి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకో వాల్సిన జాగ్రత్తలు, తక్షణం ఎలా స్పందించాలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం స్టేషన్ సిబ్బంది, సాయి చైతన్య స్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ట్రైకస్పిడ్ క్లిప్ చికిత్స

### నిర్వహించిన హైదరాబాద్ గ్లెనీగల్స్ హాస్పిటల్



**ఖైరతాబాద్, (జనంసాక్షి) :** భారత గుండెవైద్య రంగంలో కీలక మైలురాయిగా గ్లెనీగిల్స్ హాస్పిటల్స్(ఫోర్టిస్ నెట్వర్క్) వైద్యులు దక్షిణ భారతంలో తొలిసారి ట్రాన్సాకాథెటర్ ట్రైకస్పిడ్ వాల్వ్ ఎడ్జ్-టు-ఎడ్జ్ రిపేర్(టి-టీర్) చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ ఎం. సాయి సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలా తీవ్రమైన గుండె సమస్యతో బాధపడు తున్న 75 ఏళ్ల రోగికి ఈ చికిత్స అందించామని తెలిపారు. ఈ చికిత్సలో ఛాతీ భాగాన్ని తెరవాల్సిన అవసరం ఉండదు, అందు వల్ల రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే శరీరంపై పడే ఒత్తిడి కూడా తక్కువగా ఉంటుందన్నారు. ము ఖ్యంగా వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న రోగులకు ఇది చాలా ప్రయోజనకరమని పేర్కొన్నారు. దేశంలో స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన టీర్ వ్యవస్థ 'మైక్లిప్'ను అమర్చడం కూడా ఇదే తొలిసారి అన్నారు. ఇది ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సకు అనుకూలం కాని, అధిక ప్రమాదం ఉన్న రోగులకు సులభమైన విధానంలో అందుబాటులోకి వచ్చిన సరికొత్త చికిత్స అన్నారు.

### హరియా కుటుంబానికి

# 10 లక్షల హెల్త్ పాలసీ



**ఇబ్రహీంపట్నం, (జనంసాక్షి) :** మంచాల మండల పరిధిలోని వెంకటేశ్వర్ల తండాలో మృతిచెందిన హరియా కుటుంబానికి అదే గ్రామానికి చెందిన జర్నలిస్టు అంజి అండగా నిలిచాడు. అంజి తన స్నేహితుల ద్వారా డబ్బులు పోగుచేసి రూ.హరియా కుటుంబానికి రూ. పది లక్షల హెల్త్ పాలసీ చేయించి మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. కష్టకాలంలో తోడుగా నిలబడటం నిజమైన నాయకత్వమని పలువురు గ్రామస్తులు కొనియాడారు. హరియా కుటుంబానికి భవిష్యత్తులో వైద్య భద్రత కల్పించాలనే ఉద్దేశంతో చేసిన ఈ సహాయం అందరికీ ఆదర్శంగా నిలవాలని వారంతా కోరారు. అంజి, తన స్నేహితుల సేవాభావానికి జాటోత్ రాము జోగు శంకర్ జాటోత్ జహిందర్, జాటోత్ యాదగిరి, సంతోష్ , శివప్రసాద్, బాలు, లక్ష్మణ్, వెంకటేష్, శ్రీకాంత్, చింటూ, వెంకటేష్, పరమేష్, ప్రవీణ్, కృతజ్ఞతలు తెలిపారు.

## నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తా

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. శుక్రవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయంలో ఐడిపిఎల్ వర్కర్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వ కంగా కలిసి కాలనీలోని మురుగునీరు, బీటీ రోడ్డు మరమ్మత్తు పనులు తోపాటు పలు సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన కథ 12 ఏళ్ల కాలం నుండి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో కోట్లాది రూపాయలు నిధులను వెచ్చించి అభివృద్ధి పరచాలని తెలిపారు. మౌలిక సమస్యలు నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రానున్న రోజులలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను మరింత అభివృద్ధి పరిచి ఆదర్శవంతమైన నియోజక వర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టి శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్‌విఎన్ వాసు కుమార్, కాలనీవాసు లు ఎస్ మధు, బి యాదగిరి, కేశవరావు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం, సరైన ప్రాతినిధ్యమే ప్రజాస్వామ్యానికి పునాదులు

### ఓయూవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్




**సికింద్రాబాద్ (జనంసాక్షి):** సామాజిక న్యాయం, సమానత్వం, సరైన ప్రాతినిధ్యం అనేవి శక్తివంతమైన ప్రజాస్వామ్యానికి పునాదులని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం పేర్కొన్నారు. చారిత్రక కారణాల వల్ల వెనుకబడిన వర్గాలకు విద్య, ఉపాధి, పాలనలో సమానఅవకాశాలు కల్పించి,సమగ్ర సమాజాన్ని నిర్మించడమే భారత రాజ్యాంగ లక్ష్యమని ఆయన చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "తెలంగాణలో వెనుకబడిన తరగతులకు 42% రిజర్వేషన్లు - సామాజిక న్యాయం: విధానాలు, సవాళ్లు --భవిష్యత్ కార్యాచరణ" అనే అంశంపై శుక్రవారం రూసా2.0 సౌజన్యంతో జాతీయ సదస్సు నిర్వహించారు. రాజనీతి శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్ట ర్ చలమల్ల వెంకటేశ్వ ర్లు కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిదిగా వీసీ ప్రొఫెసర్ కుమార్ హాజరై మాట్లాడారు. సామాజిక న్యాయం, కలుపుకొని పోయే వృద్ధిపై మేధో పరమైన చర్చలకు, పరిశోధనలకు విశ్వ విద్యాలయాలు వేదికలుగా నిలవాలని ఆయన పిలుపు నిచ్చారు. సామాజికంగాఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ అంశంపై జాతీయ సదస్సును నిర్వహించిన రాజనీతి శాస్త్ర విభాగాన్ని ఆయన అభినందించారు. ప్రజాస్వామ్య చర్చలకు, అభ్యుదయ భావాలకు, సామాజిక న్యాయ పోరాటాలకు ఉస్మానియా యూనివర్సిటీ ఎప్పుడూ అగ్రభాగాన ఉంటుందని ఆయన గుర్తు చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో దామాషా ప్రకారం తగిన ప్రాతినిధ్యం లభించాలంటే వెనుకబడిన తరగతులకు 42% రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్ న్యాయమైనదని పేర్కొన్నారు. మెజారిటీ జనాభా కలిగిన బీసీల అభివృద్ధి ద్వారానే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో బీసీల 42 శాతం బిల్లును ప్రవేశపెట్టి అమలుకు చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీఐఎఫ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు మాట్లాడుతూ...వెనుకబడిన వర్గాల సాధికారతకు రాజ్యాంగపరమైన రక్షణలు, విధానపరమైన సంస్కరణలు, సంస్థాగత యంత్రాంగం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సదస్సులో ప్రముఖ విద్యావేత్తలు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ ఎస్. సుదర్శన్ రావు ,ప్రొఫెసర్ ఎం. స్వర్ణలత ముఖ్య వక్తలుగా పాల్గొని బీసీ రిజర్వేషన్ల ,చారిత్రక, రాజ్యాంగ, రాజకీయ, సామాజిక-ఆర్థిక అంశాలపై లోతైన విశ్లేషణ చేశారు. ఈ కార్యక్రమాన్ని రాజనీతి శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు కన్వీనర్‌గా, విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం.కృష్ణ కుమార్ కో-కన్వీనర్‌గా నిర్వహించారు. డాక్టర్ సబావత్ రవి కూడా కో-కన్వీనర్‌గా వ్యవహరించారు.

# మంచినీటి సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ఫరూఖ్ నగర్, (జనంసాక్షి):** వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోని తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రతిరోజు నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. మండలాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ఎక్కడైనా సరే పైప్ లైన్ లీకేజి జరిగితే తక్షణమే స్పందించి లైకేజీలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి నివేదిక అందించాలని అధికారులను కోరారు. అమృత్ స్కీమ్‌లో భాగంగా చేపడుతున్న ట్యాంక్ ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని కోరారు. అదేవిధంగా మిగిలిన పైప్ లైన్ కనెక్షన్ తో పాటు ట్యాప్ కనెక్షన్లు కూడా త్వరగా ఇవ్వాలని కోరారు. షాద్ నగర్ పట్టణంలో పైప్ లైన్ తవ్వకాలు,కేబుల్ లైన్ తవ్వకాలు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, అనుమతులతో జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కవిత,రోడ్డు , భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సందీప్,అబ్దుల్ బారి,అన్ని మండలాల మిషన్ భగీరథ గ్రిడ్,ఇంట్రా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, మున్సిపల్ డిఇ నరేష్,పబ్లిక్ హెల్త్ డిఇ సాజిద్ ,ఇలియాస్ పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగాయి

### నాగర్ కర్నూల్ కుమ్మెర బాధితులకు న్యాయం చేయాలి విశారదన్ డిమాండ్




**ముషీరాబాద్, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో బీసీ ఎస్సీ ఎస్టీలపై కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో దాడులు పెరిగాయని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం హైద్రాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రజక సంఘాల ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ధర్నా లో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుమ్మెర నిందితులపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి కోటి రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఒక ఇల్లు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని వారికి పోలీసుల రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇకపై ఈ ఆందోళన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంగా న్యాయం జరిగే వరకూ బాధితుల తరపున పోరాటం చేస్తామని అన్నారు. ఈ ధర్నాలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం యాదవ్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మెన్ బాలరాజు గౌడ్, విమలక్క , సంధ్య, కుమ్మెర బాధితులు , పెద్ద ఎత్తున బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## సివిల్స్ పరీక్షా ఫలితాల్లో అమిగోస్ విద్యార్థుల ప్రతిభ




**ముషీరాబాద్, (జనంసాక్షి):** సివిల్స్ పరీక్షా ఫలితాల్లో అమిగోస్ ఐఏఎస్ అకాడమీ అభ్యర్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రోగ్రాం డైరెక్టర్ మధు మెంటర్స్ జయేందర్ పెంచలయ్య నిఖిల్ లు మాట్లాడుతూ సివిల్స్ ఫలితాలలో తమ అకాడమీ అభ్యర్థులు తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ముఖ్యంగా శ్రీకాకుళం కు చెందిన రాము 463 ర్యాంకు సాధించగా, కేరళకు చెందిన కాజల్ రాజ్ ఎంత 167 167 ర్యాంక్స్ , యశ్వంత్ కుమార్ 409, శ్రవణ్ కుమార్ 768 ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా వీరిని అకాడమీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కఠోర శ్రమ, క్రమశిక్షణతో కూడిన శిక్షణ పొందడం ద్వారా ఈ ర్యాంకులు సాధించామని తెలిపారు.

## భార్యపై బ్లేడుతో దాడి చేసిన భర్త



**కొందుర్గు (జనంసాక్షి) :** కుటుంబ కలహాలు చివరకు రక్తపాతానికి దారితీశాయి. క్షణికావేశంలో ఓ భర్త తన భార్యపై బ్లేడుతో విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం గంగన్నగూడ గ్రామంలో చోటుచేసుకుంది. ఘటన వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పసుల అమృత, యాదయ్య దంపతుల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆగ్రహానికి లోనైన భర్త యాదయ్య, భార్య అమృతపై బ్లేడుతో దాడికి తెగబడ్డాడు. ఆమె చేతులపై బ్లేడుతో తీవ్రంగా గాయపరచడంతో అమృత రక్తపు మడుగులో కుప్పకూలిపోయింది. గమ నించిన స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం షాద్ నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కొందుర్గు పోలీసులు రంగంలోకి దిగారు. నిం దితుడు యాదయ్యపై బిఎన్ఎస్ 85, బిఎన్ఎస్ 118(1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యా ప్తు చేపట్టినట్లు కొందుర్గు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

# కౌన్సిలర్లుగా ప్రమాణస్వీకారం చేయని ఆ నలుగురు

- ఆలస్యం వెనుక ఆంతర్యం ఏంటీ?
- రాజకీయ వ్యూహామా.. పైస్థాయి నేతల సూచనా..?
- వికారాబాద్ పట్టణంలో జోరుగా సాగుతున్న చర్చ




**వికారాబాద్ (జనంసాక్షి):** ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లు ఫిబ్రవరి 17న ప్రమాణ స్వీకారం చేసి, చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎన్నుకున్నారు, అన్ని మున్సిపాలిటీలలో మాదిరిగానే వికారాబాద్ మున్సిపల్‌లో గెలుపొందినవారిలో బిజెపి పార్టీ నుండి గెలుపొందిన నాలుగు కౌన్సిలర్‌లు మినహాయించి మిగతా వారు ప్రమాణ స్వీకారం చేసి, చైర్మన్ వైస్ చైర్మన్ లను ఎన్నుకున్నారు, గెలిచి చాలా కాలం గడిచినా కూడా ఇప్పటివరకు ప్రమాణ స్వీకారం చేయని బిజెపి కౌన్సిలర్ల వ్యవహారం పట్టణంలో చర్చనీ యాంశంగా మారింది. ప్రజలు, సామాజిక వర్గాలు ఈ విషయంపై గుసగుసలాడుతున్నారు. ఎన్నికలలో ప్రజల మద్దతుతో గెలిచిన ప్రజాప్రతినిధులు బాధ్యతలు స్వీకరించకుండా ఆల స్యం చేయడం వెనుక అసలు ఆంతర్యం ఏమిటి అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రజల అభిప్రాయం ప్రకారం, బిజెపి కౌన్సిలర్లు ఇప్పటికీ ప్రమాణ స్వీకారం చేయక పోవడం వెనుక ఏదైనా రాజకీయ వ్యూహం ఉందా? లేకపోతే వారిని ఎవరో ప్రభావితం చేస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొంత మంది అయితే ఈ నిర్ణయం స్వత ంత్రంగా తీసుకున్నదా లేక పై స్థాయి నాయకత్వం సూచనలతో జరుగుతోందా అనే అంశంపై కూడా చర్చిస్తున్నారు. ఇప్పటికే మున్సిపల్ అభివృద్ధి కి సంబంధించిన పలు పనులు, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం కౌన్సిల్ సమావేశాల్లో చర్చకు రావాల్సి ఉన్నప్పటికీ, ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టక పోవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన బాధ్యతలను వెంటనే స్వీకరించి సేవ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇక బిజెపి కౌన్సి లర్లు ప్రమాణ స్వీకారం ఎప్పుడు చేస్తారు? దీనిపై స్పష్టత ఎప్పుడు వస్తుంది? అనే ప్రశ్నలకు సమాధానం కోసం వికారాబాద్ ప్రజలు ఎదురు చూస్తున్నారు. తాండూర్‌లో కూడా బిజెపి కౌన్సిలర్‌లు ఇప్పటికి ప్రమాణ స్వీకారం చేయలేదు, వికారాబాద్ జనంసాక్షి ప్రతినిధి వికారాబాద్‌లో గెలుపొందిన కౌన్సిలర్లతో మాట్లాడగా కౌన్సిలర్లు ప్రమాణస్వీకారం చేయించిన రోజు అమావాస్య ఉన్నదనే కారణంగా ప్రమాణ స్వీకారం చేయలేదని త్వరలో జరగబోయే మొదటి కౌన్సిల్ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేసి కౌన్సిల్ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

# కూతుర్లు,కుమారులకే ఆప్షన్

- కోడండ్లకు నో ఆప్షన్
- భార్యాభర్తలను విడివిడిగా చేస్తున్న ఓటర్ మ్యాపింగ్
- తలలు పట్టుకుంటున్న అధికారులు



**ధారూర్ మర్చి 06 (జనంసాక్షి):** కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లా ధారూర్ మండలంలో ఓటరు మ్యాపింగ్ జరుగుతోంది.బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ)లు గత కొద్ది రోజులుగా ఓటర్ల మ్యాపింగ్ నిర్వహిస్తు న్నారు. అయితే పెద్ద సంఖ్యలో ఓటర్ల ఆచూకీ దొరకడం లేదు.ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ.ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు ప్రస్తుతం గ్రామాలలో కనిపించకపోవడంతో అధికారులను విస్మయానికి గురిచేస్తోంది. ఓటర్ల జాడ దొరక్కపోవడంతో బీఎల్ వోలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.ఓటర్ల మ్యాపింగ్ ముందుకు సాగుతున్న పూర్తిస్థాయిలో ముందు సాగకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఓటర్ల సమాచారం దొరక్కపోయినా స్థానికంగా ఉన్నట్లు మ్యాపింగ్ చేయాలని బీఎల్ వోలపై ఉన్నత అధికారులు ఒత్తిడి చేస్తున్న తెలుస్తుంది.ఇందుకు బీఎల్ వోలు ససేమిరా అంటున్నారు.మొత్తంగా మండలంలో ఓటర్ల మ్యాపింగ్ అనుకుంతాగా ముందుకు కొనసాగడం లేదు.ఓటర్ల జాబితాలోని తప్పులను సరిచేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా చర్యలు తీసుకోని ముమ్మరంగా సవరణ(సర్) చేస్తున్న విషయం తెలిసిందే.ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో సర్ ను పూర్తి చేసి ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేస్తోంది.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కూడా చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే.సర్ కార్యక్రమం ప్రారంభానికి ముందు అన్ని జిల్లాల్లో ఓటర్ల మ్యాపింగ్ చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.దీంతో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఓటర్లను మ్యాపింగ్ చేయించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని బీఎల్ ఓల ద్వారా చేయిస్తున్నారు.అయితే మండలంలో వివిధ గ్రామాలలో ఓటర్ల ఆచూకీ కనిపించడం లేదని తెలుస్తోంది.ముఖ్యంగా మండలంలో పెద్ద గ్రామ పంచాయతీల లో కొంత మంది ఓటర్ల జాడ కనిపించడం లేదని బీఎల్ ఓలు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం. గ్రామాలలో ఉండే కొంతమంది బ్రతుకు తెరువుకోసం వివిధ పట్నలలో ఉంటూ పనులు చేసుకొంటూ ఉన్నారు. ఏది ఏమైనా ఓటర్ మ్యాపింగ్ ను నాన్న తిపలు పడుతూ కష్టాలు ఎదుర్కొంటూ బిఎల్ ఓలు ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో బిజీ బిజీగా ఉన్నారు.



# 8, 9 తేదీల్లో మెగా రైతుమేళా


- అగ్రికల్చర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య



**హైదరాబాద్, మార్చి 6 (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 8,9 తేదీల్లో మెగా రైతు మేళాను నిర్వహిస్తున్నామని విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయంలో రైతు మేళాను విజయవంతం చేయాలని కోరారు. మహిళా రైతుల సాధికారిత లక్ష్యంగా నిర్వహించనున్న ఈ మేళకు సుమారు 8 నుంచి 10 వేల మంది మహిళా రైతులు హాజరవుతున్నారని వివరించారు. రెండు రోజుల మెగా మహిళా రైతు మేళాలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లు, వాటి పరిష్కారాలపై శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్‌కు చెందిన సుమారు మూడు వేల మంది మహిళా రైతులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. వివిధ ఆధునిక సాంకేతిక అంశాలపై సుమారు 70 నుంచి 80 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అధిక రసాయన ఎరువుల వాడకం వల్ల వచ్చే దుష్ప్రభావాలు, మార్కెట్‌లో గిరాకీ ఉన్న వరి రకాల సాగు వంటి అంశాలపై విశ్వవిద్యాలయం విద్యార్థిని, విద్యార్థులచే ఆటా, పాట కార్యక్రమాలుంటాయని తెలిపారు.

# అయోధ్యలో అమితాబ్ భూమి కొనుగోలు

- రూ.35 కోట్లతో 2.67 ఎకరాల భూమి సేకరణ



**అయోధ్య, మార్చి 6 (జనంసాక్షి) :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక నగరం అయోధ్యలో బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ భారీ పెట్టుబడి పెట్టారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ హౌస్ ఆఫ్ అభినందన్ లోధా నుంచి రూ.35 కోట్లతో 2.67 ఎకరాల విస్తీర్ణం కలిగిన స్థలాన్ని కొనుగోలు చేశారు. సంబంధిత లావాదేవీని శుక్రవారం పూర్తి చేసినట్లు లోధా సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. అయోధ్యలో అమితాబ్ ఇప్పటికే పలు పెట్టుబడులు పెట్టారు. ఒక్క లోధా ప్రాజెక్ట్‌ల్లో మూడు చోట్ల, మొత్తంగా అయోధ్యలో నాలుగు చోట్ల పెట్టుబడులు పెట్టారు. అయోధ్య రామ మందిరానికి దగ్గర్లో లోధా సంస్థ అభివృద్ధి చేసిన సరయు ప్రాజెక్ట్‌లో 2024 జనవరిలో అమితాబ్ తొలుత స్థలం కొనుగోలు చేశారు. ఈ ప్రాజెక్ట్‌కు దగ్గర్లోనే తాజాగా మరో స్థలాన్ని అమితాబ్ తాజాగా కొన్నారు. ఇది కాకుండా 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక ప్లాట్‌ను లోధా నుంచి గతంలో కొనుగోలు చేశారు. అమితాబ్ బచ్చన్ పెట్టుబడుల వెనుక దీర్ఘకాలిక వ్యూహం, అయోధ్యపై ఉన్న ఆయకున్న విశ్వాసాన్ని తెలియజేస్తున్నాయని లోధా గ్రూప్ ఛైర్మన్ అభినందన్ లోధా పేర్కొంది. దేశంలో అతిపెద్ద ల్యాండ్ డెవలపర్‌గా ఉన్న హౌస్ ఆఫ్ లోధా.. ఇప్పటికే పలు నగరాల్లో సేవలందిస్తోంది. దేశవ్యాప్తంగా 48 నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# బేగంపేట వాతావరణ శాఖ కార్యాలయానికి బాంబు బెదిరింపు

- తనిఖీలు చేపట్టి ఫేక్ కాల్‌గా గుర్తింపు




**హైదరాబాద్, మార్చి 6 (జనంసాక్షి) :** ఇటీవల విమానాశ్రయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు 'ఫేక్ బాంబ్ బెదిరింపులు' రావడం ఎక్కువైంది. తాజాగా.. హైదరాబాద్‌లోని బేగంపేటలో బాంబు బెదిరిం పు కలకలం రేపింది. వాతావరణ శాఖ కార్యాలయానికి వచ్చిన ఈ బెదిరింపుతో పోలీసులు అప్రమత్తం అయ్యారు. వెంటనే కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. బాంబు బెదిరింపుతో కార్యాలయంలోని సిబ్బంది, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ కేంద్రానికి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు రావడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు కార్యాలయం అంతటా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. నిత్యం వాతావరణ సమాచారంతో బిజీగా ఉండే అధికారులు, సిబ్బంది ఈ ఆకస్మిక పరిణామంతో తీవ్ర టెన్షన్‌లో ఉన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సిబ్బందిని కార్యాలయం బయటకు పంపినట్లు సమా చారం. ఇటీవల 'ఫేక్ బాంబ్ బెదిరింపులు' రావడం ఎక్కువైంది. ఇది కూడా అలాంటి ఆకతాయిల పని అయి ఉంటుందని ప్రాథమి కంగా భావిస్తున్నప్పటికీ, పోలీసులు ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తనిఖీలు కొనసాగి స్తున్నారు. ప్రజలు భయాందోళన చెందవద్దని, పోలీసులు పరిస్థితిని సమీక్షిస్తున్నారని అధికారులు తెలిపారు. నిందితులను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ విభాగం కూడా రంగంలోకి దిగినట్లు సమాచారం.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలి

- లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలి
- రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలి : మంత్రి కొండా సురేఖ




**మహబూబాబాద్ బ్యూరో, మార్చి 06(జనం సాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై మహబూబాబాద్ ఐడీఓసి కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ రవీందర్ రావు, శాసన సభ్యులు మురళి నాయక్, దొంతి మాధవరెడ్డి, రాజేందర్ రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కూడా చైర్మన్ ఇనుగల వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నెల 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తీర్చాలని, అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో కూడా వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల ని, ఎలాంటి కొరత ఉండకుండా చూడాలని సూచించారు. ఉపయోగంలో లేని వైద్య పరికరాలను తొలగించి, అవసరమైన పరికరా లకు తగిన సిబ్బందిని నియమించి వాటిని సమర్థంగా వినియోగంలోకి తేవాలని పేర్కొ న్నారు. పాఠశాలల వాహనాలు ఫిట్ నెస్ లేకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిపిఆర్‌ఎస్ ద్వారా పాఠశాల వాహనాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. స్లమ్ ఏరియాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలి, ఎక్కడైనా నిధులు మంజూరు సమస్య ఉంటే నివేదికలు పంపాలని తెలిపారు. ప్రతి హాస్టల్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించి తనిఖీలు చేయాలని, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాభితా తయారు చేయాలని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్లు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని, గ్రౌండ్ కాని ఇండ్లు లబ్ధిదారుల నుండి అంగీకారాన్ని తీసుకుని రద్దు చేయాలని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కార స్థితిని దరఖాస్తుదారులు తెలుసుకునేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి సమాచారం వారి సెల్‌ఫోన్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలికల వసతి గృహాల్లో ఇన్సినిరేటర్లు ఏర్పాటు చేయాలని, మండల స్థాయిలో ఆరోగ్య సదస్సులు నిర్వహించి వైద్య పరీక్షలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఛైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

# హుజుర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల రహదారులకు మహర్దశ

**రూ. 130 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

- 49 కిలో మీటర్ల సింగిల్ రహదారులకు, డబుల్ రోడ్ల ఏర్పాటుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్
- ఫలించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల కృషి
- ఆ రహదారులపై చెరగని కెప్టెన్ ముద్ర



హుజూర్ నగర్, మార్చి 6 (జనంసాక్షి): హుజూర్ నగర్, కోదాడ నియోజక వర్గాల రహదారులకు మహర్దశ పట్టింది. సింగిల్ రహదారులుగా ఉన్న 49 కిలో మీటర్ల రహదారిని డబుల్ రోడ్లుగా చేసేందుకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లు పట్టుబట్టి సింగిల్ లైన్ రోడ్లను ను, డబుల్ లైన్ రోడ్లు గా మార్చేందుకు చేసిన కృషి ఫలించింది. పాలనా పరమైన అనుమతులతో పాటు ప్రభుత్వం ఏక కాలంలో మేజర్ డిస్ట్రిక్ రోడ్ ప్లాన్ (ఎండిఆర్) కింద 130 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలో రూ.62 కోట్లతో 26.50 కి.మీ ల పొడవున డబల్ రోడ్డు మంజూరు పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తద్వారా ఈ నియోజకవర్గంలో 15 గ్రామాలకు ప్రయాణ సౌకర్యం సులువుగా మారనుంది. కోదాడ నియోజకవర్గ పరిధిలో రూ.68 కోట్లతో 22.60 కి.మీ ల పొడవున డబల్ రోడ్డు ఏర్పాటుకు పాలనా పరమైన అనుమతులు లభించాయి. తద్వారా నియోజక వర్గంలోని 9 గ్రామాలకు రాక పోకలు సులువు కానున్నాయి. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్ నగర్, కోదాడ నియోజక వర్గాల పరిధిలోని సుమారు 49.10 కి.మీల మేర సింగిల్ లైన్ రోడ్డును డబల్ లైన్ రోడ్డుగా మార్చేందుకు మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ ప్లాన్ నిధుల ద్వారా రూ.130 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం నుండి మార్చి 5 న ఉత్తర్వులు జారీ చేసింది.

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రూ.32 కోట్లతో చింతలపాలెం నుండి కిస్టాపురం వరకు 9.20 కిలోమీటర్ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో చింతల పాలెం, శోభనాద్రిగూడెం, అడ్లూరు, తమ్మా రం, కొత్తూరు, కిస్టాపురం గ్రామ ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. రామల క్ష్మీపురం నుండి హుజూర్ నగర్ బైపాస్ రోడ్డు వరకు 3.80 కిలోమీటర్ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో రామలక్ష్మి పురం, యర్రారం, హుజూర్ నగర్ ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. రూ.30 కోట్లతో అమరవరం నుండి కొత్త తండ వరకు 5.50 కి.మీ ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో అమరవరం, అంజలి పురం, కొత్తతండ ప్రజలకు లబ్ధి చేకూరు తుంది. గుడుగుంట్ల పాలెం నుండి ఎల్లాపురం వరకు 8.00 కి.మీ ల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో గుడుగుంట్ల పాలెం, ముసిఒడ్డు సింగారం, ఎల్లాపురం గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.

కోదాడ నియోజకవర్గం పరిధిలో రూ.30 కోట్లతో కోదాడ నుండి అనంతగిరి వరకు 6.60 కి.మీ ల మేర ఏడు మీటర్ల నుండి పది మీటర్ల మేర వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో కోదాడ, ఖానాపురం, అనంతగిరి గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. రూ.24 కోట్లతో ఎన్ హెచ్9 నుండి నేలమర్రి వరకు 10.00 కి.మీల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో తాడ్వాయి తండ, తాడ్వాయి, వెంకట్రాంపురం, నేలమర్రి గ్రామాల ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. రూ.14 కోట్లతో కాపుగల్లు నుండి దొరకుంట వరకు 6.00 కి.మీల మేర సింగిల్ లైన్ నుండి డబల్ లైన్ రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనితో కాపుగల్లు, దొరకుంట ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. ఇదే విషయమై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబందిత అధికారులతో మాట్లాడుతూ తక్షణమే టెండర్లు పిలిచి యుద్ధ ప్రాతిపదికన పనులు మొదలు పెట్టాలని ఆదేశించారు.



## నాచారం బ్రహ్మోత్సవాలకు కేసీఆర్‌కు ఆహ్వానం

**హైదరాబాద్, మార్చి 6 (జనంసాక్షి) :** బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను నాచారం గుట్ట శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం ప్రతినిధులు కలిశారు. ఈ నెల 8 నుంచి 19 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శుక్రవారం ఆహ్వాన పత్రికను, స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భగా ఆలయ అర్చకులు కేసీఆర్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రవీందర్ , ఈవో రంగాచారి, అర్చకులు పాల్గొన్నారు.

## మహిళను వేధించిన కేసులో 18నెలల జైలు


**ఖమ్మం, మార్చి6 (జనంసాక్షి) :** మహిళను వేధించిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి న్యాయస్థానం 18 నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధించింది. కేసు వివరాలు ఇలావున్నాయి.. 2019లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు 24 ఏరియాకు చెందిన ఏర్పుల కృష్ణ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే ఏరియాలో ఉన్న ఓ మహిళను తరచూ వేధింపులకు గురి చేయడంతో ఆ మహిళ ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేసి నివేదికను కోర్టుకు సరెండర్ చేశారు. విచారణలో కృష్ణ దోషిగా తేలడంతో జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు జడ్జి డి.చంద్రిక రెడ్డి తీర్పు వెలువరించారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగు అనిల్ కుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదించగా, సిడిఓ సురేశ్, రాఘవయ్య, హెచ్‌సి అనంత రాములు సహకరించారు.

# ఆపదలో అభం శుభం తెలియని బిడ్డ!

- చికిత్సకు 35 లక్షలు
- పానిపూరి అమ్మే కుటుంబానికి పెద్ద కష్టం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** అభం శుభం తెలియని ఓ బిడ్డ ఆపదలో పడ్డాడు. ఐదో తరగతి చదువుతున్న ఆ విద్యార్థి ఆడి పాడే వయసులో పెద్ద కష్టం వచ్చి పడింది. రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్న దుస్థితి నెలకొంది.

రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం



చేగూర్ గ్రామంలో (యూపీ) ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రనికి చెందిన రవీంద్ర కుమార్, సుమన్ దేవి, బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చి పానిపూరి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఆ బడుగు జీవుల బతుకులపై ఓ పిడుగు లాంటి భారం పడింది. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రనికి చెందిన రవీంద్ర కుమార్ సుమన్ దేవికి ఆషిక్(10) ఉన్నాడు. నెల రోజులుగా బాబు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతు న్నాడని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తే అస్సలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఆశీక్ రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వెంటనే కిడ్నీ మార్పిడి చెయ్యాలని దాని కోసం 35 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని, కుటుంబ సభ్యులు తెలిపారు తము యూపీ రాష్ట్రంలో బ్రతుకుతెరువు లేకనే ఇక్కడికి వచ్చి పానిపూరి అమ్ముకొని జీవనం సాగిస్తున్నమని అలాంటిది అన్ని లక్షల డబ్బులు వెచ్చించి వైద్యం చేయించే స్తోమత తమకు లేదని ప్రభుత్వం దాతలు ఎవరైనా ఆదుకొని తమ కుమారుడికి వైద్యం కోసం సహకరించాలని ఆశిక్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

**5వ తరగతి విద్యార్థికి రెండు కిడ్నీలు ఫెయిల్**



**ఒక్కసారిగా ఆవేదనకు లోనైన స్నేహితులు**

రెండు కిడ్నీలు ఫెయిల్ సమస్యతో గత 20 రోజుల నుండి పాఠశాలకు ఆశిక్ రాకపోవడంతో శుక్రవారం నాడు పాఠశాలకు వచ్చిన విద్యార్థిని ఆశిక్‌ను చూసి తోటి స్నేహితులు ఆవేదనకు లోనయ్యారు. ఆశిక్‌ను దగ్గరకు చేరదీసి పాఠశాలకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఇది స్థానికులను కన్నీటి పర్యంతంగా మార్చింది..



# శ్రీవారిని దర్శించుకున్న కవిత దంపతులు

**నాలుగేళ్ల మనోవేదనకు తెరపడిందని ఆనందం**

**తిరుమల, మార్చి6 (జనంసాక్షి) :** నాలుగేళ్లుగా తాను పడుతున్న మనోవేదన వేంకటేశ్వరస్వామి దయతో తీరిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. తిరుమల శ్రీవారిని ఆమె దర్శించుకున్నారు. తన భర్తతో కలిసి శుక్రవారం వేకువజామున శ్రీవారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. దిల్లీ మద్యం కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంతో శ్రీవారికి మొక్కులు చెల్లించేందుకు కాలినడకన వచ్చానన్నారు. త్వరలో తెలంగాణలో రాజకీయ పార్టీ స్థాపించనున్నట్లు వెల్లడించారు. తనకు కష్టకాలంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. స్వామి దయ తనపై ఉండడం వల్లనే కేసు నుంచి బయటపడ్డానని అన్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370